
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

'మావోయిస్టు రహిత భారత్' కోసం బిజెపి సైనిక విన్యాసం
చైనా నేతృత్వంలో మధ్యవర్తిత్వ సంస్థ
నైజీరియాలో వరదలు 111 మందికిపైగా మృతి
ఇండోనేషియాలో కూలిన క్వారీ
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 340 | శనివారం | 31-05-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## బిజెపిలో బిఆర్ఎస్

# విలీనం తథ్యం!

- బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలే నిదర్శనం
- బిజెపి నేతలు ముందుగా రాజాసింగ్ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలి
- వాటాల కోసం కెసిఆర్ కుటుంబంలో కొట్లాట
- టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం / హైదరాబాద్

బిజెపిలో బిఆర్ఎస్ విలీన యత్నాలపై ఎమ్మెల్సీ కవిత, బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలతో ఆ రెండు పార్టీల లోపాయికారీ ఒప్పందం బట్టబయలైందని కాంగ్రెస్ ఆరోపించింది. వారి వ్యాఖ్యలపై రెండు పార్టీల నాయకులు సమాధానం చెప్పాలని నిలదీసింది. ఇక బిఆర్ఎస్ మునిగిపోయే నావే అని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జోస్యం చెప్పగా, బిజెపిలో బిఆర్ఎస్ విలీనమా? విక్రయమా? అని ఆ పార్టీ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. బిఆర్ఎస్ మునిగిపోయిన నావ అని, నావలో ఉన్న వస్తువుల( డబ్బుల) కోసం కెసిఆర్ కుటుంబంలో కొట్లాట జరుగుతున్నదని, వాటాల కోసం పంచాయితీ మొదలైందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ,బిజెపి ఎమ్మెల్యే రాజా సింగ్ వ్యాఖ్యలతో ముడుపులు , బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం గుట్టు వీడిందన్నారు. కవిత, రాజా సింగ్ ప్రకటనలను పరిశీలిస్తే బిజెపిలో బిఆర్ఎస్ విలీనం తథ్యమన్నారు. రాష్ట్రంలో 8 సీట్లు ఉన్న బిజెపితో కలిస్తే బిఆర్ఎస్ కూడా 8 స్థానాలకు పరిమితమవుతుందన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా తరువాయి 2లో

కాళేశ్వరం విషయంలో నోటీసులు రాగానే కెసిఆర్, ఈటల రాజేందర్‌ల మధ్య పాత బంధం మళ్ళీ చిగురించింది. శామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో హరీష్‌రావుతో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ సమావేశం అయ్యారు. ఇద్దరు కలిసి కెసిఆర్‌తో ఫోన్‌లో సంభాషించారు.
– మహేశ్‌కుమార్‌గౌడ్

## లోపాయికారీ ఒప్పందాన్ని మీడియా ముఖంగా వెల్లడించాలి

ఎంపి చామల



బిజెపి, బిఆర్ఎస్ పార్టీల లోపాయికారి ఒప్పందాలపై రెండు పార్టీల నేతలు రకరకాలుగా మాట్లాడుతున్నారని, అసలు బిజెపిలో బిఆర్ఎస్ విలీనమా? లేక విక్రయమా అనేది రెండు పార్టీల నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించాలని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ నేతలు ఎలా దోచుకున్నారనే అంశంపై బిఆర్ఎస్ ఎంఎల్‌సి తరువాయి 2లో

## కాషాయపార్టీలో కలవడాన్ని

# అస్సలు ఒప్పుకోను



బిజెపిలో బిఆర్ఎస్ కలపడమంటే.. లిక్కర్ కేసులో నేరాన్ని అంగీకరించినట్లే : ఎమ్మెల్సీ కవిత

ప్రజాపక్షం / మంచిర్యాల ప్రతినిధి

బిజెపిలో బిఆర్ఎస్ విలీనం చేయడాన్ని తాను అస్సలు ఒప్పుకోనని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బిజెపిలో బిఆర్ఎస్ కలపడమంటే.. లిక్కర్ కేసులో నేరాన్ని అంగీకరించినట్లే అని వ్యాఖ్యానించారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలు బాగుపడలేదని అన్నారు. మంచిర్యాలలో కవిత శుక్రవారం మీడియా ప్రతినిధులతో 'చిట్‌చాట్' చేశారు. ఎన్నో ఆవేదనలు భరించలేక, పార్టీని కాపాడుకోవాలనే కెసిఆర్‌కు లెటర్ రాశానని తెలిపారు. దానిని ఎవరు లీక్ చేశారో తేల్చాలని డిమాండ్ చేశారు. 'నాకు ప్రత్యేక జెండా.. ఎజెండా లేదు. పార్టీని కాపాడుకోవడమే నా ఏకైక ఎజెండా. కెసిఆర్‌ను కలిసే అవకాశం వచ్చినా కలవలేకపోయాను. పెద్దాయనను ఎవరేమన్నా ఊరుకోను' అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కెసిఆర్‌కు నోటీస్ ఇస్తే ఎందుకు బిఆర్ఎస్ ముఖ్య నేతలు ఎందుకు స్పందించలేదని కవిత ప్రశ్నించారు. లేఖలో ప్రస్తావించిన అంశాలు ప్రజలు అనుకునేవే అని స్పష్టం చేశారు. పార్టీ నుంచి తనను బహిష్కరిస్తారని అనుకోవడం లేదని ఆమె పేర్కొన్నారు. అంతకు ముందు మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా శ్రీరాంపూర్ చేరుకున్న కవిత తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి శ్రీరాంపూర్ ఏరియాలోని బిఆర్ఎస్ యూత్ నేత తరువాయి 2లో

## తప్పు చేసినవారు

# తప్పించుకోలేరు



ఒక్కొక్కటిగా బయటపడుతున్న కెసిఆర్ తప్పులు

కాళేశ్వరం కమిషన్ తుదినివేదిక అందగానే మంత్రివర్గంలో చర్చిస్తాం

ప్రాజెక్టుల అంశంలో ప్రధాన ముద్దాయి ఎల్ అండ్ టి సంస్థే

మీడియా 'ఇష్టాగోష్టి'లో మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

శిశుపాలుని తరహాలో కెసిఆర్ తప్పులు ఒక్కొక్కటిగా తప్పుల జాబితాలో 99 వరకు చేరుకుంటున్నాయని,తప్పు చేసిన వారు తప్పించుకునే పరిస్థితే లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచర పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 'కాళేశ్వరం కమిషన్ తుదినివేదిక' అందగానే మంత్రివర్గంలో చర్చించి, బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాళేశ్వరం అంశంలో ఎల్‌అండ్‌టి సంస్థ ప్రధాన ముద్దాయి అని అన్నారు. బడాబాబుల చేతిలో కబ్జా అయిన అసైన్డ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, ఆ భూముల్లో ఒక వేళ నిరుపేదలు ఉంటే వారికి పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ గృహాలను నిర్మిస్తామని వెల్లడించారు. బిఆర్ఎస్‌లో ఎంఎల్‌సి కవిత వ్యవహారం టి కప్పులు తుఫాను లాంటిదని ఆయన తరువాయి 2లో

## 'కాళేశ్వరం' కమిషన్ నోటీసులపై

# ఎలా వ్యవహరిద్దాం



బిఆర్ఎస్ చీఫ్ కెసిఆర్‌తో మాజీమంత్రి హరీశ్‌రావు భేటీ

గులాబీ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుతో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో మరోసారి శనివారం సమావేశమయ్యారు.'కాళేశ్వరం' కమిషన్ ముందు విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కెసిఆర్‌తో హరీశ్ రావు సమావేశమైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విచారణ సమయంలో వ్యవహరించాల్సిన తీరును, తదితర అంశాలపై వారు చర్చించినట్టు తెలుస్తోంది. విచారణ కమిషన్ ముందు కెసిఆర్ హాజరవుతారా? లేదా? ఒక సమగ్రమైన వివరాలతో కూడిన సమాధాన లేఖను కమిషన్‌కు అందజేస్తారా? అనే అనుమానాలు తరువాయి 2లో



## మిస్ వరల్డ్ ఫైనల్స్ నేడే

మూడంచెల భద్రత-పాస్ ఉన్నవారికే అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ హైటెక్స్ వేదికగా శనివారం జరగనున్న 72వ మిస్ వరల్డ్ గ్రాండ్ ఫైనల్‌కు సర్వంసిద్ధమైంది. ఈ పోటీలకు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. భద్రత చర్యలను పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈవెంట్ పాస్‌లు ఉన్నవారిని మాత్రమే హైటెక్స్‌లోకి అనుమతిస్తామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. పోలీసులకు సైతం ప్రత్యేక పాస్‌లు తరువాయి 2లో



## ఒకే షిఫ్ట్‌లో... 'నీట్ పీజీ-2025'

సుప్రీంకోర్టు కీలక ఆదేశం

**న్యూఢిల్లీ :** జూన్ 15న జరగనున్న నేషనల్ ఎలిజిబిలిటీకమ్‌ఎంట్రన్స్ టెస్ట్‌పోస్ట్‌గ్రాడ్యుయేట్ (నీట్ పీజీ)2025ను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఒక కీలక ఉత్తర్వులను జారీచేసింది.రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడం 'ఏకపక్షాన్ని సృష్టించడమే' అని వ్యాఖ్యానించింది. ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ విక్రమ్ నాథ్ నీట్ పీజీ 2025 ఎగ్జామ్‌ను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.పూర్తి పారదర్శకత పాటించేలా సురక్షిత కేంద్రాలను తరువాయి 2లో

## చీఫ్ ఇంజినీర్ ఇంట్లో రూ.2కోట్ల నోట్ల కట్టలు స్వాధీనం

ఒడిషా విజిలెన్స్‌కు చిక్కిన అవినీతి తిమింగలం..



**భువనేశ్వర్ :** ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఓ భారీ అవినీతి తిమింగలం విజిలెన్స్‌కు చిక్కింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బైకుంత నాథ్ సారంగి నివాసాల్లో భారీ మొత్తంలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. వాటిని చూసి అధికారులు షాక్ గురయ్యారు. సారంగి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు సోదాలు చేపట్టారు. ఒడిశాలోని అంగుల్, భువనేశ్వర్, పూరిలోని పిపిలి సహా మొత్తం ఏడు ప్రాంతాల్లోని సారంగి నివాసాలు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల తరువాయి 2లో



## మూడు రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. బాలాసోర్‌కు 180 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైందన్నారు. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌లో మధ్య తీరం దాటనున్నదన్నారు. ఈ వాయుగుండం తుపానుగా మారే అవకాశం కూడా ఉందన్నారు. రానున్న రెండు రోజులు ఆదిలాబాద్, కొమరంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, తరువాయి 2లో

## రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి

# నల్లగొండ మార్గదర్శకమవ్వాలి

అధికారులు నిర్లిప్తతను వీడి ప్రజాసంక్షేమానికి కట్టుబడి పనిచేయాలి

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు ముందుకు సాగాలి

ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు ముందుకు సాగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అమలులో ఉద్యోగులదే కీలక పాత్ర అని చెప్పారు. శుక్రవారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ధాన్య సేకరణ, వ్యవసాయం, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి పథకాలపై ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించిన సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ మమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరువాయి 12లో

## సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల అమలులో అధికారులు పారదర్శకత పాటించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో తరువాయి 2లో

## నందమూరి బాలకృష్ణకు

# ఎన్టీఆర్ జాతీయ అవార్డు



విజయ్ దేవరకొండకు కాంతారావు పురస్కారం

పదేళ్లకుగాను గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డులను ప్రకటించిన ప్రభుత్వం

ఒక్కో ఏడాదికి మూడు సినిమాల చొప్పున అవార్డుల కోసం ఎంపిక చేసినట్లు జ్యూరీ చైర్మన్ మురళీమోహన్ వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

పదేళ్ల (2014–2023)కాలానికిగాను గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ఆరుగురు సినీ ఉద్ధండుల పేర్లతో ఏర్పాటు చేసిన అవార్డులను కూడా గద్దర్ అవార్డుల జ్యూరీ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఎన్‌టిఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డును నందమూరి బాలకృష్ణకు ప్రకటించగా.. పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డును ప్రముఖ దర్శకుడు మణిరత్నం, బిఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డును దర్శకుడు సుకుమార్, నాగిరెడ్డి చక్రపాణి ఫిల్మ్ అవార్డును అట్లూరి పూర్ణచంద్రరావు, కాంతారావు ఫిల్మ్ అవార్డును విజయ్ దేవరకొండ, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డును ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ కు జ్యూరీ చైర్మన్ మురళీమోహన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం సినిమాలకు అవార్డులు అందించలేదని మురళీమోహన్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉత్తమ సినిమాలకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించి, గద్దర్ పేరుతో అవార్డులు ఏర్పాటు చేయడం సంతోషకరమని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మురళీమోహన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీకి చైర్మన్ గా 2014 నుంచి 2023 వరకు ఏడాదికి ఒక ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేశామని జ్యూరీ సభ్యులు తెలిపారు. ఇందులో ప్రముఖ నిర్మాత దిల్ రాజు కూడా ఉన్నారు. 2024 ఏడాదికి సంబంధించిన తరువాయి 12లో

## నీకింత... నాకింత

# అసలు 'స్టంట్' రేటెంత?



- ఆసుపత్రుల్లో స్టంట్ల మాయాజాలం
- కరువైన వైద్యాధికారుల పర్యవేక్షణ
- వైద్యం మాటున హద్దులు దాటిన దోపిడీ

ప్రజాపక్షం/ఖమ్మం

మారిన కాలమాన పరిస్థితులు , ఆహారపు అలవాట్ల నేపథ్యంలో పెరిగిన వ్యాధులకు అనుగుణంగా వైద్య చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. కానీ వైద్యం పొందాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఆసుపత్రుల నిర్వాహకుల నోటికి దండం పెట్టి బిల్లులు చెల్లించాల్సిందే. గుండెజబ్బుల బారినపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మూసుకుపోయిన గుండె రక్త నాళాలను తెరిచేందుకు స్టంట్ వేస్తుంటారు. ఆరోగ్య శ్రీ పథకంలో వేస్తున్న స్టంట్లకు, విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న స్టంట్లకు జీవిత కాలం విషయంలో పెద్ద తేడా లేకపోయినా విదేశీ పేరుతో అధిక మొత్తం గుంజేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇక అసలు ఈ స్టంట్ల రేటెంత అన్నది ఒక మాయాజాలం. ఒక ఆసుపత్రిలో రూ. 70వేలు తీసుకుంటే అదే స్టంట్‌కు మరో ఆసుపత్రిలో రూ. 1,80,000 తీసుకుంటున్నారు. స్టంట్‌లో తేడా లేకపోయినా కొనుగోలులో ఎందుకు తేడా వచ్చిందంటే సమాధానం ఉండడం లేదు. ఛాతీ నొప్పితో ఆసుపత్రికి వస్తే ప్రథమ చికిత్స అందించి వెంటనే రూ. 17వేలు విలువ చేసే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. రక్త నాళాల్లో బ్లాక్ ఏర్పడిందని వెంటనే స్టంట్ వేయాలని లేకపోతే ప్రాణం పోతుందని పక్కన ఉన్న బంధువులను ఒక రకంగా భయపెట్టి హడావుడి సృష్టిస్తారు. ఒకవేళ వారు చెప్పిన మొత్తం చెల్లించకపోతే ప్రాణం దక్కదేమోనని అడిగినంత సమర్పించుకోవడం జరుగుతుంది.

**మా కెంత మీ కెంత :** పొరపాటున ఏ రోగి అయినా ఆర్‌ఎంపి సాయంతో వచ్చాడంటే డబుల్ బాదుడే. ఖమ్మం వైరా తరువాయి 12లో

## విచ్ఛిన్నకర శక్తులకు

# శ్రామికవర్గం అవకాశం ఇవ్వొద్దు




ఉగ్రవాదానికి, మత విద్వేషానికి వ్యతిరేకంగా పోరాడాలి

ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ పిలుపు

**జైపూర్ :** భారతదేశపు లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సంఘ్ పరివార్ విషపూరిత , విచ్ఛిన్నవాద కుట్రలను దృఢనిశ్చయంతో , స్థిరసంకల్పంతో శ్రామికప్రజలు ఎదుర్కొని ఓడించాలని ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ సమావేశం పిలుపు ఇచ్చింది. రాజస్థాన్ రాష్ట్రం రాజధాని జైపూర్‌లో జరుగుతున్న ఎఐటియుసి మూడురోజుల జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో రెండోరోజు 'టెర్రరిజానికి , మత విద్వేషానికి వ్యతిరేకంగా చేతులు కలపండి' అని ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఎఐటియుసి జాతీయ కార్యదర్శి వహీదా నిజామీ ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు.సమావేశాలకు ఎఐటియుసి జాతీయ అధ్యక్షుడు రమేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు.'ఏప్రిల్ 22 న పెహల్ గావ్ లో 26 మంది అమాయక ప్రజలను పొట్టనబెట్టుకున్న తీవ్రవాదుల అమానుష చర్య తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## నైజీరియాలో వరదలు
## 111 మందికి పైగా మృతి



**అబూజా:** నైజీరియాలో వరదలకు కనీసం 111 మంది మృతి చెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నిగర్ రాష్ట్రంలోని వాణిజ్య పట్టణమైన మొక్వాను వరద నీరు ముంచెత్తడంతో, చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఎంత మంది మృతి చెంది ఉంటారనేది ఇప్పుడే చెప్పలేమని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారి హుస్సేనీ ఇషా తెలిపారు. మిన్నాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ 88 మృత దేహాలను వెలికితీసినట్టు చెప్పారు. మృతుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# చైనా నేతృత్వంలో మధ్యవర్తిత్వ సంస్థ

### ప్రపంచ దేశాల మద్దతు



**హాంకాంగ్:** ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించడంతోపాటు, ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చైనా నేతృత్వంలో ఏర్పాటైన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మీడియేషన్/ ఐఒఎం) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దీనికి ప్రపంచ దేశాల లభిస్తున్నది. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశానికి పాకిస్తాన్ నుంచి ఇండోనేషియా వరకు... బెలారస్ నుంచి క్యూబా వరకు... 50కిపైగా దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ ప్రపంచ శాంతికి కృషి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరస్పర అవగాహన, చర్చలు, సంఘీభావం, ఏకాభిప్రాయం వంటి మార్గాల విభేదాలను పరిష్కరించుకోవచ్చన్నది అనాదిగా చైనా అభిప్రాయమని అన్నారు. ఎవరు గెలిచారు.. ఎవరు ఓడారు అనే ప్రశ్నకు ఆస్కారం లేకుండా, విశ్వశాంతికి, దేశాల మధ్య సయోధ్యకు ఐఒఎం కృషి చేస్తుందని అన్నారు. కాగా, వివిధ దేశాలతో కూడిన తొలి అధికారిక మధ్యవర్తిత్వ సంస్థకు చైనా శ్రీకారం చుట్టింది. దేశాల మధ్య నెలకొన్న సమస్యలను, వివాదాలను పరిష్కరించడానికి ఈ సంస్థ హాంకాంగ్ కేంద్రంగా పని చేస్తుంది. ఈ ఏడాది చివరి నాటికి అధికారికంగా ఇది కార్యకలాపాలను మొదలుపెట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాల జోక్యంతో వివాదాలు సులభంగా పరిష్కారమవుతాయని చైనా భావిస్తున్నది. శుక్రవారం నాటి సమావేశానికి ఐక్యరాజ్య సమితి, ఇతర ప్రధాన అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. దేశాల మధ్య, దేశాలు మరియు విదేశీ వ్యక్తులు మధ్య, అంతర్జాతీయ వాణిజ్య సంస్థల మధ్య తలెత్తే వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడానికి సంస్థ ఏర్పాటైంది. పరస్పరం అర్థం చేసుకోవడం, చర్చించుకోవడం, సమ్మతి తెలపడం ద్వారా సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యాన్ని ఈ సంస్థ ముందుకు తీసుకువెళుతుంది. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య సయోధ్య కోసం ఏర్పడిన తొలి సంస్థగా ఐఒఎం గుర్తింపు పొందుతుంది. హాంకాంగ్‌లో కామన్ లాతోపాటు చైనా న్యాయ వ్యవస్థల సమ్మేళనంతో ఉన్న న్యాయ వ్యవస్థను ఉపయోగించి, అంతర్జాతీయ న్యాయ సేవలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా ఎంచుకున్నారు.

**సభ్యత్వం పొందని భారత్**

అనేక దేశాల మద్దతు లభిస్తున్నప్పటికీ, ఐఒఎంలో భారత్ సభ్యత్వం తీసుకోలేదు. గ్లోబల్ సౌత్ దేశాల్లో ప్రభావాన్ని పెంచుకోవడానికి, అంతర్జాతీయ న్యాయ వ్యవస్థలో తన పాత్రను విస్తరించడానికి చైనా చేస్తున్న ప్రయత్నాలకు ఉదాహరణగా ఈ సంస్థను విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్థ ద్వారా చైనా, అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అందించడానికి, మరియు హాంకాంగ్‌ను అంతర్జాతీయ న్యాయ సేవల కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోంది. కానీ, భారత్ ఈ సంస్థకు దూరంగా ఉంది. భవిష్యత్తులోనైనా చేరుతుందా? అనేది అనుమానమే.

# ఇండోనేషియాలో కూలిన క్వారీ

### కనీసం 10 మంది మృతి




**బండుంగ్:** ఇండోనేషియాలో శుక్రవారం క్వారీ కూలిన ఘటనలో కనీసం 10 మంది మృతి చెందగా, ఆరుగురి జాడ తెలియడం లేదు. ప్రమాదం జరిగినప్పుడు క్వారీలో ఎంత మంది ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, కనీసం పాతిక మంది పని చేస్తుండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతుండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. సిరెబాన్ జిల్లాలో జరిగిన క్వారీ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం జరుగుతున్నదని స్థానిక పోలీస్ చీఫ్ సుమర్ని తెలిపారు.

క్వారీ యజమాని, అక్కడ పని చేస్తున్న కార్మికులను ప్రశ్నిస్తున్నట్టు ఆమె చెప్పారు. క్వారీలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని ఆమె అన్నారు. ప్రస్తుతం తమ వద్ద ఎక్కువ సమాచారం లేదని, విచారణ అనంతరమే వివరాలు తెలుస్తాయని సుమర్ని పేర్కొన్నారు.

# భారత్ తీరు గర్హనీయం

### సింధు నదీ జలాల అంశంపై పాక్ ప్రధాని షాబాజ్



**దుషాన్బే (తజికిస్తాన్):** సింధు నదీ జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా నిలిపివేసిందని పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ విమర్శించారు. నీటి యుద్ధానికి కాలుదువ్వుతున్న భారత్ తీరు గర్హనీయమని వ్యాఖ్యానించారు. మంచు తుపాన్లపై ఐక్యరాజ్య సమితి, యునెస్కో, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న షాబాజ్ మాట్లాడుతూ ఈ అంశాన్ని లేవనెత్తారు. నదీ జలాల అంశాన్ని భారత్ రాజకీయం చేస్తున్నదని ఆరోపించారు. వేలాది మంది ప్రజల సంక్షేమం, భవిష్యత్తుతో ముడిపడిన సింధు నదీ జలాల ఒప్పందం రద్దును అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. 'భారత్ పరుధులు దాటితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. మంచు తుపానుల కారణంగా పాకిస్తాన్ ఎదుర్కొంటున్న సమ స్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణపైన కూడా మాట్లాడారు. ఈ సదస్సులో 80 దేశాలు, 70 అంతర్జాతీయ సంస్థల నుంచి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌జిబిటిక్యు హక్కుల ఉద్యమకర్త జిమ్మీ విడుదల



**హాంకాంగ్:** సుమారు నాలుగు సంవత్సరాలుగా జైల్లో ఉన్న హాంకాంగ్ ప్రముఖ ప్రజాస్వామ్య ఉద్యమకర్త, స్వలింగ సంపర్కుల (ఎల్‌జిబిటిక్యు) హక్కుల కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్త జిమ్మా షామ్ శుక్రవారం విడుదలయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై అతని సహా మొత్తం 47 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ముగ్గురు నిర్దోషులుగా విడుదల కాగా, జిమ్మీ, మరో 43 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది.

## స్పెల్లింగ్ బీ విజేతగా భారత సంతతి బాలుడు- ఫైజాన్



**న్యూయార్క్:** భారత సంతతికి చెందిన ఫైజాన్ జాకీ అమెరికాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'నేషనల్ స్పెల్లిం గ్ బీ' పోటీలో విజేతగా నిలిచాడు. 13 ఏళ్ల ఫైజాన్ గత ఏడాది ఇదే పోటీల్లో రన్నరప్‌గా నిలిచాడు. ఈసారి టైటిల్ అందుకొని సత్తా చాటాడు. 21వ రౌండ్‌లో నిర్వాహకులు అడిగిన ఫ్రెంచ్ పదం 'ఎక్‌లే సీస్‌మా'కు సరైన స్పెల్లింగ్ చెప్పి, పోటీని పూర్తి చేశాడు. కా లిఫోర్నియాకు చెందిన మరో భారత సంతతి బాలుడు సర్వజ్ఞ కదమ్‌తో తుది వరకూ పోటీపడి, చివరికి టైటిల్ సాధించిన ఫైజాన్‌కు ఈ విజయంతో 50000 డాలర్ల నగదు బహుమతి లభిస్తుంది. దానితోపాటు ఒక ట్రోఫీ, మరియన్ వెబ్‌స్టర్ నుంచి 2500 డాలర్ల ప్రత్యేక బహుమతి కూడా అందుతుంది. ఫైజాన్ తాత, నాయనమ్మ హైదరాబాద్ వాసులు కావడం విశేషం.

## తప్పించుకోలేరు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. జర్నలిస్టులతో హైదరాబాద్, సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కాళేశ్వరం విషయంలో బిఆర్‌ఎస్ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికపోయారని, వాటి నుంచి తప్పించుకునేందుకు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ఒక ఎనిమిదవ వింత అని చెప్పుకునే కెసిఆర్, కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఎలా పునర్‌నిర్మించాలో సమగ్రంగా ఒక నివేదికను సిద్ధం చేయవచ్చు కదా అని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్, బిజెపి మధ్య సంబంధం ఉన్నదని కవిత వ్యాఖ్యల ద్వారానే స్పష్టమైంది కదా? అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కెసిఆర్ వద్ద దెయ్యాలు ఉన్నాయని చెబుతున్న కవిత, ఆ దెయ్యాలు ఎవరో చెబితే వినాలని తాము ఎదురుచూస్తున్నామన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య ఉన్న బంధాన్ని బిజెపి ఎంఎల్‌ఎ కూడా అంగీకరించారన్నారు. ఈడి అధికారులు తన ఇంటికి ఎప్పుడూ రాలేదని, వారు తన కుమార్తె ఇంటికి వచ్చారని వివరించారు. కెటిఆర్‌కు ఈడి అంటే ఉత్సాహమేక్కువ అని, అందుకే ఈడి గురించి మాట్లాడుతున్నారని,ఈడి దాడుల విషయాన్ని కెటిఆర్ స్వయంగా ఢిల్లీలోని ఈడితో వివరాలను తెలుసుకోవచ్చు కదా?, బిజెపి, బిఆర్‌ఎస్ స్నేహితులే కదా? అని పొంగులేటి ఎద్దేవా చేశారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసే చనువు సిఎం రేవంత్ రెడ్డికి ఉన్నదని, అన్ని రాష్ట్రాల పిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ కు చెందిన ముఖ్యంత్రులు రాహుల్‌గాంధీతో మాట్లాడే చనువు ఉంటుందని స్పష్టం చేశారు.

దగ్గరపడిన భూ బకాసూరుల ముహూర్తం

ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి, తప్పుడు పత్రాలను సృష్టించి, సాదాబైనామా కింద ఆ భూములను క్రమబద్ధీకరించాలని కొందరు దరఖాస్తులను పెట్టుకున్నారని, వారి నుంచి ఆభూములను స్వాధీనం చేసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఆగస్టు 15లోపు అసైన్డ్ భూముల భూ బకాసూరుల ముహూర్తం దగ్గరపడుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో లేని భూములకు, కొందరు పట్టాలు తీసుకున్నారని, అలాంటివి రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నెలకొండపల్లిలో గ్రనైట్స్‌కు సంబంధించిన ప్రభుత్వ భూమని లీజుకు తీసుకుని, వేర్వురు పత్రాలను సృష్టించి తక్కువ భూమి పేరుతో సాదాబైనామాలను సృష్టించి, క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని, ఇలాంటివి అనేక దరఖాస్తులు ఉన్నాయని మంత్రి వివరించారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని(ఇది వరకు నిర్వహించిన మండలాల్లో) తెలిపారు.

**2.10 లక్షల ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక**

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటి వరకు 2.10 లక్షల మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ 10వ తేదీలోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతు ందన్నారు. ప్రయోగాత్మక ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా, ఇందులో 24 వేలకు పనులు ప్రారంభమయ్యాయని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. లబ్ధిదారుల జాబితాకు సంబంధించి ప్రతిపక్ష ఎంఎల్‌ఎలకు 40 శాతం పేర్లు ఇవ్వమని సూచించామని, కానీ కెటిఆర్ తన నియోజకవర్గానికి చెందిన ఇందిరమ్మ జాబితాను ఇవ్వలేదని, అధికారులతోనే ఎంపిక చేసుకోవాలని సూచించినట్టు జిల్లా కలెక్టర్ తనతో చెప్పారని మంత్రి పొంగులేటి వివరించారు. ఐటిడిఎ పరిధిలో చెంచులకు 9,200 ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి సిమెంట్, స్టీల్ విషయంలో ధరలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తామని, గత ఏడాదిలో ఉన్న తక్కువ ధరకే వాటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. దీనికి సంబంధించి త్వరలోనే ధరల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

**హైదరాబాద్‌లో 10 మురికవాడల్లో ఇందిరమ్మ ఇండ్లు**

హైదరాబాద్‌లోని పది మురికివాడల్లో 'జి ప్లస్ 4 అంతస్తుల'ల వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. హైదరాబాద్‌కు దూర ప్రాంతాల్లో ఇండ్లను నిర్మించడం ద్వారా జీవనోపాధి లేకపోవడంతో లబ్ధిదారులు వాటిని వినియోగించుకోవడం లేదని, అందుకే నగరం నడిబొడ్డున ఉన్న మురికివాడల్లోనే వారికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని వివరించారు. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్,నల్లగొండ జిల్లాల్లోనూ హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని మంత్రి వెల్లడించారు.

## ఒకే షిఫ్ట్‌లో...'నీట్ పీజీ 2025'

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి ఒకే షిఫ్ట్‌లో పరీక్ష జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏ రెండు క్వొశ్చన్ పేపర్లు కూడా నిర్దిష్ట స్థాయిలో 'క్లిష్టతను' లేదా 'సౌలభ్యాన్ని' కలిగి ఉన్నాయని ఎప్పుడూ చెప్పలేం' అని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కుమార్, ఎన్‌వి. అంజారియాల ప్రాతినిథ్యంతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. అసాధారణమైన సందర్భాలలో సాధారణీకరణను ఏడాది తర్వాత ఒక సాధారణ పద్ధతిలో వర్తింపజేయవచ్చని ధర్మాసనం తెలియజేసింది. నీట్ పీజీ2025 పరీక్షను రెండు షిఫ్ట్‌లలో నిర్వహిస్తామంటూ జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ ఉత్తర్వులను జారీ చేసింది. నీట్ పీజీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 2,42,678 మంది అభ్యర్థులకు పరీక్షలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు కానీ ఒక నగరంలోనే నిర్వహించడం లేదు కదా అని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది. 'దేశం మొత్తంలో సాంకేతికపరిజ్ఞానం పురోగతిని దృష్టిలో ఉంచుకుని ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు తగినన్ని కేంద్రాలను కనుగొనలేదని మేం భావించడం లేదు' అని ధర్మాసనం పేర్కొంది.'రెండు షిఫ్ట్‌లలో పరీక్షలు నిర్వహించడం ఏకపక్షాన్ని సృష్టిస్తుంది కాబట్టి పరీక్ష రాసే అభ్యర్థులు అందరినీ అదే స్థాయిలో ఉంచదు' అని ధర్మాసనం గుర్తించింది. ఈ పరీక్ష జూన్ 15న షెడ్యూల్డ్ చేయబడిందని, పరీక్షానిర్వహణ విభాగం ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహవించడం కోసం మరిన్ని కేంద్రాలను గుర్తించడానికి ఇప్పటికీ ఇంకా రెండు వారాల సమయం మిగిలి ఉన్నదని ధర్మాసనం తెలియజేసింది. మరొక ప్రతివాది తరపున హాజరైన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ బహుళ షిఫ్ట్‌ల పరీక్ష కోసం వారు 445 కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఒకవేళ ఒక షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాల్సి వస్తే వారు అదనంగా 900 కేంద్రాలను గుర్తించాల్సి ఉంటుందని ధర్మాసనానికి విన్నవించారు.

## మిస్ వరల్డ్ ఫైనల్స్ నేడే

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా 108 మంది వివిధ దేశాల పోటీదారులు అందం, ఉద్దేశం, ఐక్యతను జరుపుకునే ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడతారు. సుమారు 20 రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాల్లో వీరంతా పాల్గొని తమ ప్రతిభను చాటటంతో పాటు, తెలంగాణలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని ప్రపంచ వ్యాప్తం చేశారు. మిస్ వరల్డ్ 2016 స్టెఫానీ డెల్ వాలె, భారతీయ ప్రెజెంటర్ సచిన్ కుంభర్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తారు. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ ఫైనల్స్‌లో స్టేజ్ పైన లైవ్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రముఖ మానవతావాది, నటుడు సోనూసూద్‌కు మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు ప్రధానం చేయనున్నారు. ఆయన ఫైనల్స్‌కు న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరిస్తారు. ఇతర జ్యూరీలుగా సుధారెడ్డి, డాక్టర్ కారినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014), మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ఉన్నారు. మిస్ వరల్డ్ 2017, బాలీవుడ్ నటి మనుషి చిల్లర్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా కనిపించనున్నారు. ఈ గ్రాండ్ ఫినాలే కార్యక్రమం భారతదేశంలో సోనీలైవ్‌లో లైవ్‌స్ట్రీమ్ అవుతుంది, కొన్ని దేశాలలో జాతీయ టెలివిజన్‌లో ప్రసారం అవుతుంది, ప్రపంచవ్యాప్తంగా www.watchmissworld.com ద్వారా హై డెఫినిషన్‌లో అందుబాటులో ఉంటుంది.

## అస్సలు ఒప్పుకోను

(మొదటి పేజీ తరువాయి)

కందుల ప్రశాంత్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రశాంత్‌పై కాంగ్రెస్ ఒత్తిడితోనే కేసు నమోదైందని పేర్కొన్నారు. మంచిర్యాల గౌతమినగర్‌లో ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్ కుటుంబాన్ని పరామర్శించిన ఆమె తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి చొప్పించడంలో మునీర్ పాత్ర అపారమైందని, దేశ, రాష్ట్ర సమస్యలపై చక్కటి విశ్లేషణతో ప్రజలకు మార్గదర్శకంగా నిలిచారని, మునీర్ లాంటి పాత్రికేయులు పెరగాలని, జర్నలిస్టులు ప్రజల బాధలు అర్థం చేసుకుని మునీర్ మార్గాన్ని అనుసరించాలని అన్నారు.

## విలీనం తథ్యం!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌కు కవిత రాసిన లెటర్ లీక్ వెనక ఆమె ప్రమేయం లేదా కెసిఆర్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండి ఉండవచ్చన్నారు. బిజెపి నేతలు ముందుగా ఆ పార్టీ ఎంఎల్‌ఎ రాజాసింగ్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని, రాజాసింగ్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పే దమ్ము బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. బిజెపి, బిఆర్‌ఎస్ మైత్రి గురించి కవిత చెప్పకనే చెబుతున్నారన్నారు. కెసిఆర్, కిషన్ రెడ్డి కలయిక వల్లే బండి సంజయ్‌ని బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని బిజెపి ఎంఎల్‌ఎ పరోక్షంగా చెబుతున్నారన్నారు. రాజాసింగ్ లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పకుండా రాహుల్‌గాంధీపై విమర్శలు చేయడం బిజెపి నేతల చేతగానితనమన్నారు. కాళేశ్వరం విషయంలో నోటీసులు రాగానే కెసిఆర్, ఈటల రాజేందర్‌ల మధ్య పాత బంధం మళ్ళీ చిగురించ్చిందని, శామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో హరీష్‌రావుతో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ సమావేశం అయ్యారని, హరీష్‌రావుతో కలిసి ఈటల రాజేందర్ కెసిఆర్‌తో ఫోన్‌లో సంభాషించారన్నారు. పాక్ పై యుద్ధం తీరు తెన్నుల గురించి తెలియాల్సిన ఆవశ్యకత ఉందని, బిజెపి నాయకులు, మోదీ సరైన రీతిలో యుద్ధం చేయలేక ట్రంప్ ప్రలోభానికి గురై వెనకడుగు వేశారన్నారు. రాహుల్ గాంధీపై అవకాలు చెవాకులు పేలుతున్న బిజెపి నేతలు తస్మాత్ జాగ్రత్త అన్నారు. సైనికులకు బాసటగా రాహుల్ గాంధీ నిలిస్తే విమర్శలు చేయడం బిజెపి నేతల దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. పాక్ పై యుద్ధంలో సాధించింది ఏమిటి? కోల్పోయింది ఏమిటి? అని దేశ ప్రజలు అడుగుతున్నారన్నారు. అపర కాళీమాతగా ఇందిరా గాంధీని మాజీ ప్రధాని వాజ్‌పాయ్ కొనియాడిన విషయం కిషన్‌రెడ్డికి తెలియకకపోవడం విడ్డూరమన్నారు. ఇందిరా గాంధీ హయంలో వందల సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయని, సైనిక రహస్యాలను రాజకీయ స్వార్థం కోసం బిజెపి వాడుకుని లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. కుల సర్వే బిసిలకు వెన్నుదన్నుగా నిలుస్తామని స్పష్టంగా చెప్పామన్నారు.

**జైహింద్ యాత్రలో సిఎం రేవంత్ ప్రశ్నలకు బిజెపి సమాధానం చెప్పాలి : కెకె**

జైహింద్ యాత్ర సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసిన ప్రశ్నలకు బిజెపి సమాధానం చెప్పాలని, రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు డిమాండ్ చేశారు. జైహింద్ యాత్రలో సిఎం రేవంత్‌రెడ్డి భావోద్వేగంతో దేశం గర్వించే విధంగా మాట్లాడారన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. భారత్, పాక్ మధ్య ఆరు తీవ్రమైన యుద్ధాలు జరిగాయని, పెహల్గామ్ ఘటన తరువాత భారతదేశం ఏదో చేస్తున్నట్లు సృష్టించారు కానీ ఏమి జరగలేదన్నారు. కవిత మాట్లాడిన మాటలను, ఆమెను కాంగ్రెస్ సిరియస్‌గా తీసుకోలేదని, ప్రజాపాలనలో ప్రజలతో పాలన జరుగుతుందని, లీడర్‌లతో ఏమి సంబంధమని, కవితతో కాంగ్రెస్‌కు పెద్దగా కలిసివస్తుందని తాను అనుకోవడంలేదన్నారు. తెలంగాణ ఇవ్వనందుకు తాను పార్టీ మారాల్సి వచ్చిందని, ప్రస్తుతం తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, కాంగ్రెస్‌లోనే మరణిస్తానన్నారు.

## పాటించాలి (మొదటి పేజీ తరువాయి)

అనేక మంది అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరు చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయని దీనిపై అధికారులు దృష్టి సారించి అర్హులకు దక్కేలా చూడాలన్నారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ సాగు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, ధాన్యం సేకరణ తదితర అంశాలపై నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణలో ముందున్నామని ప్రభుత్వం చెబుతున్నా కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు సకాలంలో చెల్లించడం లేదని దేవరకొండ ప్రాంతానికి చెందిన రైతులు తన దృష్టికి తీసుకవచ్చినట్లు చెప్పారు. వెంటనే రైతు అమ్మిన ధాన్యానికి డబ్బులు చెల్లించాలని కోరారు. మిల్లర్ల దోపిడిని అధికంగానే ఉందని దేవరకొండ ఆర్‌డిఓ దృష్టికి తాను తీసుకవెళ్లినట్లు చెప్పారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఇలాంటి తప్పిదాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పథకాల అమలులో చొరవచూపి రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి పథకాల లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుందని నకిలీ విత్తనాల బెడద తీవ్రంగా ఉందని దీంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వీటిని అరికట్టేందుకు పకడ్బందిగా ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాల సమీక్ష సమావేశాలకు ఎమ్మెల్సీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలా జరగకుండా చూస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నచ్చచెప్పారు.

## స్వాధీనం.. (మొదటి పేజీ తరువాయి)

ఇళ్లలో అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. దాదాపు రూ.2.1 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని పది మంది అధికారులు లెక్కపెట్టారు. విజిలెన్స్ అధికారులు తన ఫ్లాట్ వద్దకు రాగానే సారంగి ఇంట్లోని నోట్ల కట్టలను కిటికీలోంచి బయటపడేసేందుకు ప్రయత్నించాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అంగుల్‌లోని అతని నివాసంలో జరిపిన సోదాల్లో రూ.1.1 కోట్లు, భువనేశ్వర్ ఫ్లాట్‌లో మరో రూ.కోటి దొరికాయి. నగదుతోపాటు పలు పత్రాలు, బంగారు ఆభరణాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎనిమిది మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు, 12 మంది ఇన్స్ పెక్టర్లు, ఆరుగురు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు సహా 26 మంది పోలీసు అధికారుల బృందంతో పాటు ఇతర సహాయక సిబ్బంది సోదాల్లో పాల్గొన్నారు.

## ముఖంగా వెల్లడించాలి (మొదటి పేజీ తరువాయి)

కవిత విచారణ కోరాలన్నారు. ఇందు కోసం ఎంపిగా తాను కూడా కవితతో కలిసి వస్తానని, బిఆర్‌ఎస్ నేతల దోపిడీపై సిబిఐ విచారణ కోరుదామని, అప్పుడు కవితపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని ఆయన అన్నారు. బిఆర్‌ఎస్ దోచుకున్న సొమ్ములో వాటా కోసమే పంచాయతీ జరుగుతున్నదా అనే విషయాన్ని కవిత చెప్పాలన్నారు. బిజెపి నేతలకు ప్యాకేజీలు ఇస్తే ఎవరితోపైనా స్నేహం చేస్తారని బిజెపి సీనియర్ ఎంఎల్‌ఎ రాజాసింగ్ అన్నారని, బిజెపి నుంచి 8 ఎంపిలను గెలిపించిన ప్రజలపై ప్రధాని మోదీకి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సింధూర్ గురించి వివరించేందుకు ఇక్కడి బిజెపి ఎంపిలు పనికి రారని మోదీ అనుకున్నారా చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి విమానం కొంటున్నారని అసత్య ప్రచారం చేస్తున్న బిఆర్‌ఎస్ నేతలు బిఆర్‌ఎస్ ఎలక్టోరల్ బాండ్స్ నిధుల నుంచి ఒక విమానం ప్రభుత్వానికి కానిస్తే తీసుకుంటామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## ఎలా వ్యవహరిద్దాం (మొదటి పేజీ తరువాయి)

కూడా వ్యక్తం అవుతున్నాయి. కాళేశ్వరం కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన విచారణ తీరు, విచారణకు హాజరైన వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, తదితర అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. కాళేశ్వరంపై ఎన్‌డిఎస్‌ఎ నివేదికను ఎల్ అండ్‌టి నిర్మాణ సంస్థ కూడా తప్పుపట్టిన అంశాలు, ఇందుకు ప్రాస్తవించాల్సిన న్యాయపరమైన అంశాలు, మంత్రివర్గం, సిఎంగా వ్యవహారించిన పాత్రను ఇలా అనేక అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్టు పలువురు పేర్కొంటున్నారు. అలాగే బిఆర్‌ఎస్‌లో జరుగుతున్న తాజా పరిణామాలు కూడా చర్చకు వచ్చినట్టు సమాచారం. అయితే జూన్ 5న కెసిఆర్, ఆతర్వాత హరీశ్‌రావు విచారణకు హాజరుకావాల్సి ఉన్న ది. విచారణలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహారించిన తీరును, కాళేశ్వరం నిర్మాణ పనుల సందర్భంగా పలు సంస్థల ప్రశంసలు, నిర్మాణ సమయంలో పాలకులుగా తమ పాత్రను ప్రధానంగా ప్రస్తావించే అవకాశాలు ఉంటాయని బిఆర్‌ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపారు. 30 నుంచి 40 కిలో మీట్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. దీంతో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. జూన్ 2వ తేదీన రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగ ర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జిపిఓల పరీక్ష ఫలితాలు విడుదల హర్షణీయం

రెవెన్యూ అధికారులు, ఉద్యోగ సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిపిఓల నియామకానికి సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని, అందులో భాగంగా ఇటీవల నిర్వహించిన జిపిఒల నియామక పరీక్ష ఫలితాలు విడుదల చేయడం పట్ల రెవెన్యూ అధికారులు, ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జిపిఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు గరికె ఉపేందర్ రావు, లక్ష్మి నరసింహా శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ తహసీల్దార్ల సంఘం సెక్రటరీ జనరల్ ఫూల్సింగ్ చౌహాన్, తెలంగాణ తహసీల్దార్ల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మహిళా విభాగాల రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.రాధ, సుజాత చౌహాన్, జిపిఓ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రజాకార్, పుష్ప-2 సినిమాలకు
# అవార్డులను తిరస్కరించాలి

రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను కించపరిచే సినిమాలకు అవార్డులా..?

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** రజాకార్ సినిమాకు, పుష్ప2 సినిమాలో స్మగ్లర్ పాత్ర పోషించిన అల్లు అర్జున్‌కు ఇచ్చిన గద్దర్ అవార్డులను తిరస్కరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను అవమానపరుస్తూ తీసిన రజాకార్ సినిమాకు ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు ఇవ్వడం సిగ్గుచేటైన చర్య అన్నారు. నాడు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిందని, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, జమీందారులకు, జాగిర్దార్లకు వ్యతిరేకంగా భూమి పంచాలని, వెట్టిచాకిరి నుండి విముక్తి కావాలని నినాదంతో, బాంచన్ కాల్మొక్త అనే బానిస బతుకులు పోవాలని సాగిన పోరాటాన్ని హిందువులకు, ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా వక్రీకరిస్తూ తీసిన రజాకార్ సినిమాకి ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు రావడం సిగ్గుచేటు అని అన్నారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూములను పంచిపెట్టిన చరిత్ర ఎర్రజెండా పార్టీకి దక్కిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ పటేల్ సైన్యాలతో గ్రామాలపై పడి ప్రజలపై దాడిచేసి చంపించారని, నేడు అదే తీరుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ తీసిన సినిమాలకు ఉత్తమ సినిమా అవార్డులు ఇవ్వడం అమరవీరులను అవమానపరచడమే అన్నారు. అలాగే సమాజంలో విష సంస్కృతిని పెంచిపోషించే విధంగా ఎర్రచందనం స్మగ్లర్ పాత్రలో నటించిన అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడి అవార్డు ఇవ్వడం సరికాదని, ఇలాంటి పాత్రలకు గద్దర్ పేరుతో అవార్డు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యురాలు మంద సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు మంచాల రమాదేవి, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, నకీర్త ఓదెలు, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, వేల్పుల సారంగపాణి, రాజ్‌కుమార్, కామెర వెంకటరమణ, యేషబోయిన శ్రీనివాస్, దుప్పటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆర్‌టిసి సిబ్బంది

రూ.19 లక్షల విలువైన వస్తువులు ప్రయాణికులకు అందజేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విధి నిర్వహణలో టిజిఎస్ ఆర్‌టిసి సిబ్బంది తమ నిజాయితీని నిరూపించుకున్నారు. బస్సుల్లో పోగొట్టుకున్న రూ.19 లక్షల విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌లను ప్రయాణికులకు అందజేసి, మానవత్వాన్ని చాటుకున్నారు. ఈనెల 25న సూర్యాపేట హైదరాబాద్ మార్గంలో వెళ్తోన్న బస్సులో ఒక ప్రయాణికురాలు తన బ్యాగ్‌ను మరిచిపోయారు. బస్సు సూర్యాపేట బస్ స్టేషన్‌కు చేరుకోగానే ఆ బ్యాగ్‌ను కండక్టర్ కె.అంజయ్య, డ్రైవర్ యాకుబ్ పాషా గుర్తించారు. మానవత్వం చాటుకున్న సూర్యాపేట, మియాపూర్2 డిపోలకు చెందిన సిబ్బంది కె.అంజయ్య, డ్రైవర్లు యాకుబ్ పాషా, ముబీన్, రమేష్‌ను టిజిఎస్ ఆర్‌టిసి ఎం.డి. సజ్జనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, సిటిఎం (కమర్షియల్) శ్రీధర్, సిపిఎం ఉషాదేవి పాల్గొన్నారు.

## అడవులను కాపాడిన ఆదివాసీలను..
# ఇప్పటికీ కబ్జాదారులుగానే చూస్తున్నారు!

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అడవులను కాపాడిన ఆదివాసీలను ఇప్పటికీ కబ్జాదారులుగానే చూస్తున్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నూతన అటవీ చట్టాలు తెచ్చి సరైన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో శుక్రవారం పిఎం. జన్మన్, ధర్తి ఆబ జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అనే కేంద్ర పథకాలపై సౌత్ ఈస్ట్ జోన్‌కు చెందిన రాష్ట్రాల సమావేశం జరిగింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల గిరిజన సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆదివాసీ, గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కారమార్గాలు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ట్రైబల్ స్కూల్ సహా మిగతా విద్యా సంస్థలకు రూ.248 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క కోరారు. ఆదివాసీలకు అడవే అమ్మలాంటిదని, అడవి లేకుంటే ఆదివాసీలు ఉండలేరన్నారు. గిరిజనులు అడవిలోనే నివసిస్తారు కాబట్టి వారి అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలను అడ్డుకోకుండా అటవీ శాఖ చట్టాలను సంస్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో నీటి పారుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా సోలార్ గిరి వికాసం పథకానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఇప్పటికీ మౌలిక వసతులు లేకపోవడం మనుషుల వైఫల్యమేనని, ప్రభుత్వాలది కాదన్నారు. బిర్సా ముండా, కొమురం భీమ్‌లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టి, ఎస్‌డిఎఫ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు రాష్ట్ర గిరిజనులకు ప్రత్యేకంగా 22వేల పైచిలుకు పక్కా గృహాలను కట్టిస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం పేరిట పోడు భూముల పట్టాలు పొందిన గిరిజన రైతుల భూములను సేద్యం చేసుకునేందుకు వీలుగా సౌర విద్యుత్తు, పంపుసెట్లను అందించడం ద్వారా నీటి పారుదల వసతులను కల్పించామని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ పిఎం. జన్మన్, ధర్తి ఆబ జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఆ దిశలో పయనిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న ప్రతి పథకం ఫలితాలు అడవుల్లో జీవిస్తున్న ప్రతి గిరిజనుడికి అందుతుందన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మనీష్ ఠాకూర్ రాష్ట్రాలలో పథకాల అమలు తీరును సమీక్షించారు. పథకాలను ఇంకా సమర్థవంతంగా ఎలా అమలు చేయాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. తెలంగాణలో అమలు జరుగుతున్న పథకాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ. శరత్ సమన్వయం చేయగా, ట్రైఫైడ్ ఎండి. హృదేశ్ కుమార్, ఛత్తీస్‌గఢ్ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సోన్‌మోని బోరా, ఒడిషా గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు పోమతుడు, తెలంగాణ ఐటిడిఎల ప్రాజెక్టు ఆఫీసర్లు, తెలంగాణ 17 శాఖల ఉన్నతాధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి, ఛీఫ్ ఇంజనీర్ శంకర్, జిసిసి జిఎం. వి.సీతారామ్, టిసిఆర్‌టిఐ డైరెక్టర్ డాక్టర్ వి.సముజ్వల తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం జాతీయ
# కనీస వేతనాన్ని వెంటనే నిర్ణయించాలి

ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ కనీస వేతనాన్ని నిర్ణయించాలని, జాతీయ కనీస వేతన బోర్డులో అన్ని యూనియన్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసుఫ్ డిమాండ్ చేశారు. రాజస్థాన్ జైపూర్‌లో జరుగుతున్న ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో శుక్రవారం యూసుఫ్ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించటం జరిగిందని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి జి.ఓలను విడుదల చేయాలని కోరారు. తెలంగాణలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎఐటియుసి యూనియన్‌లు ఉన్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ సంఘాలు బలంగా ఉన్నాయని, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఫెడరేషన్ ఏర్పాటుకు కేంద్ర ఎఐటియుసి ప్రయత్నించాలని కోరారు. ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా, యాజమాన్యాలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తునప్పటికీ, కేంద్రం తెచ్చిందన్నారు. అందులో ఉన్న కార్మిక వ్యతిరేక, యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్న అంశాలను కార్మికులకు పూర్తి అవగాహనా కల్పించాలని కోరారు. ఔటసోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల రెగ్యులరైజ్ కోసం పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ఎఐటియుసిని బలోపేతం చేస్తామన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పి.ప్రేమపావని, ఎస్.విలాస్, నరాటి ప్రసాద్, సింగు నర్సింహారావు, ప్రవీణ్ కుమార్, వై.ఓమయ్య, ఎన్.కరుణ కుమారి, టి.సమ్మయ్య, కె.ఏసురత్నం, కె.రాజ్ కుమార్, కె.సారయ్య, హసీనా బేగం, సీతామహాలక్ష్మి, బి. జి.క్లెమెంట్లు పాల్గొన్నారు.



## జర్నలిస్టులు నైతికప్రమాణాలు పాటించాలి

పాత్రికేయులు కనీసధర్మం పాటించడంలేదని విమర్శలు పెరిగాయి

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించకపోతే ప్రజల్లో గౌరవం తగ్గుతుందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, మన్ననూరు గ్రామంలోని అటవీశాఖ వనమాలిక ఆవరణలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా పాత్రికేయులకు వివిధ అంశాలపై అవగాహన శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నైతిక నియమాలు – మీడియా చట్టాలు' అనే అంశంపై మాట్లాడుతూ మీడియా అకాడమీ నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు పాత్రికేయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఈ శిక్షణలో పాత్రికేయులు దాదాపుగా నూటికి 90శాతం మంది ఉన్నత విద్యాభ్యాసం చేసినవారు ఉండటం సంతోషకరమన్నారు. త్వరలోనే పాత్రికేయులకు హైదరాబాద్ పట్టణంలో మీడియా అకాడమీ ద్వారా కంప్యూటర్ శిక్షణ వారం రోజులపాటు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, కంప్యూటర్‌పై అవగాహనలేని వారందరు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం 1952లో మీడియాచట్టం వచ్చిందని, వర్కింగ్ జర్నలిస్టుల హక్కులకోసం ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1995లో తీసుకొచ్చిందని, ఐదురకాల వేతనచట్టాలు వచ్చినా అమలు విషయంలో జాప్యాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించడంలేదని విమర్శలు ఈమధ్య బాగా పెరిగాయని, అందుకు కారణం మనమేనని అన్నారు. నైతిక విలువలు కాపాడుకోవడంతోపాటు పారదర్శకతతో కూడిన వార్తలను ప్రచురించినప్పుడు ప్రజల్లో మనపై గౌరవం పెరుగుతుందన్నారు. ప్రతిరిపోర్టర్ వార్తల విశ్వసనీయతపై దృష్టి కేంద్రీకరించాలని, కనీస ధర్మం తప్పక పాటించినప్పుడే మరింత గౌరవం పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు తోట భావనారాయణ, జిల్లా పాత్రికేయులు సుమారు 80మంది పాల్గొన్నారు.

## లొంగిపోయిన 17 మంది మావోయిస్టులు

ప్రభుత్వం తరపున పునరావాసం

ఎస్‌పి రోహిత్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మావోయిస్టు పార్టీకి చెందిన 17 దళసభ్యులు ఎస్‌పి రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయారు. ఈమేరకు వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈమేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు మహిళా సభ్యులతో పాటు మొత్తం 17 మంది లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో ఎసిఎంలు ఇద్దరు, దళ సభ్యులు నలుగురు, మిలీషియా సభ్యులు 11మంది ఉన్నట్లు ఎస్‌పి చెప్పారు. వీరితో కలిపి ఇప్పటి వరకు ఈ ఏడాది 282 మంది వివిధ హోదాల్లో గల మావోయిస్టు దళసభ్యులు లొంగిపోయినట్లు చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని చెప్పారు. మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలని చెప్పారు. లొంగిపోయిన వారు వారివారి ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సాయుధ దళాలు తెలంగాణ ప్రాంతంలో సంచరించినట్లయితే పోలీసులు తీసుకునే నిర్ణయాల నుండి ఏఒక్కరు కూడా తప్పించుకోలేరని, ఇందుకు కర్రె గుట్టల ఘటనలే ఉదాహరణ అన్నారు. కాలంచెల్లిన సిద్ధాంతాలను విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. లొంగిపోయిన వారు కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవనాన్ని గడిపేందుకు పునరావాస సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ జి.నరేందర్, భద్రాచలం ఎఎస్‌పి విక్రాంత్‌కుమార్ సింగ్, 141 బెటాలియన్ అడిషనల్ కమాండర్ ప్రీతా, 81 బెటాలియన్ అడిషనల్ కమాండర్ రవివర్మ, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, చర్ల సిఐ రాజువర్మ, ఆర్‌ఐ ఆపరేషన్స్ రవి తదితరులు పాల్గొన్నారు.




## తెల్ల ఏనుగు లాంటి 'హైడల్ ప్రాజెక్ట్' మరో తుగ్లక్ చర్య : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.6,200కోట్లతో తెల్ల ఏనుగు లాంటి హైడల్ ప్రాజెక్టు నిర్మాణానికి టిజి జెన్‌కోను రంగంలోనికి దింపడం రాష్ట్ర ప్రభుత్వ మరో తుగ్లక్ చర్య తప్ప మరోటి కాదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. మోసర్‌బేర్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీ పారిపోయినప్పటికీ, ఎన్‌టిపిసి లాంటి కేంద్ర ప్రభుత్వరంగ కంపెనీ మూడేళ్ల తర్వాత సాధ్యం కాదని వదిలేసిన 510 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించేందుకు టిజి జెన్‌కో ఒప్పందం ఎందుకు చేసుకున్నదో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాల కాలంలో ఒక్కరు కూడా నిర్మించేందుకు ముందుకు రాని ప్రాజెక్ట్‌ను రాష్ట్రప్రభుత్వం ఎందుకు చేపడుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపిఆర్ లేకుండానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వంతో ఎంఒయు చేసుకుని, అప్ ఫ్రంట్ ప్రీమియం కింద రూ.26కోట్లను చెల్లించి, మరో రూ.26కోట్లను చెల్లించేందుకు సిద్ధపడడాన్ని పరిశీలిస్తే, రాష్ట్ర ప్రభుత్వం దివాళ తీసిందని సిఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు ప్రజల చెవుల్లో పూలు పెట్టడానికే అని తేలిపోయిందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని తమ వద్ద నిర్దిష్టమైన సమాచారం ఉన్నదని, త్వరలోనే ఈ అవినీతి బండారాన్ని పూర్తి ఆధారాలతో బయటపెడతామని తెలిపారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో వివాహిత మృతి

ప్రతిభ ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

భారీగా మోహరించిన పోలీసులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** వైద్యుల నిర్లక్ష్యంతో వివాహిత మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వెన్నునొప్పితో 35 సంవత్సరాల రాధికను మూడు రోజుల క్రితం ఆస్పత్రికి తీసుకురాగా గురువారం రాత్రి ఆమెకు సర్జరీ చేసిన వైద్యులు ఆరోగ్యంగా ఉందని వెల్లడించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందడంతో బంధువులు ఆందోళనకు దిగారు. గుండెపోటుతో రాధిక మృతి చెందిందని వైద్యులు తెలుపడంతో మృతురాలి బంధువులు మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట బైఠాయించి వైద్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాలోని వేల్పూర్ మండలం, పడిగెల్ గ్రామానికి చెందిన రాధికకు భర్త, ఐదేళ్ల పాప ఉన్నట్లు తెలిసింది. మృతురాలి బంధువుల ఆందోళనతో భారీగా పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. నగర సిఐ శ్రీనివాసరాజ్ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మొహరించారు. రాధిక మృతికి కారణమైన వైద్యులను అరెస్ట్ చేసేవరకు వదిలేది లేదని మృతురాలి బంధువులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులలో ఇంత జరుగుతున్నా జిల్లా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు పెద్దగా పట్టించుకోవడంలేదని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుటే తప్పుడు దందా!



**ప్రజాపక్షం/చెన్నూరు :** చెన్నూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుటే అధికార పార్టీకి చెందిన నేత సీతారాం తోటలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ వెంచర్ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. పదేళ్ల క్రితం కేవలం మూడున్నర ఎకరాలకు అనుమతి పొంది, ఏకంగా 16 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ఈ వెంచర్‌ను నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల సహకారంతోనే ఈ భారీ కుంభకోణం సాగుతోందని వారు అంటున్నారు. కాంగ్రెస్ నేత కుటుంబ సభ్యుల పేరున పట్టణ శివారులోని సర్వే నెంబర్లు 775/2, 775/3అ1, 775/3అ2, 775/3అ3లలో ఉన్న అసైన్డ్ భూమితో పాటు సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని తెలుస్తోంది. సర్వే నెంబర్లు 775, 775/1లలోని 3.16 ఎకరాలకు ప్రభుత్వ అనుమతి పొంది, ఏకంగా 215 ప్లాట్లు ఏర్పాటు చేసి అమాయక ప్రజలకు విక్రయించారని సమాచారం. కేవలం మూడున్నర ఎకరాల అనుమతి

### మూడున్నర ఎకరాల అనుమతితో రెండు వందల ప్లాట్ల వెంచర్

పత్రాలను వినియోగించి మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల సహకారంతో దొడ్డిదారిన 215 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిర్వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్లాట్ల అమ్మకాలు పూర్తయినప్పటికీ, అధికార పార్టీ నేత కుటుంబ సభ్యుల పేరున ఉన్న అసైన్డ్ భూములు నేటికీ వారి పేరు మీదే ఉండటం గమనార్హం. వీరు పదేళ్ల నుండి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతూ, బ్యాంకు రుణాలు సైతం తీసుకుంటూ అమాయక ప్రజలను మోసం చేసి కోట్లకు పడగలెత్తారని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూముల్లో ఏర్పాటు చేసిన ఈ వెంచర్‌లో ఇళ్ల అనుమతులు పొందడానికి ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బడాబాబులు ఇళ్ల అనుమతులు ఇప్పిస్తామని మభ్యపెడుతూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల చర్యలను అడ్డుకునేవారెవరో?**

అసైన్డ్ భూముల్లో అక్రమ వెంచర్ నిర్వహించి అమాయక ప్రజలను మోసం చేసిన అధికార పార్టీ నేతపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకుండా స్థానిక ఎంఎల్‌ఎ రక్షణ కల్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన అక్రమ వెంచర్ వ్యవహారంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తడంతో, వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అధికారులు ఆదేశించి నెల రోజులు గడుస్తున్నప్పటికీ, స్థానిక రెవెన్యూ అధికారులు వెంచర్ నిర్వహణపై విచారణ చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వెంచర్ నిర్వాహకుడు అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడం, స్థానిక ఎంఎల్‌ఎ ఉండటంతో అధికారులు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు భావిస్తున్నారు. బహిరంగ సభల్లో ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించబోమని చెబుతున్న నేతలు, తెరచాటున సొంత పార్టీ నేతలను కాపాడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సీతారాం తోటలో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌పై విచారణ జరిపి, అధికార పార్టీ నేత కుటుంబ సభ్యుల పేరున ఉన్న పట్టాలు రద్దు చేసి, వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
మెట్రో జోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్ - 63
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఎక్స్‌టెన్షన్-1 టెండర్ Spec No. eMZ-03/25-26
ఎక్స్‌టెన్షన్-1 టెండర్ నోటీస్ నెం. 07/25-26 (పత్రికా ప్రకటన)
జనరల్ కేటగిరీ కింద ఒరిజినల్ పనుల T&D మెరుగుదల కొరకు హైదరాబాద్ సౌత్ సర్కిల్ చార్మినార్ డివిజన్‌లోని మీరాలం సబ్ డివిజన్ యొక్క మీరాలం సెక్షన్‌లోని 33/11KV ఫలక్‌నుమా SS నుండి వెలువడే ఓవర్‌లోడ్ 11KV ఫలక్‌నుమా UG కేబుల్ ఫీడర్ యొక్క విభజన కోసం ఇ-టెండర్ పొడిగింపు కోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. దీనికి సంబంధించిన ఏదైనా ఇతర సమాచారాన్ని www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- చీఫ్ ఇంజనీర్, ఆపరేషన్, మెట్రో జోన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 2820-PP/CL/ADVT/1/2025-26, Date: 30-05-2025

ప్రజాపక్షం
శనివారం, మే 31

# ఓట్లకోసం 'సిందూర్' దుర్వినియోగం

'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో దేశ యావత్ రాజకీయ వ్యవస్థ దేశ సమైక్యత, రక్షణకోసం కంకణబద్ధులై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అండగా నిలబడగా, ఈ అవకాశాన్ని ఆయన తన పార్టీ ఎన్నికల రాజకీయాలకోసం వినియోగించుకోవటం తన సంకుచిత మనస్తత్వాన్ని వ్యక్తీకరిస్తున్నది. మే 10న 'కాల్పుల విరమణ' ప్రకటించిన రోజునుండే ప్రధాని మోదీ మిలటరీ సాహసోపేత విన్యాసాన్ని తన విజయంగా ప్రచారం చేసుకుంటున్నా ప్రతిపక్షాలు హద్దుమీరి ఎదురుదాడి చేయలేదు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుపార్టీ తదితరులు 'ఆపరేషన్ సిందూర్' సాఫల్యం, సీమాంతర టెర్రరిజం, పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని కోరినా మోదీ పెడచెవిన పెట్టారు. అయినా విదేశాలకు పార్లమెంటరీ బృందాల్లో ప్రతిపక్ష పార్టీలు పాల్గొన్నాయి. అయితే దేశ ఐక్యతను చాటేందుకు ఈ యుద్ధ ఉద్రిక్తతలో విమర్శలు చేయకుండా సంయమనం పాటించాలన్న లక్ష్మణ రేఖ ప్రతిపక్షాలకేనా? ప్రభుత్వ పక్షానికి లేదా? 'ఆపరేషన్ సిందూర్ ముగియలేదు – విరామం మాత్రమే – ప్రతి టెర్రరిస్టు దాడికీ సమాధానం చెబుతాం' అంటూ, మరో వైపున, గత యుద్ధాల్లో భారత్‌కు లభించిన ఆధిక్యతను ఉపయోగించుకోకుండా నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు సంధులు చేసుకున్నాయని కాంగ్రెస్‌పై ప్రధాని ప్రభృత అగ్రనేతలు విషం గక్కుతున్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌పై తప్ప మరో అంశంపై చర్చలేదు, పిఒకె భారత్‌లో కలిసేరోజు ఎంతోదూరం లేదంటూ హైపర్ జాతీయోన్మాదానికి నీరుపోస్తున్నారు. ప్రధాని గుజరాత్‌తో మొదలు పెట్టి బీహార్, పశ్చిమ బెంగాల్‌లో బహిరంగసభలు, రోడ్ షోలలో పాల్గొంటూ అటు పాకిస్తాన్‌పైన, ఇటు ప్రతిపక్షాలపైన విరుచుకుపడుతున్నారు. వీటి వెనుకనున్న రాజకీయ స్వప్రయోజనాన్ని ఏ పార్టీ ప్రశ్నించలేదు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొలిసారి స్పందించారు. గురువారం అలీపుర్‌ద్వార్‌లో బహిరంగసభలో మోదీ ఎదుటనే, బెంగాల్ బిజెపి అధ్యక్షుడు సుకాంత మజుందార్ ప్రసంగిస్తూ, టిఎంసి ప్రభుత్వాన్ని బంగాళాఖాతం జలాల్లో కలపటానికి ఆపరేషన్ సిందూర్‌వలె 'ఆపరేషన్ బెంగాల్' నిర్వహిస్తామని ప్రకటించారు. రెండు గంటల్లోనే స్పందించిన మమతా బెనర్జీ, 2026 ప్రారంభంలో జరిగే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి చౌకబారు రాజకీయ లబ్ధికోసం ప్రధాని ఆపరేషన్ సిందూర్ వాడుకుంటున్నారని ప్రతి విమర్శ చేశారు. 'ఈ రోజు మోదీజీ చెప్పింది మాకు దిగ్భ్రాంతి కలిగించటమేగాక విచారిస్తున్నాం. అన్ని రాజకీయ పార్టీలు విదేశీ పర్యటనలతో దేశ ఐక్యతను చాటి చెబుతుండగా, నరేంద్రమోదీ, ఆయన మంత్రి ఆపరేషన్ బెంగాల్ గూర్చి మాట్లాడటం సరైనదా? వారికి నా సవాలు. రేపే ఎన్నికలకు మేము సిద్ధంగా ఉన్నాం. మా సవాలును బిజెపి స్వీకరిస్తుందా?" అని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయ లబ్ధికోసం మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ మొదలు చోటా నాయకులవరకు ఉపయోగించుకుంటున్నందున, బహుశా ఇతర ప్రతిపక్షాలనుండీ వారు ఎదురుదాడిని ఆహ్వానిస్తున్నట్లుంది.

మమతా బెనర్జీ ప్రధానమంత్రికి కొన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలు వేసి సమాధానం డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న పహల్గాంలో హత్యాకాండకు పాల్పడిన టెర్రరిస్టులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేకపోయారు? ట్రంప్ వాణిజ్య హెచ్చరికతో భారత్, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ సాధించినట్లు స్వయంగా ఆయన, ఆయన ప్రభుత్వం పదేపదే చెబుతుంటే దేశ ప్రధాన మంత్రి సమాధానం చెప్పకుండా ఎందుకు మౌనంగా ఉన్నారు? మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ప్రధానమంత్రికి ఏమి చెప్పారు? ట్రంప్ బెదిరింపును విలువివ్వజేశారా? యుఎస్ వాణిజ్య శాఖ ఈ విషయాన్ని కోర్టుకు చెప్పింది. ప్రధానమంత్రి మౌనం వహిస్తూ ఇతరులచే ఎందుకు మాట్లాడిస్తున్నారు?

ప్రధాని మోదీ ఏప్రిల్ 24న – పహల్గాం ఘటన తర్వాత రెండోజులకే అఖిలపక్ష సమావేశానికి హాజరుకాకుండా మధుబని (బీహార్)లో బహిరంగసభలో పాల్గొన్నారు. 2025 చివర్లో బీహార్ ఎన్నికలు మోదీకి కీలకం. బీహార్‌ను సొంతం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. 2026 ప్రారంభంలో బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు. బీహార్‌లో ఇప్పటికే మూడుసార్లు పర్యటించారు మోదీ. వాగ్దానాలు కురిపిస్తున్నారు. ఇటీవల బీహార్, గుజరాత్‌ల్లో ఆయన రోడ్ షోలు ఆయన ఉద్దేశాన్ని వెల్లడించాయి. ఇది రోడ్ షోలకు సందర్భమా? ఇండియా కూటమి పార్టీలు ఇప్పటినుంచే రాజకీయ వ్యూహాలు రూపొందించుకోవటం అవసరం.

# 'మావోయిస్టు రహిత భారత్' కోసం బిజెపి సైనిక విన్యాసం



దీపాంకర్ భట్టాచార్య
జాతీయ ప్రధానకార్యదర్శి
సిపిఐ(ఎంఎల్) లిబరేషన్

మే 21న నారాయణపూర్ ఊచకోతలో సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును చట్టవిరుద్ధంగా హత్య చేసిన తర్వాత, మోడీ ప్రభుత్వం విజయ ఉత్సాహంలో ఉన్నట్లు కనిపిస్తోంది. హోంమంత్రి అమిత్ షా దీనిని 'నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి' అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీనిని 'అద్భుతమైన విజయం'గా ప్రకటించగా, బిజెపి కర్ణాటక యూనిట్ అమిత్ షా కాలీఫ్లవర్ పట్టుకుని ఉన్నట్లు చూపించే చిత్రాన్ని ఉపయోగించింది.

1989లో భాగల్పూర్‌లో ముస్లింల మారణహోమాన్ని ఈ ప్రతీకవాదం గుర్తుచేసింది, అక్కడ ఒక గ్రామంలో వందమందికి పైగా ముస్లిం బాధితులను సమాధి చేసిన నేలపై కాలీఫ్లవర్లు పెంచినట్లు హంతకులు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తన అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక సైనిక విజయాన్ని ప్రకటించుకున్న తరుణంలో, భారతదేశంలో అత్యంత దారుణమైన ముస్లిం వ్యతిరేక మారణ హోమాల్లో ఒకదాన్ని బిజెపి గుర్తుంచుకుని మరీ ఈ ఘోర కార్యానికి పూనుకుంది.



నారాయణపూర్ మారణహోమంలో మావోయిస్టుల మరణాలను సిపిఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ తరపున విడుదల చేసిన పత్రికా ప్రకటన ధృవీకరిస్తోంది. దీని ప్రకారం ఈ మారణహోమంలో 28 మంది కార్యకర్తలు మరణించారు, వీరిలో అనేక మంది మహిళలు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు. బసవరాజుకు 60 మందికి పైగా యోధులతో కూడిన తక్షణ భద్రతా వ్యవస్థ ఉందని, కానీ జనవరి నుండి వేగవంతమైన కదలికల కోసం ఆ సంఖ్యను తగ్గించారని ఆ ప్రకటన పేర్కొంది. రక్షణ వలయంలోని కొందరు లొంగిపోవడం, ద్రోహులుగా మారడంతో రాజ్యం తమ మిలిటరీ ఆపరేషన్‌ను విజయవంతంగా ప్లాన్ చేసి అమలు చేయడానికి వీలు కలిగింది. మారణ హోమం జరిగిన సమయంలో, బసవరాజుకు 34 మంది యోధులు కాపలాగా ఉన్నారు, వారిలో ఏడుగురు భద్రతా దళాల వలయాన్ని ఛేదించి విజయవంతంగా తప్పించుకోగలిగారు.

బసవరాజు తల్లి, నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు, ఇతర నాయకులు, వారి బంధువుల మృతదేహాలను వారి అంత్యక్రియల కోసం ఇంటికి తీసుకురావడానికి వారి కస్టడీని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అనుకూలమైన ఉత్తర్వు ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాలను అప్పగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చింది. కానీ కుటుంబ సభ్యులు మృతదేహాల కోసం వేచి ఉండగా, రాష్ట్రం వాటిని 'క్లెయిమ్ చేయని మృతదేహాలు' అంటూ దహనం చేసింది.

కొన్ని రోజుల క్రితం, హక్కుల కార్యకర్త సోని సోరి కర్రెగుట్ట కొండలలో చంపబడిన వారి సభ్యుల మృతదేహాలను తీసుకురావడానికి బీజాపూర్ ఆసుపత్రికి కొన్ని ఆదివాసీ కుటుంబాలతో పాటు వెళ్ళిన అనుభవాన్ని వివరించారు. కుళ్ళిపోయిన మృతదేహాలపై వేలాది పురుగులు పాకుతూ ఉండడంతో వాటిని గుర్తించలేకపోయారు. బస్తర్‌లోని మావోయిస్టులను, ఆదివాసీల ప్రాణాలు తీసిన తర్వాత కూడా రాజ్య హింస కొనసాగుతోంది.

భారతదేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చడానికి మోడీ ప్రభుత్వం 2026 మార్చి 31 వరకు గడువు విధించింది. భద్రతా దళాలకు లైసెన్స్‌లు, చంపడానికి ప్రోత్సాహకాలు ఇవ్వబడుతున్నాయి, ప్రతి హత్యకు హామీగా భారీ బహుమతులు లభిస్తాయి. ప్రభుత్వంతో కలిసి పనిచేసే మావోయిస్టులకు లొంగిపోయే విధానం ఉంది, కానీ ఈ విధానం వారిని 'జన జీవనం స్రవంతి' అని పిలవబడే పాత స్థితిలో పునరావాసం కల్పించడానికి ఉద్దేశించబడలేదు, వారిని కిరాయి సైనికులుగా మార్చడం, వారి మాజీ సహచరులకు, తరచుగా అదే సమాజం, ప్రాంతం, కుటుంబాలకు చెందిన తోటి ఆదివాసీలకు వ్యతిరేకంగా బలవంతంగా వారిని పోటీ పెట్టడం మాత్రమే.

సిఆర్పీఎఫ్ దాని ఎలైట్ కోబ్రా కమాండోలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల వంటి వివిధ సాయుధ దళాల నుండి 60,000 కంటే ఎక్కువ మంది భద్రతా సిబ్బందితోనే కాకుండా లొంగిపోయిన మావోయిస్టులు, బస్తర్ ఫైటర్లు, స్పెషల్ టాస్క్ ఫోర్స్‌తో కూడిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్‌లతో విశాల సైనిక శిబిరాలు. భారతదేశంలో అత్యంత సాంద్రత కలిగిన సైనికీకరణ ప్రాంతాలలో బస్తర్ ఒకటిగా మారి పోయింది, ఇక్కడ ప్రజలు వైమానిక బాంబు దాడులకు ఇజ్రాయెల్ డ్రోన్‌ల వాడకానికి బలవుతున్నారు.

300కి పైగా భద్రతా శిబిరాలు ఈ ప్రాంతాన్ని సైనిక కంటోన్మెంట్‌గా మార్చాయి, ఇక్కడ ప్రతి ఎనిమిది మంది పౌరులకు ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. బస్తర్‌లోని ఆదివాసీలకు, జీవితంలోని ప్రతి అంశాన్ని భద్రతా దళాలు కప్పివేసి నిర్వహిస్తాయి. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో వాగ్దానం చేసిన స్వయం ప్రతిపత్తి, అటవీ హక్కుల చట్టం లేదా షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ విస్తరణ చట్టం కింద అందించబడిన హక్కులన్నీ పోలీసు రాజ్యం, సైనికీకరించిన పరిపాలన వింత వాతావరణంలో కనుమరుగయ్యాయి. బస్తర్ సైనికీకరణకు యుపిఎ కాలం నాటి ఆపరేషన్ గ్రీన్‌హంట్, సల్వా జుడుం వంటి మావోయిస్టు వ్యతిరేక ప్రచారాల నుండి సుదీర్ఘ చరిత్ర ఉంది, వీటిని 2011లో రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించి సుప్రీంకోర్టు రద్దు చేయాలని ఆదేశించింది. కానీ మోడీ శకం తీవ్ర హింసతో కొత్త దాడితో ప్రారంభమైంది. నేడు సైనికీకరణ అనేది భారీ కార్పొరేట్ దోపిడీని సులభతరం చేయడానికి ఒక 'శాశ్వత పరిష్కారం'.

మావోయిజంపై యుద్ధం ముసుగులో, సైనికీకరణ – కార్పొరేట్ దోపిడీల సంబంధానికి వ్యతిరేకంగా బస్తర్‌లో జరుగుతున్న ప్రతి ఆదివాసీ నిరసనను మోడీ ప్రభుత్వం మరుగుపరచడానికి ప్రయత్నిస్తోందని మనం గమనించాలి. గాంధేయవాది హిమాన్షు కుమార్‌ను ఛత్తీస్‌గఢ్ నుండి బహిష్కరించారు, రచయిత్రి కార్యకర్త బేలా భాటియాను వేధిస్తున్నారు, అణచివేస్తున్నారు. బస్తర్ లో దీర్ఘకాల ప్రజాదరణ పొందిన ప్రజా గొంతుక మాజీ సిపిఐ ఎమ్మెల్యే మనీష్ కుంజమ్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మూలవాసి బచావో మంచ్ అని పిలువబడే స్థానిక ప్రజల సైనికీకరణ వ్యతిరేక వేదికను నిషేధించారు. విచక్షణారహితంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం వంటి క్రూరమైన చట్టాల కింద ప్రజలను మూకుమ్మడిగా అరెస్టు చేస్తున్నారు. ఒక భావజాలాన్ని సమర్థించడం నేరం కాదనీ, ప్రతి ఎన్‌కౌంటర్‌పై తప్పనిసరి దర్యాప్తు కోసం మార్గదర్శకాలు ఉన్నాయని సుప్రీంకోర్టు పదే పదే చెప్పింది. నేడు సైద్ధాంతిక వేట, ఎన్‌కౌంటర్ హత్యలు, తటస్థీకరణగా ఎక్కువగా వర్ణించబడుతున్నాయి, ఇవి రాజ్యం నిరంకుశ పాలసీకి మూల స్తంభాలుగా మారాయి.

ఆపరేషన్ కగార్ పరిణామాలు బస్తర్ లేదా మావోయిస్టులకు మాత్రమే పరిమితం కావు.

అవి న్యాయంకోసం జరిగే ప్రతి ఉద్యమానికి, ఫాసిస్ట్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగే అన్ని అసమ్మతులకూ శరాఘాతంగా మారుతాయి.

త్వరలోనే, బస్తర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ అరాచక మోడల్ కొత్త లక్ష్యం చేసుకున్న సమూహాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా అమలవుతుంది. బిజెపి కర్ణాటక దుష్ట చిత్రాలలో అమిత్ షా చేతుల్లో ఉన్న కాలీఫ్లవర్ అందరికీ ఒక హెచ్చరికగా పనిచేయాలి. మావోయిస్టులు ఏకపక్ష కాల్పుల విరమణ ప్రకటించిన సమయంలో, శాంతి సంభాషణల ద్వారా రాజకీయ పరిష్కారంకోసం విస్తృత సమావేశం జరగాలి.

భారత గణతంత్ర రాజ్యపు రాజ్యాంగ పునాది మనుగడ సాగించడానికి నారాయణపూర్ హత్యాకాండ, ఆపరేషన్ కగార్ కింద జరిగిన ఇటీవలి మారణహోమాలపై న్యాయ పర్యవేక్షణలో దర్యాప్తు జరిగి తీరాలి. మావోయిస్టులు ప్రస్తుత పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలి. ఈ ఎదురుదెబ్బ తర్వాత తిరిగి సంఘటితం కావడానికి ప్రయత్నించాల్సివుంది.

బస్తర్ తదితర ప్రాంతాల సాధారణ ప్రజానీకం గౌరవ ప్రదమైన న్యాయానికి అర్హులు. ఈ అమానుష సైనికదాడికి బలైన అమాయక జన బాహుళ్యానికి న్యాయం జరిగేలా చూడడం ప్రజాస్వామ్యవాదులందరి బాధ్యత.

# అందరి ఆకలి తీర్చే మార్గాలు లేవా?

ఆకలి అనే మూడు అక్షరాల పదం ఎన్నో గుండెలపై బండవేసి, ఎన్నో కడుపులను మాడ్చేస్తుంది. నాగరికత ఎంత పరుగులు పెట్టినా, టెక్నాలజీ ఆకాశ హర్మ్యాలను సృష్టిస్తున్నా, ఆకలితో అలమటించేవారి సంఖ్య మాత్రం నానాటికీ పెరిగిపోతోంది. ఇది మనల్ని కంటికి రెప్పలా వెంటాడే చేదు నిజం. ఆకలి అనేది కేవలం కడుపులో మండే మంట కాదు; అది మనిషి శారీరక, మానసిక, సామాజిక జీవనాన్ని తలకిందులు చేసే భయంకరమైన అగ్నిజ్వాల. మన సామాజిక ప్రగతికి అద్దం పట్టే ఓ చీకటి చిత్రం ఇది.

**ప్రపంచ ఆకలి: కన్నీటి కట్టలు తెంచుతున్న దృశ్యాలు**

మన భూమి ఆకలిని తీర్చడానికి పుష్కలంగా పండిస్తోంది. ఆహారం ఉన్నా సరే, అది అందరికీ అందడం లేదు. ఎందుకు? అని ప్రశ్నించుకుంటే, యుద్ధాల కరాళ నృత్యం, వాతావరణ విపత్తుల దండు, ఆర్థిక మాంద్యాల పడగ నీడ, ఇంకా లోతుగా వేళ్లూనుకున్న అసమానతలు – ఇవన్నీ ఆకలి అనే రాక్షసుడికి ఆజ్యం పోస్తున్నాయి. ఆకలి సమస్య ఎంత తీవ్రంగా ఉందో గణాంకాలు కళ్ళముందు స్పష్టం చేస్తున్నాయి. 2024 గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్ చెప్పిన లెక్కలు గుండెలను బరువెక్కిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 78.3 కోట్ల మందికి పైగా ఆకలి అనే మంటతో నిత్యం పోరాడుతున్నారు. 2023లో సంక్షోభ ప్రాంతాల్లో 28.2కోట్ల మందికి పైగా తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు. ఇది కేవలం సంఖ్య కాదు, ప్రతి సంఖ్య వెనుక ఒక జీవితం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉంది. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ (FAO) అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 42% మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. అంటే, సగం మందికి పైగా ప్రజలు కనీసం పోషక విలువలున్న ఆహారం కూడా తినలేకపోతున్నారు. ఇది నిజంగా మానవాళి సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం.



**భారతావనిలో ఆకలి – కనబడుతున్న వాస్తవం:**

మన భారతదేశం అపారమైన వ్యవసాయ సంపద ఉన్న దేశం. అయినా కూడా, ఆకలి, పోషకాహార లోపం అనేవి ఇక్కడ తీరని గాయాలు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్, నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 5 గణాంకాలు మన కళ్ళ ముందు నిజాన్ని నిలుపుతున్నాయి. మన దేశంలో సుమారు 16% మంది పోషకాహార లోపంతో అలమటిస్తున్నారు. ఐదేళ్లలోపు పిల్లలలో 35.5% మంది వయస్సుకి తగ్గ ఎత్తు లేరు, 19.3% మంది ఎత్తుకి తగ్గ బరువు లేరు. ఏకంగా 32.1% మంది పిల్లలు తక్కువ బరువుతోనే ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉన్న మన దేశంలో ఈ పరిస్థితి మనల్ని తీవ్రంగా కలవరపెడుతుంది. మహిళల విషయానికొస్తే, ప్రపంచవ్యాప్తంగా కోటిమందికి పైగా మహిళలు, కౌమార బాలికలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సంఖ్యలో మనదేశం నుండి గణనీయమైన వాటా ఉంది. తల్లి కడుపు నిండకపోతే, పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యం ఎలా? ఈ పోషకాహార లోప చక్రం తరతరాలుగా కొనసాగుతోంది. ఐదేళ్ల లోపు పిల్లలలో సంభవించే మరణాలలో దాదాపు 45% పోషకాహార లోపం వల్లనే సంభవిస్తున్నాయని అంచనా. ఇది ఒక అదృశ్య విషాదం, ప్రతిరోజూ మన కళ్ళ ముందే జరుగుతున్న ఘోరం.

**ఆకలికి మూలాలు – కారణాల అన్వేషణ:**

ఆకలి సమస్యకు మూలాలు బహుముఖంగా ఉన్నాయి. వాతావరణ మార్పులు అస్తవ్యస్తమైన వర్షపాతం, కరువులు, వరదలు, వడగాల్పులు వంటి రూపాల్లో ఆహార ఉత్పత్తిని నిరంతరం బెదిరిస్తూనే ఉన్నాయి. అతివృష్టి, అనావృష్టి ఈ రెండింటి కారణంగా రైతుల పంటలు పాడైపోతున్నాయి. అప్పుడు వారు తినడానికి తిండి లేక, అప్పుల పాలై ఆకలితో అల్లాడుతారు. దీనికి తోడు, ఆర్థిక అసమానతలు, ద్రవ్యోల్బణం వలన అందరికీ అందుబాటులో ఆహారం ఉండడం లేదు.

**ఆకలి లేని సమాజం – దిశానిర్దేశం:**

కడుపునిండా తినే హక్కు ప్రతి మనిషికి ఉంది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన, ఆహార హక్కును ప్రాథమిక మానవ హక్కుగా గుర్తిస్తుంది. ఒక విత్తనం నాటితే అది పెద్ద చెట్టై పండ్లు ఇచ్చినట్లుగా, మనం ఇప్పుడు వేసే చిన్న చిన్న అడుగులు, దీర్ఘకాలంలో పెద్ద మార్పును తీసుకువస్తాయి. కేవలం కడుపు నింపడం కాదు, ఆ కడుపుని నింపే వ్యవస్థలకు ప్రాణం పోయాల్సిన సమయమిది. వ్యవస్థాగత మార్పులు ఆకలి సమస్యలను తట్టుకుని, మళ్ళీ నిలబడే శక్తిని, బలాన్ని కలిగించే వ్యవస్థలను తయారు చేయాలి. స్థితిస్థాపక ఆహార సరఫరా గొలుసులను నిర్మించడం, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవస్థాగత అసమానతలను పరిష్కరించడం ఇవన్నీ ఇందులో భాగం. వాతావరణ మార్పుల సుడిగుండంలో చిక్కుకుపోయి, ప్రతిరోజూ బతుకు కోసం పోరాడుతున్న చిన్న రైతులకు, ముఖ్యంగా మహిళలకు అండగా నిలబడాలి. స్థానిక ఆహార వ్యవస్థలకు వారే వెన్నెముక. వారికి వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులు, అప్పులు, సాంకేతికత, మార్కెట్ అనుసంధానం మరింత సురక్షితమైన, సమానమైన ఆహార పంపిణీకి బాటలు వేస్తుంది. మహిళా రైతులకు వనరులకు సమాన ప్రాప్యత ఉన్నప్పుడు, వ్యవసాయ ఉత్పత్తి 30% వరకు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రభుత్వ పథకాలు, సమర్థవంతమైన అమలు కీలక పాత్ర పోషిస్తాయి. మన భారతదేశం ఈ సమస్యకు స్పందించే తీరులో స్వల్పకాలిక ఉపశమనం, దీర్ఘకాలిక వ్యవస్థాగత మార్పు రెండూ ఉండాలి. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, మధ్యాహ్న భోజన పథకం, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ వంటి పథకాలు కొంతవరకు ఫలితాలనిచ్చినా, వాటి అమలులో లోపాలు, లీకేజీలు, ఇంకా అందరికీ అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. పోషకాహార సున్నితమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఆహార వైవిధ్యాన్ని పెంచడం తక్షణ అవసరం. మారుమూల, గిరిజన ప్రాంతాలలో ఇనుము, ప్రోటీన్, సూక్ష్మ పోషకాలు అధికంగా ఉండే ఆహారా లు లభించేలా చూసుకోవడం చాలా కీలకం. కేవలం ప్రభుత్వ విధానాలు మాత్రమే కాకుండా, ప్రైవేట్ రంగం కూడా ఆహార నష్టాన్ని, వ్యర్థాలను తగ్గించడంలో, స్థానిక రైతులకు మద్దతు ఇవ్వడంలో, పౌష్టికాహారాన్ని అందించే ఉత్పత్తులలో పెట్టుబడి పెట్టడంలో భాగస్వామ్యం వహించాలి. కరువును తట్టుకునే, తక్కువ నీటితో పండే పంటల విత్తనాలను రైతులకు అందివ్వాలి. తక్కువ నీటిని వాడే డ్రిప్ ఇరిగేషన్ వంటి నూతన వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టాలి. పంటలు నష్టపోయినా వారికి కొంత డబ్బు వచ్చేలా ఇప్పటి కంటే ఇంకా ఎక్కువ భీమా పథకాలు ఏర్పాటు చేయాలి. పండిన పంటను సరైన ధరకి అమ్ముకోవడానికి మార్కెట్లకు అనుసంధానం కల్పించాలి.

**ఆకలి లేని రేపటి కోసం – మన కర్తవ్య దీక్ష:**

పేదరికం ఆకలికి దారితీసి, అది తిరిగి పేదరికాన్ని పెంచే ఈ ఆకలి చక్రాన్ని బద్దలు కొట్టాలి. ఆకలిని కేవలం ఆహార సమస్యగా కాకుండా, సామాజిక, ఆర్థిక, పర్యావరణ న్యాయ సమస్యగా గుర్తించాల్సిన సమయం ఇది. మనం ప్రజలలో, ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారిలో పెట్టుబడి పెట్టాలి, ఇంకా ఉత్పాదకమైనవి మాత్రమే కాకుండా, అందరినీ కలుపుకుపోయే, సమానమైన, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించాలి.ఆకలి లేని రేపటి కోసం, ఏ బిడ్డ కూడా ఆకలితో నిద్రపోకుండా, ఏ తల్లి బలహీనతతో బిడ్డను కనకుండా, ఏ రైతు ఒంటరిగా పోరాడకుండా చూసేందుకు మనం కట్టుబడి ఉందాం. మన చుట్టూ ఉన్న ఆకలి కేకలను విందాం, మనవంతు సాయం చేద్దాం. రేపటితరం ఆకలిలేని సమాజంలో జీవించేలా మనవంతు కృషి చేద్దాం!



జనక మోహన రావు దుంగ
8247045230

# ఆహారధాన్యాల్లో జన్యు మార్పిడి విలయంవైపు ప్రయాణం



కమల హాసన్ తుమ్మ
జీవశాస్త్ర నిపుణుడు
9505618252

ప్రతిష్టాత్మకమైన శాస్త్రీయ పురోగతులు మానవ జీవితాన్ని సులభతరం చేస్తున్నాయనడం లో సందేహం లేదు. అయితే కొన్ని పరిణామాలు దీర్ఘకాలిక పర్యవసానాలను లెక్కచేయకుండా ఆచరిం చబడ్డప్పుడు, అవి మానవాళికి సమస్యలుగా మారతాయి. ఇటువంటి సంభావ్య ప్రమాదాలలో ఒకటి జన్యు మార్పిడి (Genetically Modified GM) ఆహార ధాన్యాల వినియోగం. ఈ అంశంపై దేశవ్యాప్తంగా మెలకువ పెరుగుతున్న వేళ, సంపూర్ణ అవగాహనతో కూడిన చర్చ జరగాల్సిన అవసరం వుంది. జీవవైవిధ్యాన్ని కాపాడుకునే కర్తవ్యం ఉన్న మన దేశానికి ఇది అత్యవసరమైన పరిణామం.

**జన్యు మార్పిడి:**

జన్యు మార్పిడి అనేది జీవుల డిఎన్ఎలో కృత్రిమం గా మార్పులు చేసి, వాటి లక్షణాలను మార్చే ప్రక్రియ. ఈ విధానాన్ని ఉపయోగించి కొన్ని ధాన్యాలలో పురుగుల నిరోధకత, ఎక్కువ దిగుబడి, వాతావరణ అనుకూలత వంటి లక్షణాలను కలిపేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఉదాహరణకు Bt పత్తి, GM సోయాబీన్, Bt మక్క వంటి పంటలు ఇప్పటికే కొన్ని దేశాల్లో సాగు అవుతున్నాయి. అయితే మనం ప్రశ్నించాల్సింది – ఈ ప్రయోగాలు మన ఆరోగ్యానికి, భూమి పోషణకు, జీవవైవిధ్యానికి హానికరమా లేదా?

మార్పిడైన విత్తనాలు ఎక్కువ ఖర్చుతో కూడినవే కాకుండా, చాలావరకు బహుళజాతి సంస్థల ఆధీనంలో ఉంటాయి. ఇవి తమ విత్తనాలను పునరుత్పత్తి చేసుకోలేని విధంగా రూపొందిస్తాయి. రైతులు ప్రతి పంట కాలంలో కొత్తగా విత్తనం కొనాల్సిందే. పేటెంట్ హక్కులు రైతుల స్వాతంత్ర్యాన్ని హరిస్తున్నాయి. వారు స్వతంత్రంగా విత్తనాన్ని భద్రపరచుకునే స్వేచ్ఛ కోల్పోతున్నారు. కొన్ని జన్యు మార్పిడి విత్తనాలు విఫలమైన సందర్భాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. Bt పత్తి పంట ఫెయిల్యూర్లు, రైతుల ఆత్మహత్యలు ఈ తరహాలోనే చోటు చేసుకున్న ఉదాహరణలు. ఇది కేవలం వాణిజ్యపరమైన ప్రయోజనాల కోసమే జరిగే ప్రక్రియల పట్ల నిరోధం అవసరమన్న భావన ప్రజల్లో బలపడుతోంది.

**న్యాయపరంగా**

భారతదేశంలో జన్యు మార్పిడి ఆహారాల వ్యాప్తిని నియంత్రించడానికి జిఇఎసి అనే సంస్థ బాధ్యత వహిస్తోంది. అయితే ఈ కమిటీ తీర్పులపై మిశ్రమ స్పందన ఉంది. ప్రస్తుతం మనదేశంలో Bt పత్తి మాత్రమే చట్టబద్ధంగా అనుమతించబడి ఉంది. కానీ ఆన్‌లైన్ మార్కెట్ల ద్వారా ఇతర జన్యు మార్పిడి విత్తనాలు అక్రమంగా విక్రయమవుతున్నట్లు కేసు లు నమోదు అవుతున్నాయి. అలాగే, జన్యు మార్పిడి మక్క లేదా జన్యు మార్పిడి మస్టర్డ్ వంటి పంటలకు అనుమతి ఇవ్వాలన్న చర్చలు కూడా జరుగుతున్నాయి.ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించకపోవడం, ప్రజలలో అసంతృప్తిని కలిగిస్తోంది.





**ఆరోగ్యంపై ప్రభావాలు**

జన్యు మార్పిడైన ఆహారాలు మానవ శరీరంపై ఏ విధమైన ప్రభావం చూపుతాయో దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని అధ్యయనాలు చెప్పినట్లు, జన్యుమార్పిడి ఆహారాలు దీర్ఘకాలికంగా తీసుకుంటే అలెర్జీలు, జీవకణాలలో మార్పులు, హార్మోన్ అసమతుల్యతలు ఏర్పడే ప్రమాదం ఉంది. కొన్ని ప్రయోగాల్లో జన్యుమార్పి డి మక్క తిన్న జంతువులకు జనన సంబంధిత సమస్యలు, అ వయవాల పనితీరులో మార్పులు కనిపించాయి. మానవులపై దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన అధ్య యనాలు లేనప్పటికీ, ప్రభావం ఉంటుంది అనేది నిజం. కాబట్టి మానవ ఆరోగ్యం పై విస్తృత పరిశోధనల తర్వాత మాత్రమే ఈ తరహా ఆహారాలను అనుమతించాలి.

**పర్యావరణంపై ముప్పు**

జన్యుమార్పిడి పంటలు జీవవైవిధ్యానికి తీవ్రమైన ముప్పు. ఉదాహరణకు: Bt పంటల వల్ల ఆవాస జీవులు(nontarget species)ప్రమాదంలో పడతాయి. ఇది పరస్పర నిష్పత్తుల్ని దెబ్బతీయగలదు. ఒకే విధమైన జన్యు లక్షణాలు కలిగిన విత్తనాలను విస్తృతంగా సాగు చేయడం వల్ల సహజ విత్తన రకాలు మాయమయ్యే ప్రమాదం ఉంది. జన్యు మార్పిడి పంటలు సహజమైన క్రిమిసంహార కాల కు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల సూపర్ పురుగులు అభివృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఇవి సాధారణ పురుగుమందులకు చెరగని జీవులుగా మారుతాయి. ఈ విధంగా, పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, భవిష్యత్ తరాలకు మిగిలే భూమి సారవంతత కూడా ప్రమాదంలో పడుతుంది.

**రైతులపై ప్రభావం**

భారతీయ వ్యవసాయ వ్యవస్థ చిన్న, మధ్య రైతుల పై ఆధారపడినది. జన్యు

**ప్రజా చైతన్యం మరియు ఉద్యమాలు**

దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు, ఆరోగ్య కార్యకర్తలు – జన్యు మార్పిడి ఆహారాల వ్యాప్తికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. సేవ్ ది సీడ్ స్వదేశీ విత్తనాల పరిరక్షణ జీవవైవిధ్య పరిరక్షణ వంటి ఉద్యమాలు ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నాయి. అంతర్జాతీయంగా కూడా కొన్ని దేశాలు (ఉదా: ఫ్రాన్స్, జర్మనీ, రష్యా) జన్యు మార్పిడి ఆహారాలపై నిషేధం విధించాయి. మన దేశం కూడా ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం వుంది.

**పరిష్కార మార్గాలు**

సహజ మరియు దేశీయ విత్తన రకాలను ప్రోత్సహించి, వాటిపై పరిశోధనకు ప్రభుత్వం పెద్దపీట వేయాలి.జీవ వ్యవసాయం, ఆర్గానిక్ పద్ధతులను ప్రోత్సహించాలి. ప్యాకేజింగ్‌పై జన్యు మార్పిడి/స హజ విత్తన వివరాలు స్పష్టంగా ఉండాలి. జిఇఎసి వంటి సంస్థలను పారదర్శకంగా, ప్రజా భద్రత కోణంలో పనిచేసేలా పునఃనిర్మించాలి. రైతుల స్వావలంబనకు పథకాలు రచించాలి. విత్తన స్వాతంత్ర్యం కోసం రైతులకు మద్దతు కల్పించాలి. ఆహారం అనేది కేవలం శరీర పోషణ కోసమే కాదు – అది సంస్కృతి, జీవన శైలికి ప్రతీక. మన ఆహార వ్యవస్థలో మార్పులు తెచ్చే ముందు, వాటి ప్రభావాలను శాస్త్రీయంగా, సమాజపరంగా, ఆర్థికపరంగా విస్తృతంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ తరాల జీవన భద్రత కోసం, ఆహార ధాన్యాల్లో జన్యు మార్పిడికి నో చెప్పే సమయం ఇది. వృద్ధి వైపు కాదు, విలయం వైపు దారితీసే మార్గాలకు నో చెప్పడమే నిజమైన శాస్త్రీయ ఆలోచన.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

### ఐదుగురు మృతి, 25 మందికిపైగా కార్మికులకు గాయాలు



**చండీగఢ్ :** పంజాబ్‌లోని ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు జరిగింది. ఈ పేలుడులో ఐదుగురు మృతి చెందగా, 25 మందికిపైగా కార్మికులు గాయపడ్డారు. ఈ ఘటన శ్రీ ముక్త్‌సర్ సాహిబ్ జిల్లాలోని లంబి నియోజక వర్గం పరిధిలోని సింఘే వాలాఫరీద్‌కోట్ కోట్లిలో జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం, ఈ పేలుడు జరిగిన చోట రెండు క్రాకర్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఒక యూనిట్‌లో క్రాకర్లు తయారు చేసి, మరో యూనిట్‌లో క్రాకర్లు ప్యాక్ చేస్తారు. అయితే క్రాకర్లు తయారు చేసే చోట ఈ పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మకులు మృతి చెందారు. కొంత మంది కార్మకులు శిథిలాల కింద చిక్కుకున్నారు. అనంతరం కొందరిని సివిల్ ఆసుపత్రికి, మరికొందరిని ఎయిమ్స్‌కి తరలించారు. ఎస్ఎస్‌పి అఖిల్ చౌదరి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. '

# భయం పాములాంటిది!

### పడగెత్తితే గుహనుంచి లాగి తొక్కేస్తాం

### పహల్గామ్ దాడి సూత్రదారులు నక్కి ఉన్న ప్రదేశాలను భారత సాయుధ బలగాలు కూల్చివేశాయ్ : ప్రధాని మోదీ



**కరకట్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భయాన్ని పాముతో పోల్చారు. అది మళ్ళీ తన పడగను ఎత్తితే, గుహ నుండి బయటకు లాగి తొక్కేసినట్లు పాకిస్థాన్‌లో కూర్చుని జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లో దాడి సూత్రధారులు నక్కి ఉన్న ప్రదేశాలను భారత సాయుధ దళాలు ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ బీహార్‌లోని కరకట్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' భారత అమ్ములపొదిలో ఒక బానం మాత్రమేనన్నారు. ఉగ్రవాదంపై పోరాటం ముగియలేదని, దానిని ఆపేంత వరకూ కొనసాగుతూనే ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. గత నెలలో మధుబని జిల్లాలో తాను ర్యాలీని చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ 'పహల్గామ్‌లో జరిగిన దారుణమైన దాడి తర్వాత ఒక రోజు నేను బీహార్‌కు వచ్చాను, అక్కడ మన సోదరీమణులు చాలా మంది తమ భర్తలను కోల్పోయారు. నేరస్థులకు వారు కలలో కూడా ఊహించని శిక్ష లభిస్తుందని నేను వాగ్దానం చేశాను. ఈ రోజు, నేను హామీని నెరవేర్చిన తర్వాత బీహార్‌కు తిరిగి వచ్చాను' అని అన్నారు. 'భారతదేశపు కుమార్తెలు ధరించే సిందూరం (సింధూరం) శక్తిని పాకిస్థాన్‌తో పాటు యావత్ ప్రపంచం చూసింది. పాక్‌సైన్యం రక్షణలో ఉగ్రవాదులు సురక్షితంగా ఉండేవారు. కానీ మేము వారిని మోకాళ్లపై నిలబెట్టాము. పాకిస్థాన్ వైమానిక స్థావరాలను, వారి సైనిక స్థావరాలను కూడా నాశనం చేసాము. ఇది కొత్త భారతదేశం (నయా భారత్), దాని శక్తి అందరూ చూడవచ్చు' అని ప్రధాన మంత్రి అన్నారు. ఆపరేషన్ సిందూర్ మన అమ్ముపొదిలో ఒక బాణం మాత్రమే అని శత్రువు గ్రహించాలన్నారు. ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదని, ఆగలేదు అని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం మళ్ళీ పడగెత్తాలని ప్రయత్నిస్తే, దానిని దాని మూలాల నుండి బయటకు లాగి తొక్కివేస్తామన్నారు. అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ పరిపాలన ఒత్తిడితో ప్రభుత్వం 'కాల్పు విరమణ'కు అంగీకరించిందని కొన్ని ప్రతిపక్ష పార్టీల విమర్శల నేపథ్యంలో ప్రధాన మంత్రి ఈ ప్రకటన చేయడం గమనార్హం. మోదీ తన ప్రసంగంలో జమ్ము కశ్మీర్‌లో దేశం కోసం పోరాడుతూ మరణించిన సరన్ జిల్లాకు చెందిన బిఎస్ఎఫ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ గురించి కూడా ప్రస్తావించారు. అతని త్యాగాన్ని 1857 తిరుగుబాటు వీరులలో ఒకరిగా పరిగణించబడే బీహార్‌లోని జగదీష్‌పూర్ రాజు వీర్ కున్వర్ సింగ్ పరాక్రమంతో పోల్చారు. సరిహద్దు భద్రతా దళాన్ని ప్రశంసిస్తూ మాతృతభూమికి సేవ చేయడం బిఎస్ఎఫ్ జవాన్లకు అత్యున్నతమైనజని వ్యాఖ్యానించారు. దేశానికి శత్రువులుగా వ్యవహరించే వారు ఎక్కడ ఉన్నా వారిపై తమ పోరాటం అని చెప్పారు. ప్రజలు వీధుల్లోకి రావడానికి భయపడే సందర్భాలు ఉన్నాయని, ఎందుకంటే వారు ఎప్పుడు, ఎక్కడ నక్సలైట్ల దాడులను ఎదుర్కొంటారో వారికి తెలియదన్నారు. నక్సలైట్ల ప్రభావిత గ్రామాలకు ఆసుపత్రులుగానీ, మొబైల్ టవర్లుగానీ లేవన్నారు. ఒకప్పుడు నక్సల్స్ పాఠశాలలకు నిప్పు పెట్టేవారు, రోడ్డు నిర్మాణంలో పాల్గొన్న వారిని హత్య చేసేవారు, వారికి బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంపై నమ్మకం లేదని మోదీ పేర్కొన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వం కఠినంగా శిక్షించడం ప్రారంభించిందని మోడీ పేర్కొన్నారు. నక్సలైట్ల హింస ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుండి కేవలం 18కి తగ్గిందని ఆయన అన్నారు. కాగా, బీహార్ అభివృద్ధి కోసం తన ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి కూడా మోడీ మాట్లాడారు, అక్కడ కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయని, ఉన్నవి కూడా కొత్త రూపం దాల్చుతున్నాయన్నారు. రాష్ట్రంలో బిజెపి ప్రధాన ప్రత్యర్థి అయిన ఆర్‌జెడిని పరోక్షంగా ప్రస్తావిస్తూ, 'పెద్ద ఎత్తున వలసలకు కారణమైన పాలన కలిగిన వారు ఇప్పుడు అధికారాన్ని చేజిక్కించుకోవడానికి సామాజిక న్యాయం చేస్తున్నట్లు నటిస్తున్నారు' అని ప్రధాని అన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం మోదీ కరకట్‌లో రూ.48,520 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

**పహల్గామ్ బాధితుడిని పరామర్శించిన మోదీ**

ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మందిలో ఒకరైన శుభం ద్వివేది కుటుంబాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పరామర్శించారు. చాకేరి విమానా శ్రయంలో దుఃఖిస్తున్న కుటుంబాన్ని ప్రధాని కలిశారు. ఇది చాలా భావోద్వేగ సమావేశం అని శుభం బంధువు సౌరభ్ ద్వివేది అన్నారు. 'ప్రధాని మోదీని కలిసినప్పుడు కుటుంబ సభ్యులందరూ ఏడవడం ప్రారంభించారు' అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ప్రధా న మంత్రి కూడా భావోద్వేగానికి గురయ్యారు. శుభం కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారని సౌరభ్ వెల్లడించారు.

## సుప్రీంకోర్టులో కొత్త జడ్జిలు ప్రమాణం

### భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌చే ముగ్గురి ప్రమాణం



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సహా 34మంది జడ్జిల సంఖ్యతో తాజాగా అత్యున్నత న్యాయస్థానం పూర్తిస్థాయి పనిసామర్థ్యాన్ని భర్తీ చేసుకుంది.శుక్రవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ జస్టిస్ ఎన్‌వి.అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ ఎఎస్. చందుర్కర్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదవీ స్వీకారం చేయించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో సిజెఐ ఈ ముగ్గురు జడ్జిలతో ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టులో సిజెఐ సహా 34మంది జడ్జిలతో ఉండాల్సిన పూర్తి సంఖ్య భర్తీ జరిగింది. కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ అంజారియా, గువహతి హైకోర్టు చీఫ్ జస్టిస్ విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ చందుర్కర్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సోమవారం సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విషయం తెలిసిందే. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ వారి నియామకాల విషయాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, హృషజకేష్ రాయ్‌లు పదవీవిరమణ చేయడంతో ఇప్పటి వరకూ ఖాళీగా ఉన్న మూడు స్థానాలలో కొత్తగా ముగ్గురి జడ్జిల నియామకం జరగడంతో వారు శుక్రవారం ప్రమాణం చేశారు. జస్టిస్ అంజారియ కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2024, ఫిబ్రవరి 25న ప్రమాణం చేశారు. ఇంతకుముందు ఆయన 2011, నవంబర్‌లో గుజరాత్ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2013 సెప్టెంబరు 6న పర్మినెంట్ జడ్జిగా స్థిరపడ్డారు. 1965, మార్చి 23న అహ్మదాబాద్‌లో అజారియా జన్మించారు. 1989లో అహ్మదాబాద్‌లోని యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆగష్టు 1988నుంచి అజారియా గుజరాత్ హైకోర్ట్ నుంచి లా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆ సమయంలో ఆయన రాజ్యాంగసంబంధిత అంశాలు, అన్ని కేటగిరీలకు చెందిన సివిల్ కేసులు, న్యాయ సేవ విషయాలకు సంబంధించిన కేసులను వాదించారు. జస్టిస్ బిష్ణోయ్‌గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2024, ఫిబ్రవరి 5న ప్రమాణం చేశారు. ఆయన రాజస్థాన్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా 2013, జనవరి 8న నియమితులయ్యారు. 2015, జనవరి 7న హైకోర్టు శాశ్వత జడ్జి అయ్యారు. 1964లో జోధ్‌పూర్‌లో మార్చి 26న బిష్ణోయ్ జన్మించారు. 1980 జులై 8న న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకున్నారు. రాజస్థాన్ హైకోర్టులో, జోధ్‌పూర్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో ప్రాక్టీస్ చేశారు.1965 ఏప్రిల్ 7న జన్మించిన జన్మించిన జస్టిస్ చందుర్కర్ న్యాయశాస్త్రంలో పట్టా పొందిన తర్వాత 1988 జులై 21న బార్‌లో నమోదు అయ్యారు. జస్టిస్ చందుర్కర్ 1992లో నాగ్‌పూర్‌కు షిఫ్ట్ అయ్యి వివిధ కోర్టులలో ప్రాక్టీస్ చేశారు. ఆయన 2013, జూన్ 21న బాంబే హైకోర్టు అడిషనల్ జడ్జిగా పదోన్నతి పొందారు.

# ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఏమైనా చేస్తాం

### ప్రమాదకరమై ఆట ముగిసిందని పాక్ అర్థం చేసుకోవాలి

### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆడుతున్న ఉగ్రవాదం అనే 'ప్రమాదకరమై ఆట' ఇక ముగిసిందని ఆ దేశం స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ దెబ్బతో పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందని, భారతదేశాన్ని దాడులు చేయకుండా ఆపమని ప్రపంచాన్ని వేడుకుందని పేర్కొన్నారు. గోవాలోని విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో, నావికాదళ సభ్యులతో భేటీ అయిన రాజ్‌నాథ్ సింగ్, పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ ఏమాత్రం వెనుకాడదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కనీసం ఊహించలేని అన్ని పద్ధతులను ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, ఇది ఉగ్రవాదంపై భారత్ చేసిన ప్రత్యక్ష దాడి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆలోచించగల ప్రతి పద్ధతిని వాడతాం., అంతేకాకుండా పాకిస్థాన్ కనీసం ఆలోచించలేని పద్ధతులను కూడా ఉపయోగించడానికి వెనుకాడమన్నారు. పాక్ తన భూభాగంలో ఉన్న ఉగ్రవాద నర్సరీలను నిర్మూలించాలని, ఇది పాకిస్థాన్‌కే ప్రయోజనకరమని రాజ్‌నాథ్ సింగ్ హితవు పలికారు. 'పాకిస్థాన్ నేల నుంచి బహిరంగంగా భారత వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయి. సరిహద్దు, సముద్ర మార్గాల ద్వారా ఉగ్రవాదులపై ఎలాంటి ఆపరేషన్ నిర్వహించడానికైనా భారత్ పూర్తిగా సిద్ధంగా ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు అన్నీ తమ పౌరులను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కును భారత్ గుర్తిస్తోందని, అందువల్లే నేడు ప్రపంచంలోని ఏ శక్తీ భారత్ ఈ పని చేయకుండా ఆపలేదన్నారు.

## పాక్‌లోని 118 పోస్టులు ధ్వంసం

### బిఎస్ఎఫ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు



**పూంచ్ :** పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాల (బిఎస్ఎఫ్)పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బిఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బిఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చే శాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది అని అమిత్ షా పేర్కొన్నారు. బిఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బిఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు.

## తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతాను..

### కన్నడ భాష వివాదంపై కమల్ హాసన్



చెన్నై : తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలకు గానూ ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలనే డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా వివాదంపై కమల్ హాసన్ స్పందించారు. ఈ విషయంలో క్షమాపణలు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. తప్పు చేసి ఉంటేనే క్షమాపణలు చెప్తానని స్పష్టం చేశారు. 'నేను తప్పు చేస్తే క్షమాపణలు చెప్తాను. లేదంటే చెప్పను. ఇది నా శైలి. ఈ విషయంలో ప్రజలు జోక్యం చేసుకోవద్దు' అంటూ చెప్పుకొచ్చారు. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం అని తాను చట్టం, న్యాయాన్ని నమ్ముతానని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు.

## ఆరేళ్ళలో 291 శాతం పెరిగిన దొంగనోట్లు

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే




**న్యూఢిల్లీ :** గడిచిన 11 ఏళ్ళ మోదీ ప్రభుత్వ హాయంలో రూ.6.37 లక్షల కోట్ల విలువైన బ్యాంకు మోసాలు జరిగాయని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. నోట్ల రద్దు తరువాత బ్యాంకు మోసాలు 416 శాతం పెరిగాయని, రూ.500 దొంగనోట్లు గడిచిన ఆరేళ్ళలో 291 శాతం పెరిగాయని తెలిపారు. తన నరాలలో రక్తం కాదు సిందూరం పరిగెడుతుందన్న మోదీని ఉద్దేశించి ఖర్గే ఎద్దేవా చేస్తూ ' మోదీ జీ మీ నరాల్లో ఏమి పరిగెడుతుందో నాకు తెలియదు కానీ, మీ ప్రభుత్వం నరాల్లో మాత్రం మోసం,బూటకం ఉంది'' అని తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో 2016 నవంబర్ 8న రాత్రి ఘనంగా నోట్ల రద్దును ప్రకటించి మోదీ ఆర్థిక వ్యవస్థకు దిగ్భ్రాంతి కలిగించారని, ఆ తరువాత ఎన్నడూ పూర్తిగా కోలుకోలేదని పోస్ట్ చేశారు. ఆ వెంటనే రూ.2000 నోట్లు ప్రవేశపెట్టి అంతే అకస్మాత్తుగా 2023 సెప్టెంబర్ 30న వెనక్కి తీసుకున్నారని, దీనిపై పెట్టిన ఖర్చు వృథా అయిందని విమర్శించారు. 2024–25లో రూ.500 నోట్లు 37 శాతం పెరిగాయని, నాడు దొంగ నోట్లు నిర్మూలిస్తామని చెప్పిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు.

## పలువురు జడ్జిలపై అభ్యంతరకరమైన వీడియో

### పరువునష్టం కలిగించే వ్యాఖ్యలపై..'సుప్రీం' సుమోటో 'కంటెంప్ట్' చర్యలు

### యూ ట్యూబ్ ఛానల్ ఎడిటర్-ఇన్-చీఫ్ వర్‌ప్రద్‌కు నోటీస్ జారీ



**న్యూఢిల్లీ :** తన యూ ట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన ఒక వీడియోలో కొంతమంది సుప్రీంకోర్టు జడ్జిలపై అవమానకరమైన, పరువునష్టం కలిగించే ధిక్కార వ్యాఖ్యలను చేసిన ఛండీగఢ్ కు చెందిన జర్నలిస్ట్, యూ ట్యూబర్ అజయ్‌శుక్లాపై శుక్రవారం సుప్రీంకోర్టు సుమోటో ధిక్కార చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జి మాసిహ్, జస్టిస్ ఏఎస్.చందుర్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆ అభ్యంతరకరమైన వీడియోను వెంటనే ఉపసంహరించుకోవాలని, దానిని లేదా అలాంటి కంటెంట్‌ను తిరిగి ప్రచురించకుండా యూ ట్యూబ్ ఛానల్‌ను నిరోధించాలని ఆదేశించింది.అంతేకాకుండా ఆ ఛానల్ ఎడిటర్ఇన్‌చీఫ్ వర్‌ప్రద్‌కు నోటీస్ కూడా జారీచేసింది. ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు 'చాలా తీవ్రమైనవి' అని అభివర్ణించారు. ఈ అంశాన్ని సుమోటో నేరంగా స్వీకరించినందుకు ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలియజేశారు.'అజయ్‌శుక్లాపై కోర్టు ధిక్కార కేసును నమోదు చేయాలని రిజిస్ట్రీని మేం ఆదేశిస్తున్నాం.యూట్యూబ్ ఛానల్ ప్రధాన ప్రతివాదిగాఉంటుంది.అటార్నీజనరల్ (ఆర్.వెంకటనరమణి), సొలిసిటర్ జనరల్(తుషార్ మెహ్‌తా) కోర్టుకు సహకరించాలని కోరుతున్నాం' అని ధర్మాసనం ఒక మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. వీడియో ప్రచురణను వెంటనే నిలిపివేయాలని, దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని యూ ట్యూబ్ ఛానల్‌ను బెంచ్ నియంత్రించింది.

## నిలంబూర్ ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా స్వరాజ్

తిరువనంతపురం : కేరళలోని నిలంబూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికకు ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా పార్టీ నేత ఎం స్వరాజ్‌ను సిపిఐ(ఎం) శుక్రవారం ప్రకటించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ మధ్య గట్టి పోటీ ఏర్పడనుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఉప ఎన్నికలు రెండు కూటములకు కీలకం కానున్నాయి. శుక్రవారం జరిగిన సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం సమావేశం అనంతరం మీడియా సమావేశంలో స్వరాజ్ అభ్యర్థిత్వాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం వి గోవిందన్‌ప్రకటించారు. 2016–2021 కాలంలో ఎర్నాకులం జిల్లాలోని త్రిపునితుర అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే స్వరాజ్, మలప్పురం జిల్లాలోని నిలంబూర్‌కు చెందినవారు. 2021 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన కె బాబు చేతిలో ఆయన ఓడిపోయారు. అయితే నిలంబూర్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ సీనియర్ నేత, కేరళ మాజీ మంత్రి ఆర్యదన్ మొహమ్మద్ కుమారుడు ఆర్యదన్ షౌకత్‌ను బరిలోకి దింపుతున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. నిలంబూర్‌లో ఉప ఎన్నిక జూన్ 19న జరగనుంది. పి.వి. అన్వర్ శాసనసభ్యుడిగా రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక జరగనుంది. ఆయన వామపక్ష మద్దతుతో రెండుసార్లు గెలిచారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో వివిధ అంశాలపై విభేదాల కారణంగా ఎల్‌డిఎఫ్‌తో సంబంధాలు తెంచుకున్న అన్వర్ తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత రాజీనామా చేశారు. కాగా, స్వరాజ్ అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తూ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ మాట్లాడుతూ నిలంబూర్ ఉప ఎన్నికలో ఎల్‌డిఎఫ్ గణనీయమైన పురోగతి సాధించనుందని అన్నారు. నిలంబూర్ ఉప ఎన్నిక అత్యంత తీవ్రమైన రాజకీయ పోటీలలో ఒకటి అవుతుందనే అవగాహనతోనే స్వరాజ్‌ను పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు ఆయన అన్నారు. స్వరాజ్ విలేకరులతో మాట్లాడుతూ వామపక్షాలు అనేక సందర్భాల్లో గెలిచిన నియోజకవర్గం నిలంబూర్ అని అన్నారు. పార్టీలకు అతీతంగా మాట్లాడేవారు కూడా కేరళను పరిపాలించడానికి వామపక్షాలే ఉత్తమమని నమ్ముతారని ఆయన అన్నారు. ఉప ఎన్నికల్లో వచ్చే ఓట్లు రాష్ట్రంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి ప్రజల ఆమోదాన్ని ప్రతిబింబిస్తాయని స్వరాజ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## అంకిత భండారి కేసులో ముగ్గురికి జీవితఖైదు



కోట్‌ద్వార్ : సుమారు మూడేళ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 19 ఏళ్ల రిసెప్షనిస్టు అంకిత భండా హత్య కేసులో ఉత్తరాఖండ్ స్థానిక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. రిసార్ట్ యజమాని పుల్‌కిత్ ఆర్య, అతనికి సహకరించిన ఇద్దరు ఉద్యోగులు సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను దోషులుగా నిర్ధారించింది. వీరికి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. ఉత్తరాఖండ్ పౌరీ జిల్లాలోని ఒక పేద కుటుంబానికి చెందిన అంకిత భండారి కొవిడ్ కారణంగా ఆర్థిక సమస్యలతో హోటల్ మేనేజిమెంట్ కోర్సును మధ్యలోనే నిలిపేసింది. ఆమె తండ్రి ఒక గార్డుగా పనిచేసేవాడు. ఈ క్రమంలో పుష్ప అనే స్నేహితురాలు ద్వారా రిషికేష్‌లోని వంతారా రిసార్ట్‌లో ఆమెకు రిసెప్షనిస్టుగా ఉద్యోగం వచ్చింది. 2022 సెప్టెంబర్ 18వ తేదీన ఆమె కనిపించకుండా పోవడం, నాలుగు రోజుల తర్వాత మృత దేహం ఒక కాలువలో దొరకడం సంచలమైంది. దీనిపై జనాగ్రహం వ్యక్తమైంది. పుల్‌కిత్ ఆర్క్ తండ్రి వినోద్ ఆర్య బిజెపి మాజీ నేత కావడంతో కేసు నుంచి అతన్ని తప్పించే ప్రయత్నం జరుగుతోందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో వినోద్ ఆర్యను పార్టీ నుంచి బిజెపి తొలగించింది. కేసు విచారణను సిట్‌కు అప్పగించారు. ఈ క్రమంలో పుల్‌కిత్ ఆర్య, సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను అరెస్టు చేశారు. విచారణలో రిసార్ట్‌కు వచ్చే అతిథులకు అదనపు సేవలు అందించాలని అంకితపై పుల్‌కిత్ ఒత్తిడి తెచ్చాడని, ఆమె అంగీకరించకపోవడంతో జరిగిన పెనుగులాటలో అతను, అతని సహోద్యోగులు కలిసి ఆమెను కాలువలోకి తోసేశారని తేలింది. వేధింపులు, హత్య, సాక్ష్యాలను ధ్వంసం చేయడం, ఇమ్మోరల్ ట్రాఫికింగ్ సహా పలు సెక్షన్ల కింద వీరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు 2023 జనవరి 30న తొలిసారి విచారణకు రాగా, మొత్తం 97 మందిలో 47 మంది సాక్ష్యులను సిట్ విచారించింది. 500 పేజుల ఛార్జిషీటును కోర్టుకు సమర్పించింది. ఎట్టకేలకు రెండేళ్ల విచారణ అనంతరం శుక్రవారం నాడు పుల్‌కిత్ ఆర్య, సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను అదనపు సెషన్స్ జడ్జి రీనా నెగి దోషులుగా ప్రకటించారు. ఈ ముగ్గురికీ జీవిత ఖైదు విధించారు. ముగ్గురు దోషులకు అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి రీనా నేగి రూ. 50,000 జరిమానా విధించారని ప్రాసిక్యూషన్ న్యాయవాది అజయ్ పంత్ తెలిపారు. కాగా, నిందితులకు ఉరిశిక్ష విధించాలని అంకిత తల్లి సోని దేవి మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలంతా తమ కుటుంబానికి మద్దతుగా నిలవాలని కోరారు.


SHRIRAM Finance | వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|
| 1 | TS24TA 2144 | EICHER PRO 3018 BS6 FBT | 2023 |
| 2 | TS24TA 2143 | EICHER PRO 3018 BS6 FBT | 2023 |
| 3 | TS27T 2279 | TATA LPT 1109 FBT | 2013 |
| 4 | TS24 7699 | SONALIKA DI 42 RX | 2017 |
| 5 | TS25T 1867 | AL U TRUCK 2518 FBT-T | 2018 |
| 6 | TS24T 7531 | APE XTRA LDX BS6 DIESEL | 2020 |
| 7 | TS24TA 2145 | EICHER PRO 3018 BS6 FBT | 2023 |
| 8 | TS03EB 6229 | BOLERO ZLX BS4 DIESEL 7 SEATER | 2015 |
| 9 | AP29TA 9447 | TATA LPT 3118 CUMMINS FBT | 2010 |


AUCTION DATE 31-05-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road, Cell : 9866244432 , 9700100937



# జనరల్
STATE & REGIONAL NEWS

## చట్టం చెప్పి నోటీసులివ్వాలి
హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెవెన్యూ ఆఫీసర్లు జ నానికి ఇచ్చే నోటీసుల్లో చట్ట నిబంధనను పేర్కొనాలని, చట్టాన్ని ప్రస్తావించినపుడే ఆ నోటీసు ఇచ్చే అధికారం అధికారికి ఉందో లే దో తేలుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా ఆల్వాల్ మండలంలో తోల్ల ఖార్కానాలోని 5.30 ఎకరాలకు సంబంధించి వివాదంపై తహసీల్దార్ ఇచ్చిన నోటీసులను సవాల్ చేసిన కేసులో జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల తీర్పు చెప్పారు. 2019లో తహసిల్దార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను బుజ్జి బానోత్ సహా 40 మంది సవాల్ చేశారు. ఈ వివాదాన్ని పరిష్కరించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. దీంతో తహసీల్దార్ 2019 జూన్‌లో ఆల్వాల్ తహసిల్దార్ తోళ్ల ఖార్కానా భూమి ప్రభుత్వానికి చెందినదని ప్రకటిస్తూ పిటిషనర్లకు నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులను సవాల్ చేసిన కేసులో హైకోర్టు తీర్పు చెప్పింది.

## చచ్చిన పార్టీకి ప్రాణం పోసేందుకే డ్రామా
కవితకు ధైర్యముంటే ప్రెస్ మీట్ పెట్టి చెప్పాలి
మెదక్ ఎం.పి, బిజెపి నేత రఘునందన్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని, దానికి ప్రాణం పోసేందుకు కల్వకుంట్ల ఫ్యామిలీ నాటకమాడుతోందని మెదక్ ఎంపి, బిజెపి నేత రఘునందన్ రావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదని గుర్తు చేశారు. కెటిఆర్, కవిత బిఆర్ఎస్ రీ బ్రాండింగ్ కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్‌లో కెటిఆర్, కవిత, హరీశ్ చెల్లని రూపాయలన్నారు. బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తనపైనా వ్యక్తిగతంగా బురద చల్లుతున్నారని అన్నారు. కవితపై పెయిడ్ ఆర్టికల్స్ రాయిస్తున్నది గుర్తించి బయటపెట్టాలని సిఎంను కోరుతున్నట్టు రఘునందన్ రావు అన్నారు. కెసిఆర్ కుటుంబం పదేండ్లు తెలంగాణను దోచుకున్నదని విమర్శించారు. ఒక సారి బిజెపిలో బిఆర్ఎస్ విలీనం చేసేందుకు చర్చలు జరిగాయని, మరోసారి కెసిఆర్ తమ నాయకుడని అంటున్నారన్నారు. బిజెపి ఎదుగుదలను అడ్డుకునేందుకే ఈ చెత్త పంచాయితీ ముందుకు తెచ్చారని ఆరోపించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం చేసేందుకు చర్చలు జరగలేదన్నారు. కవిత చిట్ చాట్‌లు కాకుండా ధైర్యం ఉంటే ప్రెస్‌మీట్లు పెట్టాలన్నారు. హరీశ్ రావు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హోదాలో తన కుమార్తె ఆస్పత్రిని ప్రారంభించారని, ఆ కార్యక్రమానికి మంత్రి తలసానితో పాటు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కూడా వచ్చారని తెలిపారు. బిఆర్ఎస్‌కు జనం గుండెల్లో స్థానం లేదని, జాగా కోసం అన్నా, చెల్లె కొట్లాడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ బలహీన పడాలనుకునే వాళ్లే కవిత వెనుక ఉన్నారన్నారు. కవిత పార్టీ పెడుతుందనే సమాచారం తనకు ఉందన్నారు. పక్క రాష్ట్రంలో ఉన్న పంచాయితే తెలంగాణ వరకూ వచ్చిందని పరోక్షంగా షర్మిలను ఉద్దేశించి అన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
రాజ్యసభ సభ్యుడు, బిజెపి నేత డాక్టర్ కె.లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆపరేషన్ సిందూర్ విషయంలో సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని రాజ్యసభ సభ్యుడు, బిజెపి డాక్టర్ కె.ల క్ష్మ ణ్ అన్నారు. నిరాధారమైన ఆరో పణలు చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో రాఫెల్ యుద్ధ విమానాలు కోల్పోయామని చెప్పడం రేవంత్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆర్మీ మనోభావాలను గాయపర్చడమే కాకుండా, దేశాన్ని అవమానించే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. మోదీపైన, బిజెపిపైన ఉన్న అక్కసును ఆర్మీ మీద, దేశం మీద వెల్లగక్కుతున్నారని మండిపడ్డారు. శత్రు దేశం పాకిస్తాన్‌కు అనుకూలంగా మాట్లాడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఉగ్రవాదా న్ని ప్రధాని నరేంద్ర మోదీ ఉక్కుపాదంతో అణిచివేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. భారత పౌరులంతా ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలని కోరారు.

**తలసరి ఆదాయంలో మొదటి స్థానానికి ఎలా చేరుకోవాలో**
## తెలంగాణ నుంచి నేర్చుకోవచ్చు : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తలసరి ఆదాయంలో 12వ స్థానం నుండి మొదటి స్థానానికి ఎలా ఎదగాలనే విషయాన్ని తెలంగాణ రాష్ట్రం నుంచి భారతదేశంలోని ఇతర రాష్ట్రాలు నేర్చుకోవచ్చని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలోపాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి, వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతో పాటు నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చిందని చెప్పారు. చైనాలోని త్రీ గార్జియస్ డ్యామ్ కు సరిసమానమైన ప్రాజెక్టు తెలంగాణలోని కాళేశ్వరం అని అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకం కాళేశ్వరంతో 80 మీటర్ల సముద్ర మట్టపు ఎత్తు నుంచి 600 మీటర్ల ఎత్తుకు నీళ్లను తీసుకునిపోయి, ప్రతీ సీజన్ కు 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని వివరించారు. తలసరి ఆదాయంలో 156 శాతం వృద్ధిని ఒక్క దశాబ్ద కాలంలోనే సాధించిన రాష్ట్రం దేశంలో ఒక తెలంగాణ మాత్రమేనని ,2014లో తలసరి ఆదాయంలో 12వ స్థానంలో ఉన్న తెలంగాణను, నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రగతిశీల విధానాలతో 2023 నాటికి నంబర్ వన్ స్థానానికి చేరుకున్నదని వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాల కారణంగానే గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ ,ఫేస్‌బుక్ తో పాటు ప్రపంచంలోని ప్రఖ్యాత టెక్ కంపెనీలు అమెరికా తర్వాత తమ అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాదులో నెలకొల్పాయని కెటిఆర్ తెలిపారు.



**3 నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం**
## 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ లిబర్టిలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) నిర్మించబడిన శ్రీవద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 3 నుంచి 7వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు టిటిడి సహాయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని దేవాలయంలో శుక్రవారం ప్రధాన దాత త్రివేంకట తిరునాథ్‌బాబు, ఆలయ అధికారులు ఆవిష్కరించారు. జూన్ 2వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, 3న ఉదయం ధ్వజారోహణం జరుగుతుందని తెలిపారు. అనంతరం శేష వాహనంపై శ్రీపద్మావతి గోదాదేవి నమేత శ్రీవారి ఊరేగింపు జరుగుతుందని, సాయంత్రం 8 గంటలకు శ్రీహనుమంతవాహనంపై శ్రీవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 4వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు, 10 గంటలకు స్నవన తిరుమంజనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, 5న గజ వాహనంపై శ్రీవారి ఊరేగింపు10 గంటలకు శాంతి కళ్యాణం, రాత్రి 8 గంటలకు గరుడవాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. 6వ తేదీ ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగింపు, 7న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, 9 గంటలకు ధ్వజవరోహణం జరుగుతాయని వారు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ దైవ కార్యక్రమాలను నిర్వ హిస్తున్నామని రమేష్ తెలిపారు.

# దేశంలోనే అగ్రగామిగా కోహెడ సమీకృత మార్కెట్

ప్రణాళికలను సిద్ధం చేయాలని
సిఎస్ ఆదేశం



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** దేశంలోనే అగ్రస్థానంలో ఉండే విధంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కోహెడ వద్ద నిర్మించేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం కోహెడ మార్కెట్ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించి దేశంలో ఒక రోల్ మోడల్ మార్కెట్‌ను నిర్మించాలని నిర్ణయించారని సిఎస్ ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సూమారు 250 ఎకరాల విస్తీర్ణంలో ఒక పెద్ద మార్కెట్‌ను నిర్మించాలని, ఆధునిక వసతులతో కూడిన నిర్మాణాలు, కోల్డ్ స్టోరేజ్‌లు, షెడ్లు, విశాలమైన రోడ్లు తదితర సౌకర్యాలతో మార్కెట్‌ను నిర్మించాలని సూచించారన్నారు. దేశంలోనే ఒక డ్రీమ్ ప్రాజెక్టుగా కోహెడ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో విస్తారంగా పండే పండ్లు, కూరగాయలు, ఇతర ఉత్పత్తులు, ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా ఈ మార్కెట్‌ను నిర్మించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మామిడి, బత్తాయి, పండ్ల తోటలు విరివిగా ఉంటాయిని, ఆ స్థాయిలో రైతులు, వినియోగదారులకు మార్కెటింగ్ సదుపాయం అందించాలని ముఖ్యమంత్రి అభిలశించారని, ఆ స్థాయిలో అధికారులు తగిన ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. కోహెడ మార్కెట్ ఏర్పాటుకు ప్రాజెక్టు వ్యయం సూమారు రూ.2890 కోట్లు అవసరమవుతుందని అధికారులు సిఎస్‌కు తెలిపారు. మౌలిక వసతులు, భూ సేకరణ, రోడ్ల నిర్మాణం, ఆధునిక షెడ్ల నిర్మాణం, సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం కోసం నిధులు కావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు సరిపడే విధంగా ఈ మార్కెట్‌ను నిర్మించాలని సిఎస్ తెలిపారు. సమావేశంలో వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ లక్ష్మీ బాయి, మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**అవతరణ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జూన్ 2న ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయిలో ఘనంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర కేంద్రంగా హైదరాబాద్‌తో పాటు 32 జిల్లాల్లో ఈ వేడుకలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. జిల్లాల్లో జెండాను ఆవిష్కరించనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో మంత్రులు,ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, సలహాదారులకు జిల్లాలకు బాధ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా జిల్లాల్లోని తెలంగాణ అమర వీరుల స్మారక స్థలాల వద్ద పూలమాలలు సమర్పించడంతో పాటు జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**జిల్లాల వారీగా పాల్గొనే ప్రతినిధులు:** అదిలాబాద్‌ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, భద్రాద్రి కొత్తగూడెం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హనుమకొండ జిల్లా మంత్రి కొండా సురేఖ, జగిత్యాల ప్రభుత్వ విప్ ఎ. లక్ష్మ ణ్ కుమార్, జయశంకర్ భూపాలపల్లి తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పోడెం వీరయ్య, జనగాం: ప్రభుత్వ విప్ బీర్ల ఇల్లయ్య, జోగులాంబ గద్వాల ప్రభుత్వ సలహాదారు( క్రీడలు)ఎపి జితేందర్ రెడ్డి, కామారెడ్డి పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, కరీంనగర్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఖమ్మం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, కుమరం బీమ్ , ఆసిఫాబాద్‌శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, మహబూబాబాద్ ప్రభుత్వ విప్ జె. రాంచందర్ నాయక్,మహబూనగర్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, మంచిర్యాల ప్రభుత్వ సలహాదారు( ప్రోటోకాల్) హరకరావెంకట్రావు, మెదక్ ప్రభుత్వ సలహాదారు( పబ్లిక్ అఫైర్స్) కె.కేశవ రావు,మెద్చల్: ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి, ములుగు జిల్లా మంత్రి ధనసరి అనసూయ సీతక్క, నాగర్‌కర్నూల్ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, నల్లగొండ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణపేట పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, నిర్మల్ తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ రాజయ్య సిరిసిల్లా , నిజామాబాద్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్ ఎరవత్రి, పెద్దపల్లి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద, రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రంగారెడ్డి సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సంగారెడ్డి మంత్రి దామోదర్ రాజనరసింహ, సిద్ధిపేట మంత్రి పొన్నం ప్రభాకర్, సూర్యాపేట మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వికారాబాద్ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వనపర్తి ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం, వరంగల్ జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.

# కేరళలో వర్షప్రళయం..

**కష్టాల 'సంద్రం'లో జనజీవనం**
8జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించిన ఐఎండి
ప్రజలు 5 రోజులు అప్రమత్తంగా ఉండాలి
కేరళ రెవెన్యూ శాఖ
మంత్రి కె.రాజన్ విజ్ఞప్తి

**తిరువనంతపురం / త్రిస్సూర్ :** కేరళలో శుక్రవారం నిరవధికంగా కురుస్తున్న భారీ రుతుపవన వర్షాలు సామాన్య జనజీవనానికి ఆటంకంగా మారింది.ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఎనిమిది జిల్లాలలో రెడ్ అలర్ట్ ప్రకటించింది. పథనంథిట్ట, అలప్పుజా, కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిస్సూర్, కన్నూర్, కాసర్‌గోడ్ జిల్లాలలో ఐఎండి రెడ్ అలర్ట్ ప్రకటించగా, మిగతా ఆరు జిల్లాలలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అయితే ఇప్పటికే ప్రకటించబడిన ఆరెంజ్ అలర్ట్ నుంచి తిరువనంతపురం, కొల్లాం జిల్లాలను శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెడ్ అలర్ట్ కిందకు మార్చారు. భారత వాతావరణ శాఖ ప్రకటించిన ప్రకారం...రాగల 24గంటల్లో 20సెం.మీ.కు పైగా తీవ్రస్థాయి భారీ వర్షం నమోదు అయితే రెడ్ అలర్ట్ కిందకు వస్తుంది. అదే సమయంలో ఆరెంజ్ అలర్ట్ అంటే 11సెం.మీ.నుంచి 20సెం.మీ. వర్షపాతం నమోదును పరిగణనలోకి తీసుకుంటారు. ఇక 6సెం.మీ.నుంచి 11సెం.మీ మేరకు వర్షాపాతం నమోదు అయితే యెల్లో అలర్ట్ కింద ఐఎండి పరిగణిస్తుంది. భారీ వర్షాల మూలంగా రాష్ట్రంలో భారీ నష్టం సంభవించే అవకాశాలు ఉందని, ప్రజలు తగిన జాగ్రత్త వహించాలని కేరళ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కె.రాజన్ తెలియజేశారు. త్రిస్సూర్‌లో ఆయన ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో రానున్న 5 రోజులపాటు పశ్చిమ గాలులు వీస్తాయని, విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని మంత్రి కె.రాజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాబోయే 5 రోజులు ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగాఉంటే చాలు ఎలాంటి పెను సంక్షోభం నుంచి అయినా బయటపడగలుగుతామని చెప్పారు. ప్రజలు అనవసరమైన ప్రయాణాలు మానుకోవాలని, ముఖ్యంగా ప్రమాదకర ప్రదేశాలలో నివసించే కొండ ప్రాంత ప్రజలు ఈ జాగ్రత్తలు పాటించాలని, వ్రారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లడం లేదా పునరావాస శిబిరాలలో తలదాచుకోవడం మంచిదని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 66 పునరావాస శిబిరాలలో అక్కడ నివసిస్తున్న 1,894మంది ప్రజలు తలదాచుకుంటున్నారని రెవెన్యూ శాఖ మంత్రి రాజన్ తెలియజేశారు. దాదాపు ఆరు లక్షల మంది ప్రజలు తలదాచుకునేందుకు సుమారు 40,000 శిబిరాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రజలు అక్కడకు తరలివెళ్లేందుకు విముఖత చూపొద్దని ఆయన కోరారు.



రుతపవనాల రాకతో కురిసిన భారీ వర్షాల కారణంగా వందలాది ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతిన్నాయని కూడా మంత్రి చెప్పారు. మే 30నుండి జూన్ 5వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ అంచనా వేసిందని మంత్రి రాజన్ తెలిపారు. కాగా పథనంథిట్ట జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేసిన ఒక ప్రకటనలో దాదాపు 200ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలియజేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కెఎస్ఇబి ఆధ్వర్యంలోని హైటెన్షన్, లోటెన్షన్ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు చాలా పెద్దమొత్తంలో నష్టం వాటిల్లిందని వెల్లడించింది.

**రూ.2350 కోట్ల వార్షిక రుణ ప్రణాళికకు**
## స్త్రీ నిధి సమావేశం ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధి పథకాలు, పిఎంఎఫ్ఎంఇ, హౌజింగ్ ఫైనాన్సింగ్, ఎఫ్‌పిఒ, క్యాంటీన్లు, వాతావరణం, చిన్నతరహా పరిశ్రమలు, డెయిరీ, పౌల్ట్రీ వంటి తదితర కార్యక్రమాల నిమ్మితం 202526 ఆర్థిక సంవత్సరానికి రూ..2350 కోట్ల వార్షిక రుణ ప్రణాళికకు 'స్త్రీ నిధి। 46వ ఎంసి (మ్యానేజ్‌మెంట్ కమిటీ) సమావేశం ఆమోదించింది. ఆరోగ్య బీమా, జీవిత బీమా, ప్రమద బీమా వంటి సిబ్బంది సంక్షేమ పథకాలను అమలు చేయాలని నిర్ణయించింది. 'స్త్రీ నిధి। 46వ ఎంసి (మ్యానేజ్‌మెంట్ కమిటీ) సమావేశం హైదరాబాద్‌లోని స్త్రీ నిధి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిబ్బంది నియామక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి సీతక్క హామీనిచ్చారు. ఎస్‌హెచ్‌జి సభ్యులకు సోలార్ యూనిట్ల రుణాలపైన నాలుగు శాతం వడ్డీని సబ్సీడీ ఇవ్వాలనే అంశాన్ని పరిశీలించి, ప్రభుత్వ వాటాల డివిడెండ్‌లో నుంచి ఆ నిధులను మంజూరు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే 22 జిల్లాల్లో మహిళా శక్తి పథకం కింద జెడ్ఎస్ భవనాల నిర్మాణానికి ఇప్పటికే ఆమోదించిన 20 కోట్లతో పాటు, అదనంగా రెండు కోట్ల రూపాయాలను ఇవ్వాలని, తెలంగాణ ఫైబర్ గిడ్ కార్పొరేషన్ కనెక్షన్ పొందిన 3000 యూనిట్ల స్థానిక కేబుల్ ఆపరేటర్లకు రుణం అందించాలని, ఆదిలాబాద్, కొమురం భీమ్ జిల్లాల్లో 45 గ్రామాల్లో విద్యా ప్రచారం కోసం రూ 22.5 లక్షలు కేటాయించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 34 ఎన్‌హెచ్‌సిల మరమ్మతులు, 40 కొత్త ఎన్‌హెచ్‌సి భవనాల నిర్మాణానికి రూ 4.68 కోట్లను మంజూరు చేయనున్నారు. కాగా 202526 ఆర్థిక సంవత్సరానికి చెందిన వార్షిక వ్యయ బడ్జెట్ రూ 43.61 కోట్లను సమావేశం ఆమోదించింది.

## వెల్ఫేర్ బోర్డు నిధుల మళ్ళింపు




**జైపూర్ :** వెల్ఫేర్ బోర్డు నిధులను కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాలకు మళ్లించి భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని భవన, ఇతర నిర్మాణ కార్మికుల సమాఖ్య జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్ అన్నారు. జైపూర్‌లో జరుగుతున్న ఏఐటియుసి జనరల్ కౌన్సిల్‌లో భవన నిర్మాణ కార్మికుల కార్యకలాపాలను వివరించారు. భవన నిర్మాణ కార్మిక ఉద్యమాన్ని పటిష్టం చేసే ప్రయత్నం చేస్తున్నామని,ఇప్పటికే పద్దెనిమిది రాష్ట్రాల్లో సంఘాలు ఏర్పడ్డాయని, త్వరలో మరో ఐదారు రాష్ట్రాల్లో సంఘాలు ఏర్పడనున్నాయని తెలిపారు. వెల్ఫేర్ సెస్సును రెండు శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం సాగిస్తున్నామన్నారు.దీనిపై పోరాటం సాగించాలని కోరారు.

# రాయికల్ టోల్ గేట్ వద్ద
# రూ.3కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

-శంషాబాద్ ఎస్ఒటి,షాద్ నగర్ పోలీసులు
సంయుక్తంగా డ్రగ్ పెడ్లర్ అరెస్టు
అభినందించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి






**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరోసారి డ్రగ్స్ భారీగా పట్టుబడింది.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎస్ఒటి,షాద్ నగర్ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్44)పై ఉన్న రాయికల్ టోల్ గేట్ వద్ద డ్రగ్ పెడ్లర్ అరెస్టు చేసిన ట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడించారు. శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయికల్ టోల్ గేట్ వద్ద సంజుభాయ్ మార్వాడి దాబాలో డ్రగ్స్ విక్రయిస్తున్నారన్న పక్క సమాచారంతో శంషాబాద్ ఎస్ ఒటి,షాద్ నగర్ పోలీసులు నిఘాపెట్టారు. ఈ నేపథ్యంలో గురువారం గంజాయి విక్రయిస్తుండగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ షా,సంజూ భాయ్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి సుమారు రూ.3 కోట్ల విలువ చేసే 632 ఓపిఎం,1 కెజి గంజాయి,1.5 కెజి హెరైన్, 2.8 కెజి పప్పి స్ట్రా డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్నారు.రాయికల్ టోల్ ప్లాజా వద్ద గల దాబా హోటల్ యజమాని గత ఏప్రిల్ నెలలో మృతి చెందాడు.దీంతో ఆ హోటల్ ను వికాస్ షా,సంజూ భాయ్ లు నడుపుతున్నారు.ఈ హోటల్ లో పనిచేసే వంట మనిషి వికాస్ సాహూ రాజస్థాన్ నుంచి బస్సులో డ్రగ్స్ తీసుకువచ్చి అతని సోదరుడి సహాయంతో దాబాకు వచ్చే తెలిసిన కస్టమర్స్ కు డ్రగ్స్ విక్రయిస్తున్నారు.ఈ డ్రగ్స్ ముఠా లో సభ్యులుగా ఉన్న ధూల్ పేట్ కు చెందిన సలీం, మహేశ్వరం కు చెందిన రాజు, మధ్యప్రదేశ్ కు చెందిన గన్పథ్ పరారీలో ఉన్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు.నిందితుల నుండి హెరాయిన్ తోపాటు గంజాయి,ఒపిఎం డ్రగ్స్ సీజ్ చేశారు.ఒక్క గ్రాము ఒపిఎం విలువ సుమారు రూ.15వేల విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా హెరైన్ ని పప్పీలో కలిపి అమ్ముతున్నట్లు పోలీస్ లు గుర్తించారు.కెజి హెరైన్ రూ.2 కోట్ల విలువ ఉంటుందని తెలిపారు. మొత్తం పట్టుబడ్డ డ్రగ్స్ సుమారు రూ.3.5కోట్లు విలువ ఉంటుందని సిపి అవినాష్ మహంతి చెప్పారు.నిందితుల వద్ద నుంచి రూ.89,700 నగదు,రూ.30 వేల విలువైన మూడు మొబైల్ ఫోన్స్,వేయింగ్‌మెషిన్,ప్యాకింగ్ కవర్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.నిందితులు ఎవరెవరికి డ్రగ్స్ సరఫరా చేశారు.సబ్ పెడ్లర్లు ఎవరున్నారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. నిందితుల ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీస్ లు వారి కాంటాక్ట్ ఆధారంగా కస్టమర్స్ పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. నిందితులు వికాస్‌షా,సంజూ భాయ్ లు 2022లో డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయ్యారని,గతంలోనూ వీరిపై కేసులు ఉన్నట్లు సిపి అవినాష్ మహంతి స్పష్టం చేశారు.భారీ ఎత్తున డ్రగ్స్ ను పట్టుకున్న పోలీసులను,అధికారులను సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి అభినందించారు.

**హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ పట్టివేత..**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రామంతాపూర్ మాధురి రెస్టారెంట్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ టీం అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 10 ఎల్ఎస్‌డి బ్లాస్ట్ (డ్రగ్స్)ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌టిఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.దీపక్, కెవిన్, మహ్మద్ సాజిద్‌లు కొంత కాలంగా డ్రగ్స్ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే రామంతాపూర్‌లో శుక్రవారం డ్రగ్స్ విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ పో లీసులు పట్టుకున్నారు. మరో సంఘటనలో సరూర్‌నగర్‌లో గంజాయిని విక్రయిస్తున్న పవన్, ప్రసన్నకుమార్, ఎం.శ్రీకర్‌లను అరెస్టు చేసి వారి నుంచి 1.1 కిలోల గంజాయిని ఎస్‌టిఎఫ్ సిటీ సి టీమ్ సిఐ వెంకటేశ్వర్లు పట్టుకున్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** అర్హులైన పేదల అందరికీ ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం కోరారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ మహాసభ కూరెళ్ళ మచ్చగిరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకే మంజూరు చేయాలన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చెయ్యాల ని, చేయని యెడల భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.అ నంతరం సీపీఐ గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సుదగాని పృథ్వీరాజ్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ అంజద్‌లతో పాటు 10 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. రైతు సంఘం మండల నాయకులు బొక్క దయాకర్ రెడ్డి, ఎండి నయుం, కాటం శ్రీశైలం, మారుపాక మచ్చగిరి, ఎండి తాహెర్ పాషా, మచ్చ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు సిపిఐ మండల కార్యదర్శిగా చాపల శ్రీను

**ప్రజాపక్షం/మునుగోడు:** సిపిఐ మండల నూతన కార్యవర్గాన్ని సిపిఐ 15 మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మునుగోడు మండల కేంద్రానికి చెందిన చాపల శ్రీను ఆయనతోపాటు 13 మందితో కూడిన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా ఎన్నికైన చాపల శ్రీను మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడ తానని పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నా నియామకానికి సహకరించిన సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యవర్గానికి, మండల కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.





## కార్యకర్తలకు అండగా ప్రభుత్వం

మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పార్టీ గెలుపుకోసం కష్టపడిన కార్యకర్తలందరికీ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలల్లో, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖా మాత్యులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమఫలాలు,వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ప్రధానకార్యదర్శిగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గెల్లి అర్చన భర్త గెల్లి రవిని నియమిస్తూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా లో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను గురించి తెలియజేస్తూ, పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గెల్లి రవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించిన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో బీఎల్ఆర్ బ్రదర్స్, ఎన్‌వీఆర్ యూత్ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్స్, యూనిఫాం, అల్పాహారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్‌కు అలవాటు పడి శారీరక ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఇలాంటి సమ్మర్ క్యాంపులను ఉపయోగించుకోని శారీరక ఫిట్నెస్‌ను సాధించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఫౌండేషన్ ముఖ్యులు ఆడోతు అశోక్‌నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, రుణాల్‌రెడ్డి, వెంకన్న, కొమ్ము శ్రీను, నాయకులు జానకిరాంరెడ్డి, నాగునాయక్, లక్ష్మ ణ్, శరత్, నాగరాజు, అశోక్, మనోహర్ పాల్గొన్నారు.

## త్వరితగతిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ

కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/వలిగొండ :** ధాన్యం కొనుగోలు మిగిలి ఉన్న కేంద్రాల్లో త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం వలిగొండ మండలంలోని గోకారం ఐకెపి కేంద్రం, సంగెం గ్రామాలలో ఐకెపి, పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి కొనుగోలు కేంద్రాలలో మిగిలి ఉన్న ధాన్యాన్ని వేగంగా పూర్తి చేయాలని కేంద్రం నిర్వాహకులకు ఆదేశించారు. కొనుగులో చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, రైతుల వివరాలు పెండింగ్ లేకుండా ట్యాబ్ ఎంట్రీలు చేసి రైతులకు ఖాతాలో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన 48 గంటలలోపే ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డిఎం సివిల్ సప్లై హరి కృష్ణ, ఇంచార్జ్ పౌర సరఫరాల అధికారి రోజా రాణి, సంబంధిత అధికారులు, కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## నాణ్యత తగ్గించి వస్తువులను దొంగిలించి...

అధికారుల పర్యవేక్షణ లోపించిన : సిపిఐ

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రసాదాల తయారీలో నాణ్యతను తగ్గించి మిగిలిన వస్తువులను దొంగిలించి వాటిని బ్లాక్ మార్కెట్లో సొమ్ము చేసుకునేందుకు అమ్మేస్తున్నట్లు అనుమానాలు బలపడుతున్నాయని సీపీఐ మండల కార్యదర్శి కలపల్లి మహేందర్, జిల్లా సమితి సభ్యులు శ్రీధర్ ఆరోపించారు. యాదగిరిగుట్ట పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో బుధవారం జరిగిన చింతపండు దొంగతనం దుర్మార్గమన్నారు. జీతాలు అందక దొంగతనం చేస్తారని సురక్ష సిబ్బంది చెప్పడం వాస్తవం కాదన్నారు. ఈ దొంగతనంలో ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షణ లోపం స్పష్టమవుతోంన్నారు. దొంగతనం కంటే ముందు కారు కొండపైకి ఎలా వచ్చింది ఎప్పుడు వచ్చింది విచారించకుండా పెట్రోల్ పెట్రోలింగ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఎస్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమయ్యారన్నారు. రాత్రివేళ స్టాక్ గోదాముల వద్ద భద్రత ఎందుకు లేదన్నారు. దేవాదాయ కమిషనర్‌తో సమగ్ర విచారణ జరిపాలన్నారు. రాజులపై చట్టపరమైన తీసుకోకుంటే సిపిఐ ఆధ్వర్యంలో హెచ్చరించారు. సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మాటూరి మల్లయ్య, అరె పుష్ప, మునుగుంట్ల నరసమ్మ పాల్గొన్నారు.



# బక్రీద్ పండుగకు పటిష్ఠ భద్రత

బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/యాదాద్రి :** జూన్ 7 పవిత్ర బక్రీద్ పండుగ ఉన్నందున ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టరు హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ మీటింగ్ హాలులో బక్రీద్ పండుగ పురస్కరించుకొని శాంతి సంఘ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ముందుగా మత పెద్దలు చేసిన సూచనలు, సలహాలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. నమాజ్ వేళలో కరెంటు ఉండేలా చూడాలన్నారు. కరెంట్, మంచినీరు వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద పరిష్టమైన పారిశద్య చర్యలు చేపట్టాలని, చెత్త బండ్లు అందుబాటులో ఉంచాలని, చెడు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటింటికి వేస్టేజ్ కవర్లు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచినీరు సౌకర్యం కల్పించాలని, వీధి దీపాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ముఖ్యంగా ప్రార్థనా సమయాలలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. వార్డులలో మంచినీరు సమయానికి వచ్చేలా చూడాలన్నారు. మంచి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశువైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అందుబాటులో ఉండాలని ఫిర్యాదులు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్యలు పరిష్కరించాలన్నారు. చెక్ పోస్టల వద్ద రెవెన్యూ పోలీస్ వెటర్నరీ అధికారులు నిరంతరం నిగా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఎలాంటి అవాంఛనీ య సంఘటన జరగకుండా, సోదర భావంతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగకు జరుపుకోవాలని తెలిపారు. డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ పవిత్ర బక్రీద్ పండుగ ఉన్నందున మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని, బక్రీద్ పండుగ రోజులలో పూర్తి బందోబస్తు ఉంటుందని, ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహిస్తామని, సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తామని అందరి సహకారంతో సామరస్య వాతావరణంలో బక్రీద్ పండగను నిర్వహించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఏసిపి లక్ష్మీ నారాయణ, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డిపిఓ సునంద, జిల్లా పశు వైద్య శాఖ అధికారి యాదయ్య, మత పెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ఆర్మడ్ రిజర్వు సిబ్బందికి ఏర్పాటు చేసిన దర్బార్ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి పాల్గొని మాట్లాడుతూ సాయుధ సిబ్బంది విధినిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు,సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, వినతులను అడిగి తెలుసుకునీ సమస్యలను వెంటనె పరిష్కరించే విధముగా కృషిచేస్తాను అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ లో సాయుధ దళ పోలీస్ పాత్ర కీలకం అని, జిల్లా లో సాయుధ దళ పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మర్డ్ రిజర్వు డిఎస్‌పి శ్రీనివాసులు,ఏ ఓ శ్రీనివాసులు, ఆర్ ఐలు సంతోష్, సూరప్ప నాయుడు, శ్రీనివాస్, హరిబాబు, ఆర్ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మత ఘర్షణలు రెచ్చగొడితే కఠిన చర్యలు**

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోదర భావంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మత పెద్దలతో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో జిల్లా ఎస్‌పిపాల్గొని మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పండగ పర్వదినాన్ని శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ శాంతి సంఘ సమావేశంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు, ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య ఎస్ఐ లు గోపాల్ రావు, శంకర్, జయకర్, వివిధ కులాల మత పెద్దలు హాఫీస్ ఖాన్, గోలి మధుసూదన్ రెడ్డి, హాశం, అహ్మద్ కలీం, బండారు ప్రసాద్, క్రిస్టోఫర్, శౌరయ్య, ఎలిజల నరసింహ, కౌన్సిలర్లు సమద్, బషీర్, అమీర్, అభిమన్యు శ్రీను, బాబా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## తడిసి ముద్దైన నల్లగొండ

భారీ వర్షంతో ప్రజల ఇబ్బందులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పగలంతా పెరిగిన ఉష్ణోగ్రత సాయంత్రం కల్లా వాతావరణంలో ఒకేసారి మార్పులతో అంతా చల్లబడింది.అంతలోనే భారీ వర్షం కురిసి నల్లగొండ తడిసి ముద్దయింది.పట్టణంలో కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పడం మూలాన గత నాలుగు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి జల్లుల వర్షం కురిసింది. అయితే శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణంలోని కూరగాయల మార్కెట్ లోకి వరద నీరు చేరడంతో కూరగాయలు, పండ్ల నీళ్లలో కొట్టుకుపోయాయి.దీనితో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా పాతబస్తీ,ప్రకాశం బజార్,రామగిరి,గొల్లగూడ తదితర లోతట్టు ప్రాంతంలో వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.







## యాదాద్రి జిల్లాలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆరో తేదీన జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయనున్నట్లు సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు తెలిపారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని మూసీ ప్రక్షాళనకు నిధులు కేటాయించిన పనులు ప్రారంభించలేదన్నారు. భువనగిరి నుండి అడ్డగూడూరు వరకు సాగునీటి కోసం చేపట్టిన బునాది కాలువ పనులను వెంటనే పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలన్నారు. గంధమల్ల ద్వారా సాగునీటి కోసం 1984లో ఓర్టూరు నుండి గంధమల్ల వరకు పాదయాత్ర చేపట్టామని ఆ పోరాట ఫలితమే ఇప్పుడు మోక్షం లభించిందని అన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం లో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు.యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి కోసం కమిటీని ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలన్నారు. కొండ కింద ఉన్న ఘాటు రోడ్డుని తొలగించి వ్యాపారులు వ్యాపార నిర్వహించుకునేలా చూడాలన్నారు.జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీ ఏర్పాటు ఏ ప్రాంతంలో జరుగుతుందో స్పష్టత ఇవ్వాలన్నారు. వెంచర్ల ఏర్పాటు కోసం సాగు భూములను ఇవ్వవద్దని, ఈ ప్రాంతంలో భూముల విలువలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## బైపాస్‌పై ఫ్లైఓవర్ నిర్మించాలని ధర్నా



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ కట్టకొమ్ముగూడెం గ్రామాల మధ్య బైపాస్ రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కట్టకొమ్ముగూడెం, ఆర్లగూడెం, నర్సింహాపురం, ఉత్తమ్ పద్మవతి కాలనీలకు చెందిన ప్రజలు బైపాస్ రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాలతో వందలాది మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ పట్టణానికి నిత్యం వేలాది మంది విద్య, వైద్య, ఉపాధితో పాటు ఇతర పనుల కోసం ఆయా గ్రామాల నుండి వచ్చి వెళ్లడం జరుగుతుందన్నారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుండి బయలుదేరిన వ్యక్తి ఈ రోడ్డు దాటి ఇంటికి వచ్చే వరకు ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయిందని కంటతడి పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో బైపాస్‌పై ఫ్లై ఓవర్ నిర్మించాలని అనేక మార్లు ఆందోళన చేసిన ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. స్థానిక శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మవతి చొరవ చూపి బైపాస్ రోడ్డుపై ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. బైపాస్‌పై ప్రజలు ఆందోళన చేయడంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. పట్టణ సిఐ శివశంకర్ అక్కడికి చేరుకొని ప్రజలతో మాట్లాడి ధర్నాను విరమింప చేశారు.

## సాగర్లో వికసించిన అరుదైన 'మే' పుష్పం

**ప్రజాపక్షం/నందికొండ:** మే నెలలో మాత్రమే వికసించే పుష్పం సాగర్‌లో కనువిందు చేస్తోంది. పుట్ బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అని పిలువబడే ఈ పుష్పం చూడ్డానికి ఎర్రని బంతిలా, వింతగా ఉండి చూపరులను ఇట్టే ఆకట్టుకొనేలా ఉంటుంది. స్థానిక హిల్ కాలనీకి చెందిన కశుభ సదా శివ రామకృష్ణ, సుధారాణి దంపతులు రెండు సంవత్సరాల క్రితం తమ ఇంట్లో మే పుష్పం మొక్కను నాటగా అది ప్రతి సంవత్సరం మే రెండవ వారంలో వికసించేదని కానీ ఈ ఏడాది ఎండలు ముందుగానే ఎక్కువగా ఉండటంతో ఇది మే నాల్గవ వారంలో వికసించిదని వారు తెలిపారు . ఇవి మే నెలలో పూసి జూన్ వరకు ఉండి ఎండిపోతాయి. మే నెలలో నే పూస్తుంది కనుక దీనిని మే పుష్పం అంటారు. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప రకం మొక్క.అరుదుగా పుష్పించే ఈ మొక్కను చుట్టుపక్కల వారు వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు.



## నక్సలైట్లను కాల్చివేతను ఆపివేయాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రవణ్ కుమార్



**ప్రజాపక్షం/నల్లగొండ (నకిరేకల్):** కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను కాల్చివేతను ఆపివేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. సిపిఐ నకిరేకల్ 7వ మండల మహాసభ విద్యాసాగర్ అధ్యక్షతన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగింది. ఈమహాస భకు శ్రవణ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడతూ నరేంద్రమోడి ప్రభుత్వం 2026 మార్చినాటికి మావోయిస్టులకు హంతం చేస్తామని ప్రకటించడం దేశ పౌరులనే హత్య చేయడమేనని పేర్కొన్నారు. కేంద్రప్రభుతం సేవాధర్మ పేరుతో ప్రజ మధ్య విద్వేశాలు పెరుగుతున్నాయిని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ పెటుబడిదారుకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి గౌని లక్ష్మి నర్సయ్య, జాజాల జంగయ్య, లక్ష్మారెడ్డి, దేశ బోయిన భద్రయ్య శ్రీను పాల్గొన్నారు.

**మండల కార్యదర్శిగా లక్ష్మీ నరసయ్య ఎన్నిక :** నకిరేకల్ మండల కార్యదర్శి గౌని లక్ష్మి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా పి. విద్యాసాగర్ తో పాటు 7మందితో మండల సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రూ.2లక్షల నకిలీ ఇంజన్ ఆయిల్ పట్టివేత

ఒకరి అరెస్టు

జిల్లా ఎస్‌పి కె నర్సింహ్మా వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా సిసిఎస్, కోదాడ రూరల్ పోలీసులు రూ. 2లక్షల విలువైన నకిలీ ఇంజన్ ఆయిల్‌ను పట్టుకొని ఒకరిని అరెస్టు చేశారు. అలాగే 14లక్షల విలువైన టోయోట కారును కూడా సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా ఎస్‌పి కె నర్సింహ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం జిల్లా సిసిఎస్ సిఐ శివ కుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌ల ఆధ్వర్యంలో రామాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న నకిలీ ఇంజన్ ఆయిల్‌ను పట్టుకొని సీజ్ చేశారు. దీని విలువ రూ. 2లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే 14లక్షల టయోట కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నకిలీ ఆయిల్‌ను తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన కాకాని నాగ వెంకటేశ్వర్ రావును అదుపులో తీసుకున్నారు. విజయవాడలోని పాలిటెక్నిక్ అండ్ ఇన్ మేకానికల్ ఇంజనీరింగ్ చదువుకున్న అతను 1998 నుండి లూబ్రికేట్స్ ఇంజన్ ఆయిల్ కంపెనీలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. ఇంజన్ ఆయిల్ తయారిలో అనుభం ఉన్న ఆయన సులువుగా డబ్బులు సంపాదించాలని నకిలీ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేసి పేరున్న కంపెనీల స్టిక్కర్లు వేసి గత కొంత కాలంగా అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిపారు. షాపుల వారికి అమ్మితే గుర్తు పడుతారని బైక్ మెకానిక్‌లకు తాను తయారు చేసిన ఇంజన్ ఆయిల్ తక్కువ ధరలకు అమ్మకాలు జరుపుతున్నాడు. కలకత్తా నుండి క్యాస్ట్రాల్, ప్రో హోండా, హీరో, సర్వో, బజాజ్, డిడిటిఎస్ మొదలకు ప్లాస్టిక్ స్టిక్కర్లు, లెబుల్‌లను తెప్పించి విజయవాడలో మడ్డి ఆయిల్ ఫిల్టర్ చేసే వారి నుండి ఆయిల్ కొనుగోలు చేసి తమ ఇంటి వద్ద డబ్బాల్లో నింపి అమ్మకాలు జరుపుతున్నాడు. లీటర్ రూ. 200ల చొప్పున అమ్ముతు మోసాలకు పాల్పడుతున్నాడు. 2007,9 లో ఇలా వ్యాపారం చేస్తూ పోలీసులకు పట్టుపడ్డాడు. విజయవాడ పో లీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కావడంతో జైలు జీవితం గడిపాడు. ఆ తరువాత అగ్రిగోల్డ్ సంస్థలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తుండగా అతికూడా మూసివేయడంతో తిరిగి నకిలీ ఆయిల్ వ్యాపారా న్ని మొదలు పెట్టాడు. రూ. 80తో నకిలీ ఆయిల్ కొనుగోలు చేసి రూ. 200లకు అమ్ముతున్నాడు. సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల, మిర్యాలగూడ బైక్ మోకానిక్‌లకు పెద్ద ఎత్తున అమ్మకాలు తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరస్తుడిని పట్టుకున్న సిసిఎస్ సిఐ శివ కుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డిని ఆయన అభినందించాడు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న, కోదాడ టౌన్ సిఐ రజితారెడ్డి పాల్గొన్నారు.

## మందకృష్ణకు ఘన స్వాగతం పలకాలి



ప్రజాపక్షం/బిజినేపల్లి : సామాజిక ఉద్యమాలనేత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పద్మశ్రీ అవార్డును తీసుకున్న సందర్భంగా నేడు వరంగల్ నగరానికి చేరుకుంటున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ శ్రేణులంతా పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు ఈనెల 31న వరంగల్ నగరానికి రావాల్సిందిగా జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కరిగిల్ల దశరథం శుక్రవారం మండల కేంద్రంలో పిలుపునిచ్చారు.

## మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజాపక్షం/వనపర్తి : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జీ మంత్రి అయిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మే 31న వనపర్తి జిల్లా సందర్శించి జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షతో పాటు వనపర్తి పట్టణంలో టిబి వైద్య కేంద్రాన్ని, మెడికల్ కళాశాల పక్కన నిర్మించిన సెంట్రల్ మెడికల్ స్టోర్ భవనం, ఆర్‌బిఎస్‌కెకు సంబంధించిన బాల స్వాస్థ కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారు. ఇంచార్జీ మంత్రి పర్యటనకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సాయినాథ్ రెడ్డి, డా. రామచంద్రరావు, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి



ప్రజాపక్షం/బిజినేపల్లి : సకాలంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని మండల వ్యవసాయ అధికారి నీతిరెడ్డి అన్నారు. మండలంలోని కారుకొండ గ్రామంలో రైతువేదికలో శుక్రవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా రైతులు సకాలంలో శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారుల సలహాలు తప్పకుండా పాటించాలని ఆమె కోరారు. రైతన్నలు ఆరు అంశాలని సాగులో తప్పకుండా పాటించి మంచి నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు పొందాలన్నారు. రశీదులు భద్రపర్చుకోవడం పంటమార్పిడి పద్దతి పాటించడం నీటి యాజమాన్య పద్ధతులు ఇతర అంశాలపై రైతన్నలకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కిశోర్, వ్యవసాయశాఖ సిబ్బంది పార్వతి, అభిలాష్‌రెడ్డి, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిని కాపాడుకుందాం



ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలంలోని పంజుగుల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యని పెంచుకొని మన ఊరిబడిని మనమే కాపాడుకుందామని అనే నినాదంతో గ్రామంలోని గ్రామపంచాయతీవద్ద గ్రామపెద్దలు , యువకులతో కలిసి పాఠశాల ఉపాధ్యాయులు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో సంఖ్యను పెంచకపోతే ఇక్కడున్నటువంటి ఉపాధ్యాయులను వేరేప్రాంతాలకు బదిలీ చేయడంతోపాటు పాఠశాలను కూడా వేరే పాఠశాలకు బదిలీ చేస్తారని గ్రామంలోని తల్లిదండ్రులు వారి పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మీ ఊరి పాఠశాలను మీరే కాపాడుకోవాలనే నినాదంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామపెద్దలను ఉపాధ్యాయ బృందం అభ్యర్థించడం జరిగింది. గ్రామపెద్దల నుంచి పాఠశాల అభివృద్ధి కొరకు సలహాలు సూచనలు తీసుకోవడంతోపాటు ఉపాధ్యాయులుగా తమనుండి ఇంకా మెరుగైన విద్యని నాణ్యమైన విద్యని బోధిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామపెద్దలకు ఉపాధ్యాయులు హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్యగౌడ్, తెలంగాణజాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోనిగణేష్, గ్రామకార్యదర్శి గుత్తికృష్ణ, గ్రామపెద్దలు లక్ష్మయ్య, పోలేశ్రీశైలం, ప్రభాకర్, అశోక్, ఉపాధ్యాయులు రామేశ్వరయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## మండలంలో రెవెన్యూ సదస్సులు

ప్రజాపక్షం/శ్రీరంగాపురం : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ భూ భారతి చట్టం మండలంలో వచ్చే నెల మూడవ తేదీ నుండి ప్రతి గ్రామంలో ప్రారంభమవుతుందని తహసీల్దార్ రాజు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజు మాట్లాడుతూ వచ్చే నెల మూడో తేదీ నుండి 20వ తేదీ వరకు విడతల వారిగా అన్ని గ్రామాలలో భూ భారతి సదస్సును నిర్వహిస్తామని ఆయన అన్నారు. మొదటిగా 3వ తేదీ వెంకటపూర్ గ్రామంలో, 5వ తేదీ రోజు నాగసానిపల్లి గ్రామంలో, 6వ తేదీ రోజు శేరుపల్లి, 9,10వ తేదీలలో తాటిపాముల, 11,12వ తేదీలో నాగరాల రెండవ మూడవ సెంటర్, 17,18వ తేదీలలో శ్రీ రంగాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులకు అందుబాటులో ఉండే సమస్యలను పర్కిరించుకోవాలని తహసీల్దార్ రాజు కోరారు.

## పోచమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుకు రూ.65 వేల విరాళం



ప్రజాపక్షం/నారాయణపేట్: నారాయణపేట నియోజకవర్గం కోయిలకొండ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ఏర్పాటుకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్‌రెడ్డి రూ.65 వేల చెక్కును దేవాలయ నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. జూన్ 2వ తేదీ సోమవారం దేవాలయంలో పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ ఉంటుందని ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాజ్‌కుమార్‌రెడ్డిని ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించడం జరిగిందని నిర్వాహకులు హన్మిరెడ్డి తెలిపారు. అడిగిన వెంటనే కాదనకుండా పోచమ్మ తల్లి విగ్రహానికి అయ్యే మొత్తాన్ని రాజ్ కుమార్‌రెడ్డి అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎంపికి ఆహ్వానం



ప్రజాపక్షం/మాగనూర్: మాగనూర్ మండల పరిధిలోని తాళంకేరి గ్రామంలో ఈ నెల 31వ తేదీ 12వ తేదీన మూడురోజుల పాటు నిర్వహించే ఆంజనేయ స్వామి, శివలింగం, నంది, నవగ్రహ విగ్రహాల ప్రతిష్టపన సందర్భంగా చివరి రోజు ప్రతిష్టాపనకు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణకు రాష్ట్ర సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షులు కొండా సత్యాయాదవ్‌ను గ్రామస్తులు ఆహ్వానించి ఆహ్వాన ప్రతిక అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం ముఖ్య నాయకులు కర్నె స్వామి బలరాం రెడ్డి, జయానంద్ రెడ్డి, ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప, ప్రధాన కార్యదర్శిలు డి.రాఘవేంద్ర, సర్పంచ్, తిమ్మప్ప, తాలంకేరి గ్రామస్థులు తాయప్ప, నర్సింలు, తిమ్మప్ప, లక్ష్మణ్, ఆంజప్ప, రాజు రవి, క్రిష్ణ ఉన్నారు.

## ప్రభుత్వం, ప్రజల మధ్య పాత్రికేయులు కీలకవారధి

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : పాత్రికేయులు ప్రభుత్వం, ప్రజల మధ్య కీలకవారధిగా జర్నలిస్టులు సమాజానికి నిజమైన సమాచారం అందించేందుకు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శుక్రవారం తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మన్ననూర్ అటవీశాఖ సమావేశమందిరంలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా పాత్రికేయులకు వివిధ అంశాలపై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి మీడియా కూడా బాధ్యతాయుతంగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. అందుకు అనుగుణంగానే ప్రతి జిల్లాలో సీనియర్ జర్నలిస్టులకు శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే మొట్టమొదటిగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని సీనియర్ పాత్రికేయులకు మెరుగైన జర్నలిజం కొనసాగించేందుకు శిక్షణ తరగతులను అందిస్తున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుండి అధికమొత్తంలో శిక్షణ తరగతులకు జర్నలిస్టులు హాజరుకావడాన్ని ఆయన అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ పాత్రికేయులు నిరంతరం సమాజానికి కొత్త విషయాలను తెలియజేస్తూ గణనీయమైన పాత్రపోషిస్తునారని అన్నారు. ఈ శిక్షణ తరగతులు జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను మరింత సమర్థవంతంగా తమ జర్నలిజంవృత్తిని ప్రజల అవసరాలకోసం అమలుచేసేందుకు ఉపయోగపడతాయని అన్నారు. జర్నలిస్టులు సమాజానికి సమాచారం అందించే ముఖ్యమైన వృత్తిలో ఉన్నవారి బాధ్యతల బలం వాస్తవం, నైతికత, ప్రజలసంక్షేమంవంటి అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఒక జర్నలిస్టుగా పనిచేయడమనేది కేవలం వార్తలురాయడం మాత్రమేకాదు అది సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తివంతమైన సాధనంగా మారుతుందన్నారు. జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయఘటనలు జరగకుండా మీడియా సహకారంతో ప్రజలకు సామాజిక భద్రతను కల్పించేందుకు మీడియా సహాయ సహకారాలను తీసుకుంటున్నామని తెలిపారు. సోషల్‌మీడియాలో వచ్చే వార్తలను ప్రసారం చేసేటప్పుడు పూర్వపరాలను ఒకసారి అవగాహన చేసుకొని ప్రసారంచేయాలని, ఒక వ్యక్తి హక్కులకు భంగం కలిగించకుండా ఉండేలా చూడాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లాయంత్రాంగంతోపాటు మీడియా పనిచేయాలని కోరారు. ఈసమావేశంలో అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎడిటర్ ఉడుముల సుధాకర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు తోట భావనారాయణ, రాష్ట్రస్థాయినుండి శిక్షణ అందించేందుకు వచ్చిన సీనియర్ పాత్రికేయులు, జిల్లానుండి శిక్షణపొందుతున్న సీనియర్, జూనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

## సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలి



ప్రజాపక్షం/బిజినేపల్లి : రైతన్నలు సకాలంలో సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని డాక్టర్ అర్చన అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా వనపర్తి మండలంలోని సవాయిగూడెం రైతు వేదికలో శుక్రవారం అవగాహన రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మాట్లాడుతూ వ్యవసాయపొలంలో పంటల సాగుకంటే ముందుగా పొలంలో జీలుగాపిల్లి పెసర జనుములాంటి విత్తనాలు చల్లుకొని అవి పూతదశకు వచ్చినప్పుడు బాగా కలియదున్నాలన్నారు. వ్యవసాయ పొలంలో పంటకోత అనంతరం వ్యవసాయ వ్యర్థాలనుకాల్చకుండా పొలంలో కలియదున్నితే సేంద్రీయ ఎరువుగా తయారవుతుందని అన్నారు. వర్మి కంపోస్టు పశువుల పేడలాంటి రసాయన రహిత ఎరువులను వాడితే రైతన్నలు ఆశించిన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం నేటి రైతన్నలు అధిక దిగుబడుల కోసం మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడి పర్యావరణ కాలుష్యానికి కారకులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ యుగేంధర్, కళాశాల సిబ్బంది పిఎసిఎస్ డైరెక్టర్ సమరసింహారెడ్డి, పరమేష్, వినోద్‌యాదవ్, ఆయిల్‌ఫామ్ మేనేజర్ నికేతన్ పాల్గొన్నారు.

## డ్రైవింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

### యంటీఓఆర్ ఎస్ఐ శివ శంకర్



ప్రజాపక్షం/నారాయణపేట్: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా పరిధిలోని పోలీసు వాహన డ్రైవర్లు, డ్రైవింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించి వాహనాలను కండిషన్లో ఉంచుకోవాలని మోటర్ వాహనాల ఇన్స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. శుక్రవారం రోజు నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈ లెర్నింగ్ సెంటర్ యంటిఓ ఆర్ ఎస్ఐ శివ శంకర్ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీస్ మోటర్ వాహన డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యంటిఓ శివ శంకర్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ స్టేషన్లలో పెట్రోల కార్, ఎస్‌హెచ్‌ఓ దగ్గర విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు రాత్రి సమయంలో వాహనాన్ని నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని రాత్రి పెట్రోలింగ్ చేసే సమయంలో నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని మందస్తు నేరాలు జరగకుండా చూడాలని సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. వాహనాలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల మెకనిజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోలీసు స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తించే సమయంలో అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన వాహనాన్ని ప్రతి రోజు శుభ్రపరుస్తూ కండీషన్‌లో ఉంచుకోవాలని సమయానికి ఆయిల్ సర్వీసింగ్ చేయించుకోవాలని సూచించారు. ఎమర్జెన్సీ ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. వాహనాన్ని నడిపించే సమయంలో ప్రతి ఒక్కరూ నీట్ టర్ణవుట్ యూనిఫామ్ కలిగి ఉండాలని, డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండి సైన్ బోర్డ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలు సేవించి వాహనాన్ని నడపరాదని హెచ్చరించారు. పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న మోటర్ వాహనాల యొక్క మెకానిజంపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు మోటర్ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పథకం.. పేదలకు వరం



ప్రజాపక్షం/వీపనగండ్ల : అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రులలో మెరుగైన చికిత్స పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరం లాంటిదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జూపల్లి అరుణ్ అన్నారు. మండల కేంద్రమైన వీపనగండ్లలో ఇటీవల అనారరోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగని చికిత్స పొందిన నలుగురికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరైన వేల రూపాయల చెక్కును జూపల్లి అరుణ్ అందజేశారు. గుజ్జుల బాలస్వామికి రూ. 60వేలు, దయపు జానమ్మకు రూ.49 వేలు, కాన మౌని పెద్దగసర్లుకు రూ.20 వేలు, ఆవుల శివుడుకు రూ. 13,500 రూపాయల చెక్కులను జూపల్లి అరుణ్ అందజేశారు. ఈ సందర్భంగా జూపల్లి అరుణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, రెండు లక్షల రుణ మాఫీ, రైతుబంధు , 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదాల బీరయ్య, యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు బొల్లారం సుదర్శన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మహేష్ నాయుడు, భరత్ రెడ్డి, గోపి, మహేష్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు బాధితులకు తగిన న్యాయం చేస్తాం

### ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి పట్టణ భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రోడ్డు విస్తరణకు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న వ్యాపార సంస్థల యాజమానులతో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో వ్యాపార సముదాయాలు, ఇల్లు కోల్పోయే ప్రతి ఒక్కరికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అందరిని ఒప్పించే పని చేస్తామని పేర్కొన్నారు. వనపర్తి పట్టణం నుంచి పెబ్బేరు రహదారి, పాన్‌గల్ రహదారి విస్తరణకు సంబంధించి వ్యాపారస్తులను ఇళ్ల యాజమానులను ఇబ్బంది పెట్టి రోడ్డు విస్తరణ చేపట్టదలుచుకోలేదని, రోడ్డు విస్తరణను యజమానులను ఒప్పించి తగిన నష్టపరిహారం ఇచ్చి విస్తరణ మాత్రం తప్పకుండా జరుగుతుందన్నారు. పాన్‌గల్ రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్ రూం కేటాయించడం లేదా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయటం వంటి సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి వనపర్తి పెబ్బేరు రోడ్డు విస్తరణ ఏది భావితరాలు, వనపర్తి గౌరవాన్ని కాపాడటానికి చాలా ముఖ్యమని అందువల్ల వ్యాపారస్తులు రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. వనపర్తికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, ఎక్కడ లేనివిధంగా సైఫాన్ డ్యాం, చారిత్రాత్మక పాలిటెక్నిక్ కళాశాల ఇక్కడే ఉన్నాయన్నారు. రోడ్డు ఎన్ని ఫీట్లలో ఉండాలి అనేది ఇప్పటికే టౌన్ ప్లానింగ్ ద్వారా రూపొందించిన ప్రణాళికకు అనుగుణంగా ఒకటి రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాపారస్తుల తరపున అడ్వకేట్ నిరంజన్ పాషా తమ వాదనలు వినిపించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జీ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమేష్ రెడ్డి, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

**భగీరథుడి పట్టుదల అందరిలో ఉండాలి**

గంగను దివి నుంచి భూమికి దింపిన మహ తపస్వి భగీరథుడని భగీరథుడి సహనం పట్టుదల ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని మర్రికుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏకశిల భగీరథ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగీరథుడి పట్టుదల మనందరిలోన ఉండాలని మనం చేపట్టే పనులను పూర్తి చేసే వరకు వదిలిపెట్టకూడదని ఎమ్మెల్యే సూచించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించబోతుందని అందులో సగరులకు సైతం రాజకీయపరమైన అవకాశాలురాబోతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సగరుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఒక సమావేశం ఏర్పాటు చేసుకుందామని మీ సంఘంలోని ముఖ్యులు మాట్లాడుకునే సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వనపర్తి పట్టణంలోని సగరుల కోసం కళ్యాణ మండపాన్ని సంబంధించి నివేదికలు తయారుచేయాలని ఎమ్మెల్యే సంఘం నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయాల చైర్మన్ గోవర్ధన్ సాగర్, సగర సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, వనపర్తి పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపిన మహేష్ గౌడ్



ప్రజాపక్షం/నారాయణపేట్ : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బిజ్వార్ మహేష్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి 56 వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్చం ఇచ్చి స్వీటు తినిపించారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు. ఈ సందర్భంగా బిజ్వార్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కల్లు గీత కార్పొరేషన్‌తో నీరా కేఫ్‌ను నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న గీతన్నల నష్టపరిహారాన్ని చెల్లించాలని, నందనం నీరా పరిశ్రమను వెంటనే ప్రారంభించాలని, గీతన్నలకు కొత్త పెన్షన్లు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కల్లుగీత సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ సమయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఇచ్చిన హామీలను మంత్రి శ్రీధర్‌బాబుకు గుర్తు చేశారు.

## జూన్ 3న సిపిఐ మండల మహాసభ



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : జూన్ 3న తిమ్మాజిపేటలో జరిగే సిపిఐ మండల మహాసభను విజయవంతం చేయాలని సిపిఐజిల్లా కౌన్సిల్‌సభ్యులు శివశంకర్, తిమ్మాజిపేట మండలకార్యదర్శి ఎస్‌కె.ఖాజామైనుద్దీన్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వరంగసంస్థలను ప్రైవేట్ రంగ సంస్థలకు అమ్మడంలో బిజెపి ప్రభుత్వం ఆరితేరిందన్నారు. రెండోసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతియేటా నిరుద్యోగులకు రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నేటికి ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల ముందు మతవిద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఏ రాజకీయ జోక్యం లేకుండా ప్రభుత్వ బ్యాంకర్లు నేరుగా అభ్యర్థులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జూన్ 3న సిపిఐ మండల మహాసభకు అన్నిగ్రామాలశాఖ సభ్యులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి యాదయ్య, ఆవంచ సిపిఐగ్రామశాఖ జంగయ్య, తిమ్మాజిపేట, ఆవంచశాఖ సభ్యులు రాములు, రాజు, అశోక్, లాలు, భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

## పర్యావరణంతోనే మానవాళి మనుగడ



ప్రజాపక్షం/నారాయణపేట్: మానవాళి పర్యావరణంతోనే మనుగడ అని బిజ్వార పర్యావరణ పరిరక్షణలో భాగంగా గత సంవత్సరం జూన్ 22 అలంపూర్ నుంచి హైదరాబాదుకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుకుంటూ కృష్ణ స్వామి పాదయాత్ర చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని తిరిగి ఈ వానకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలో అంబాత్యాక్షేత్ర పీఠాధిపతి డా.శ్రీశ్రీ శ్రీ ఆదిత్య పరా శ్రీ గురువుగారి చేత అంబాత్రేయ క్షేత్ర పీఠంలో మహా బిల్వపత్రి, ఉసిరి, నేరేడు, రావి, మొదలుగు మొక్కలను గురుస్వామిచే నాటించడం జరిగింది. అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి డా ఆదిత్య పరా శ్రీ మాట్లాడుతూ కృష్ణ సాగర్ పర్యావరణ క్షణ కొరకు 12 సంవత్సరాల నుంచి నిరంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం చాలా గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో అశ్విని మణిదీప్, రాఘవేంద్ర వనపర్తి పట్టణ తాజా కౌన్సిలర్ నందిమల్ల భువనేశ్వరి, నందిమల్ల శ్యాం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/కొత్తకోట : ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని నాటవెల్లి గ్రామం ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య అన్నారు. అంతేకాకుండా దీనికి గ్రామస్తుల సహకారం కావాలని కోరారు. గ్రామాల్లో కొనసాగుతున్నా బడిబాట కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగారపు బీచుపల్లి మాట్లాడుతూ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివించి పాఠశాలలను పరిరక్షించాలని, ఈ బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రభుత్వ స్కూళ్లలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారని, బడీడు పిల్లలందరిని ప్రభుత్వ స్కూల్లోనే చేర్పించాలని అన్నారు. ఎలాంటి సహాయ సహకారాలైనా విద్యకు అందివ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలు పట్టుకొమ్మలని, మన ఊరు... మన బడిని మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి. వహిద్, మాజీ వార్డ్ సభ్యులు బోయ రాములు, పి.దశరథ, పి.బలరాం, ఎస్.రాజ్‌కుమార్, బోయ రాజు, ఎండి.మైనోద్దీన్, జి.కృష్ణయ్యగౌడ్, బోయ వెంకటయ్య, పి.డైరెక్టర్ గొల్ల విష్ణుకుమార్, పి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## చేనేత పరిశ్రమకు చేయూతనిచ్చి మహిళా సాధికారతకు బాసట

ప్రజాపక్షం/ నారాయణపేట్ : రాణి అహిల్యాబాయి త్రిశత జయంతి ఉత్సవాల సందర్భంగా రాణి అహిల్యా భాయి 18 వ శతాబ్దంలోనే చేనేత పరిశ్రమకు చయూతనిచ్చి మహిళా సాధికారతకు బాసటగా నిలిచారని ఎంపీ డీకే.అరుణ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రాణి అహిల్యాబాయి చరిత్రను వివరించాలని చేనేత కార్మికులతో వారి సమస్యల గురించి తెలుసుకోవాలన్నారు. సోమనాథ నుంచి గయా వరకు రామేశ్వరం నుంచి కాశి వరకు భారతదేశంలోని ప్రముఖ దేవాలయాలను పునరుద్ధరణ చేసి దేవాలయాలకు పునర్ వైభవం తెచ్చిన మహిళా మూర్తిగా పేరుగాంచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ డీకే.అరుణ, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, సీనియర్ నాయకులు నాగరావు నామా జీ, రతంగ్ పాండురంగారెడ్డి, పగడాకులు శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, లక్ష్మీశ్యాంసుందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోకస్ సైన్స్

## అంతరిక్షంలో కొత్త సూక్ష్మ జీవి..

### జీవం విశ్వవ్యాప్తమా?





భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సహకారంతో, 'నాసా' నిర్వహిస్తున్న అంతరిక్ష పరిశోధనల్లో ఎన్నో కొత్త విషయాలు బయటపడుతున్నాయి. శాస్త్రవేత్తలు ఒక కొత్త సూక్ష్మ జీవిని అంతరిక్షంలో గుర్తించారు. నివేదికలను అనుసరించి, ఈ జీవి అంతరిక్షంలో తక్కువ గురుత్వాకర్షణ, ఎక్కువ రేడియేషన్ వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ జీవించగలగడం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరచింది. అంతరిక్ష నౌక అంతార్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) సేకరించిన నమూనాల్లో ఈ సూక్ష్మ జీవి కనిపించింది. ఇది గాలి ఫిల్టర్లు, సర్క్యూట్ ప్యానెల్స్, అంతరిక్ష నౌక గోడల ఉన్న ఈ జీవికి శాస్త్రీయంగా 'బాసిలస్ ఒడెస్సెయి' అని పేరు ఖరారు చేశారు. ఇటీవల కనుగొన్న వేరియంట్‌కు 'బాసిల్లస్ సఫెన్సిస్ ఐఎస్ఎంఎఆర్ఎస్ 24' అనే పేరును ఖరారు చేసే అవకాశాలు ఉనాయి. ఈ సూక్ష్మ జీవికి ఉన్న ప్రత్యేక లక్షణాల్లో అత్యధిక రేడియేషన్ తట్టుకునే శక్తి ఒకటి. ఇది సూర్య కిరణాలు, గ్యామా రేడియేషన్‌లను తట్టుకోగలుగుతుంది. అంతరిక్ష శూన్యతలో జీవిస్తుంది. స్పేస్ వాక్యూమ్‌లో కూడా డిఎన్ఎ నాశనం కాకుండా జీవించగలదు. దృఢమైన జీవ సంబంధిత నిర్మాణం దీనికి ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి పక్కనపక్కన ఉండి రక్షణ పొరగా మారతాయి. ఈ జీవి భూమి నుండి వచ్చిందా? లేక అంతరిక్ష జీవమా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇది భూమి నుంచే అంతరిక్ష నౌక ద్వారా వెళ్లి, అక్కడ అభివృద్ధి చెందిందని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మరికొందరు శాస్త్రవేత్తలు 'పాన్‌స్పర్మియా' సిద్ధాంతాన్ని సూచిస్తున్నారు. జీవం అంతరిక్షంలో సహజంగా ప్రయాణించి గ్రహాలపై పడగలదని, అంటే ఇది భూమికి బయట నుంచి చేరే అవకాశం ఉందని అనుకోవచ్చు. అంతరిక్షంలో సూక్ష్మ జీవిని గుర్తించడానికి శాస్త్రీయ ప్రాముఖ్యత ఏర్పడింది. ఇలాంటి సూక్ష్మ జీవులు అంతరిక్ష ప్రయాణాల్లో మానవుల ఆరోగ్యంపై ప్రభావం చూసే అవకాశం లేకపోలేదు. ఈ పరిస్థితి, వాతావరణ నియంత్రణ వ్యవస్థల్లో వ్యాధులు ప్రబలడానికి కారణమవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాగా, జీవం అంతరిక్షంలో పుట్టే అవకాశంపై కొత్త పరిశోధనలు మరింత పెరగడం ఖాయం. భూమికి వెలుపల జీవం ఉన్నదీ అని పరిశోధించేందుకు ఇది కీలక ఆధారంగా మారుతుంది. ఈ జీవుల లక్షణాలను ఆధారంగా తీసుకుని ఇతర గ్రహాలపై కూడా జీవ లక్షణాలను పరిశీలించవచ్చు. కాగా, ఇస్రో తన బయోబర్డెన్ (bioburden) నియంత్రణలో కొత్త మార్గాలు అన్వేషిస్తోంది. ఈ సూక్ష్మ జీవుల ప్రవర్తన ఆధారంగా రాకెట్, ఉపగ్రహాల శుద్ధి విధానాలను పునర్నిర్మిస్తోంది.

## రోబోకు మనిషి చర్మం!



వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ, మర మనుషులను అసలుసిసలైన మనుషులుగా తయారు చేసే ప్రయత్నాలు చాలాకాలంగా జరుగుతునే ఉన్నాయి. రోబోలకు కూడా మనిషి చర్మాన్ని అతికించడం కష్టసాధ్యమైన ప్రక్రియ. టోక్యో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ ప్రయోగాల్లో ముందంజ వేశారు. సజీవ మానవ కణాల నుండి వేరుచేసిన తర్వాత, ప్రయోగశాలపెరిగిన చర్మాన్ని అభివృద్ధి చేసి, దానిని రోబోటిక్ ముఖాలకు పెడుతున్నారు. ఈ సింథటిక్ చర్మం కల్చర్డ్ హ్యూమన్ ఫైబ్రోబ్లాస్ట్‌లు, కొల్లాజెన్‌తో కూడి ఉంటుంది, ఇది నిజమైన మానవ చర్మ యాంత్రిక మరియు జీవ లక్షణాలను అనుకరిస్తుంది. చర్మం ఏదైనా కారణం చేత దెబ్బ తింటే, దానంతట అదే పెరుగుతుంది. రోబోలకు అమర్చే చర్మానికి కూడా ఇదే గుణం ఉండడం విశేషం. ఇది రోబోటిక్ ఉపరితలాలతో బాగా కలిసిపోతుంది. కొల్లాజెన్ జెల్‌తో చిన్న కోతలను నయం చేయగలుగుతుంది. ప్రపంచంలో మరే జంతువుకు లేని ప్రత్యేకత లక్షణమైన 'నవ్వు' కేవలం మనుషులకు మాత్రమే ఉంది. రోబోలకు కూడా ఈ లక్షణాన్ని కల్పించేందుకు జరుపుతున్న ప్రయత్నాల్లో భాగంగానే చర్మాన్ని అమర్చే ప్రక్రియ. సాధారణం చర్మం మాదిరి సాగే లక్షణం ఉంటుంది కాబట్టి, రోబోలు కూడా నవ్వగలుతాయన్నది రోబోటిక్ శాస్త్రవేత్తల అభిప్రాయం. భావోద్వేగపరంగా ప్రతిస్పందించే రీతిలో, జీవశాస్త్రపరంగా ఇంటిగ్రేటెడ్ రోబోట్‌లను నిర్మించడంలో ఈ పురోగతి ఒక ప్రధాన దశను సూచిస్తుంది.

## టైమ్ ట్రావెల్‌పై చర్చ?

'టైమ్ ట్రావెల్' సాధ్యాసాధ్యాలపైన విపరీతమైన చర్చ కొన సాగుతున్నది. భవిష్యత్తు కాలపు తలుపు తెరవగలుగుతామా? అనేది ప్రశ్న. కాల ప్రయాణం అనేది శాస్త్రవేత్తలకూ, రచయితలకూ, ప్రేక్షకులకూ ఒక కల. సాపేక్ష సిద్ధాంతం ప్రకారం, వేగంగా ప్రయాణిస్తే మనం భవిష్యత్తులోకి వెళ్లొచ్చు. కానీ గతంలోకి తిరిగివెళ్ళగలమా? దీనికి వర్మ్ హోల్స్, బ్లాక్ హోల్స్ వంటి సిద్ధాంతాలు ఆధారమవుతున్నాయి. ఒకప్పుడు "వార్ప్ డ్రైవ్" వంటి కాన్సెప్ట్‌లు కల్పితంగా ఉన్నా, ఇవి ఇప్పుడు సాంకేతికంగా పరిశీలనకు వస్తున్నాయి. ఇది కల లేనా? లేక రేపటి విజ్ఞాన పంథానా? కాలమే సమాధానం. ఇలావుంటే, మల్టీవర్స్ సిద్ధాంతం అనేక విశ్వాల ఉనికిమనం నివసిస్తున్న విశ్వం ఒక్కటే కాకుండా, ఇంకా ఎన్నో విశ్వాలు ఉండవచ్చని భావన మల్టీవర్స్ సిద్ధాంతంగా అభివృద్ధి చెందింది. ప్రతి విశ్వంలో భిన్నమైన శక్తులు, భౌతిక నియమాలు ఉండవచ్చు. మన విశ్వంలో గ్రావిటీ ఎలా పనిచేస్తుందో, మరొక విశ్వంలో అది అర్థంగాకుండా ఉండవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం, మనం తీసుకున్న ప్రతి నిర్ణయం ఆధారంగా ఒక కొత్త విశ్వం ఆవిర్భవించి ఉండవచ్చు. ఇది సైన్స్‌తో పాటు తాత్వికతకు మార్గం చూపుతుంది.




## మానవ శరీరం.. బాక్టీరియా మయం!

బాక్టీరియాలు ఎక్కువగా మన ఆంత్రవ్యవస్థ (gut), అంటే పొట్టలో ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. వాటిని ఏకమొత్తంగా 'గట్ మైక్రోబయోమ్' అంటారు. బాక్టీరియా అనగానే, చాలా హానికరం అనే అపోహ చాలా మందిలో ఉంటుంది. కానీ, అది నిజం కాదు. కొన్ని రకాల బాక్టీరియా శరీరానికి ఎంతో ఉపయోగపడతాయి. ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడతాయి



మన శరీరంలో ఉన్న కణాల కన్నా ఎక్కువ బాక్టీరియా ఉంటాయి. ఇది నిజం. ఒక సగటు మనిషిలో సుమారు 30 ట్రిలియన్ మానవ కణాలు ఉంటాయని అంచనా. తాజా అధ్యయనాల ప్రకారం, మన శరీరంలో సుమారు 39 ట్రిలియన్ మైక్రోబియల్ కణాలు (బాక్టీరియా, ఆర్చియా, మొదలైనవి) ఉండవచ్చని శాస్త్రవేత్తలు అంచనా. బాక్టీరియాలు ఎక్కువగా మన ఆంత్రవ్యవస్థ (gut), అంటే పొట్టలో ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. వాటిని ఏకమొత్తంగా 'గట్ మైక్రోబయోమ్' అంటారు. కాగా, బాక్టీరియా అనగానే, చాలా హానికరం అనే అపోహ చాలా మందిలో ఉంటుంది. కానీ, అది నిజం కాదు. కొన్ని రకాల బాక్టీరియా శరీరానికి ఎంతో ఉపయోగపడతాయి. ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడతాయి. విటమిన్లు (ఉదా: విటమిన్ 'కె') ఉత్పత్తి చేస్తాయి. హానికరమైన సూక్ష్మ జీవులను ఎదుర్కొనడంలో సహకరిస్తాయి. మన ఇమ్యూన్ సిస్టమ్‌ను బలోపేతం చేస్తాయి. 'గట్ మైక్రోబయోమ్' విషయానికి వస్తే, ఇది మన ఆహార నాళంలో (గట్‌లో), ముఖ్యంగా చిన్నపేగు, పెద్దపేగుల భాగంలో నివసించే సూక్ష్మ జీవుల సముదాయం. వీటిలో బాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్‌లు, ఆర్చియా వంటి జీవులున్నాయి. ఈ మైక్రోబయోమ్ ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఉంటుంది. ఇది ప్రతి మనిషికి ప్రత్యేకమైనది, గమనించదగ్గది. మన శరీరం పూర్తిగా జీర్ణించలేని కొంత ఆహారాన్ని గట్‌లోని బాక్టీరియా జీర్ణించి, శరీరానికి అవసరమైన పోషకాలు తయారు చేస్తాయి. ఉదాహరణకు ఫైబర్‌ను జీర్ణింపచేసి, 'షార్ట్ చైన్ ఫ్యాటి యాసిడ్స్' తయారు చేస్తాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గట్ మైక్రోబయోమ్ నుంచి విడుదలయ్యే రసాయనాలు మెదడుతో కమ్యూనికేట్ చేస్తాయి. దీన్ని గట్‌బ్రెయిన్ యాక్సిస్ (Gut Brain Axis) అంటారు. అంటే మన మనోవైకల్యాలు, ఆందోళన, మూడ్ స్వింగ్స్‌కు కూడా ఇవి ప్రభావితం చేస్తాయన్నమాట. మైక్రోబయోమ్‌ను ఆరోగ్యంగా ఉంచే మార్గాల్లో ప్రొబయోటిక్స్ (Probiotics) ప్రధానమైనవి. ఇవి ఆరోగ్యకరమైన బాక్టీరియా. పెరుగు (yogurt), బట్టర్ మిల్క్ (మజ్జిగ), కాంజీ వంటి పదార్థాల్లో ఉంటుంది. కాగా, పచ్చి కంద, జొన్నలు, చిలుకల దుంప, పచ్చి వేప, వెల్లుల్లి, ఉల్లిపాయ మొదలైనవి బాక్టీరియాకు ఆహారంగా పని చేసే పదార్థాలు. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల మంచి బాక్టీరియా వృద్ధి చెందుతుంది. అనవసరమైన యాంటీబయోటిక్స్ తీసుకోవడం నివారించడం, ఎందుకంటే అవి మంచిచెడ్డా తేడా లేకుండా అన్ని బాక్టీరియాను నాశనం చేస్తాయి ఏదిఏమైనా మన శరీరంలో కణాల కంటే బాక్టీరియా సంఖ్య ఎక్కువ అనేది ఆశ్చర్యం కలిగించే నిజం. కాబట్టి, మనం అంటే కేవలం మనం మాత్రమేకాదు... మనతోనే, మనలోనే ఉండే బాక్టీరియా కూడా.

## 'ఆర్మిడిల్లో' నటన..




బల్లి జాతికి చెందిన 'ఆర్మిడిల్లో'కు గొప్ప నటనా చాతుర్యం ఉంది. ఏదైనా ప్రమాదం ముందుకొచ్చిందన్న అనుమానం కలిగినా, ఏదైనా జంతువు దాడి చేస్తుందని గ్రహించినా, వెంటనే స్పందిస్తుంది. తల ఎక్కడ ఉందో కూడా కనిపెట్టలేని రీతిలో గుండ్రంగా ముడుచుకుపోతుంది. అప్పటికీ దాడి జరిగినా లేక దాడి అనుమానం పెరిగినా, వెంటనే తోకను తనంతట తానే కత్తిరించిన విధంగా వదిలివేస్తుంది. ఈ తోక కూడా ప్రాణంతో కొట్టుకుంటుంది కాబట్టి, దాడి చేసిన జంతువు దానిని ఎత్తుకుపోతుంది. ఆర్మిడిల్లో తోక మళ్లీ పెరగడం విశేషం. ప్రకృతిపరంగానే జంతువులకు కొన్ని లక్షణాలు అలవడతాయనడానికి ఆర్మిడిల్లో లిజార్డ్ ఒక ఉదాహరణ.

---

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత కార్మికుల హక్కులను కాలరాస్తూ నియంతృత్వ పాలన కొనసాగిస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులను పెంచిపోషిస్తూ నిత్యవసర వస్తువుల ధరలను పెంచి సామాన్యులపై భారం మోపుతుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందన్నారు. కేంద్రం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరిపి ఆపరేషన్ నిలిపివేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జూన్ 8న జరిగే పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఎల్లావుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, ధూళిపాళ ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, క్రిష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, యాదగిరి, పొకల వెంకటేశ్వర్లు, హనుమంతరావు, దేవరం మల్లేశ్వరి, ఎస్‌కె లత్తు పాల్గొన్నారు.

## గుర్తింపు లేని కాలేజీలు, పాఠశాలలు మూసేయాలి

### ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** వరంగల్ జిల్లాలో విద్యాశాఖ గుర్తింపు లేకుండా నడుస్తున్న కాలేజీలు, పాఠశాలలను మూసేయాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదేళ్ల శరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం శివనగర్ తమ్మెర భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో శరత్ మాట్లాడారు. టెక్నో, డిజి పేర్ల మీద నడిపిస్తున్న పాఠశాలలను, అకాడమీల పేరుతో నడుస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్ స్కూళ్లలో విచ్చలవిడిగా బుక్స్ యూనిఫామ్స్ అమ్ముతున్నారని ఆరోపించారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇంటర్ బోర్డు అధికారులు ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఆగడాలు అరికట్టాలని లేని పక్షంలో జూనియర్ కళాశాలల ముందు ఆందోళనలు చేపడతామన్నారు. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు ఇంకా ప్రారంభం కాకముందుకే రెండో సంవత్సరం తరగతులు నిర్వహిస్తూ, ఒక్కో విద్యార్థినుండి 50 శాతం ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సాగర్, రాకేష్ ప్రశాంత్, శరత్, రమేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమష్టికృషితో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### రూ.3.58 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం, సమష్టి కృషితో నియోజక వర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలం విద్యానగర్, వెంకటేశ్వరాకాలనీ, రామాంజనేయకాలనీ, ఎన్‌కే నగర్, నందతండా గ్రామపంచాయితీలో పరిధిలో శుక్రవారం రూ.3.58కోట్ల ఈజిఎశ్, సబ్ ప్లాన్ నిధులతో చేపట్టనున్నరోడ్లు, డ్రైనేజీల పనులకు శంకుస్థాపనలు, పనులు పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాలు చేశారు. కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజా అవసరాలను గుర్తించి నిధుల మంజూరీకి కృషి జరుగుతోందని, ప్రాధాన్యతా క్రమం లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజలు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకదృష్టిసారించామని, కనీసఅవసరాలైన తాగు నీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు వంటివాటికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజాసంక్షేమ పథకాలను అర్హులైన పేదల దరిచేరుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న పనులపై ప్రజలతో పాటు అధికారులు కూడా దృష్టి సారించాలన్నారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి తేడాలు లేకుండా పనులు చేయాలని, చేపట్టిన పను లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఓ శుభాషిణి, తహశిల్దార్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సత్యనారాయణ, నాగేంధర్, రాయల వెంకటేశ్వర్లు, రవి, నర్సింహారావు, గుప్తా, వసంత, శ్రీనివాసరెడ్డి, రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళీ, నాయకులు శ్రీను, జకరయ్య, మహేశ్వరరావు, మాధవరావు, రాంజీ, పాల్, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, నాని, అజయ్, బషీర్, యాకూబ్,రతన్, వేదాద్రి, మహేష్, నగేష్, జమలయ్య, కృష్ణయ్య, రాజేష్, వీరు, ప్రసాద్, నూరమ్మ, కిట్టు, పిడుగు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** రాష్ట్రంలో అధికారంలోఉన్నకాంగ్రెస్ ప్రభుత్వం సిపిఐతో స్నేహపూర్వకంగా ఉన్నప్పటికీ ప్రజాసమస్యలపై ప్రజలపక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధమయ్యామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో సిపిఐ నూతన జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో 16 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాస ం సన్నగిల్లిందన్నారు. ప్రభుత్వ యంత్రాంగంపై పరిపాలకుల అజమాయిషీ లేకుండా పోయిందన్నారు. కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలపై ప్రజల్లో అవిశ్వాసం నెలకొనడం దురదృష్టకరమన్నారు. స్నేహపూర్వకంగాఉన్నకమ్యూనిస్టు పార్టీ అనేక మార్లు పలు సూచనలు సైతం చేయడం జరిగిందన్నారు. కరీంనగర్ జిల్లాలో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, సమగ్రమైన అభివృద్ధి కోసం సిపిఐ ఉద్యమ కార్యచరణ రూపొందించిందన్నారు.డంప్ యార్డు సమస్యను పరిష్కరించాలన్నారు. ఇండ్లు, ఇళ్లస్థలాలపై రాజకీయ జోక్యం లేకుండా నిజమైన పేదలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో వందల కోట్లు ఖర్చు పెట్టి నిర్మాణం పూర్తి చేసిన డబుల్ బెడ్ రూంలు నిరుపయోగంగా ఉన్నవాటిని పేదలకు పంపిణీ చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ నెల 27, 28 తేదీలలో సిపిఐ 23వ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించామన్నారు. జాతీయ,రాష్ట్ర,జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తూ వచ్చే మూడేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ కార్యచరణ రూపొందించామన్నారు. నూతనంగా 39 మందితో జిల్లా కౌన్సిల్, 14 మందితో జిల్లా కార్యవర్గం, నూతన జిల్లా కార్యదర్శిని ఎన్నుకున్నామన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్య లు పొనగంటి కేదారి,అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, గూడెం లక్ష్మి , నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, కిన్నెర మల్లవ్వ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, కంది రవీందర్‌రెడ్డి, అందె చిన్న స్వామి, బావండ్లపల్లి యుగంధర్, మచ్చ రమేష్, బోనగిరి మహేందర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, నాయకులు చెంచల మురళి, మామిడిపల్లి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

సిపిఐ కరీంనగర్ జిల్లా నూతన కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ శుక్రవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.తన ఎన్నికకు సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, దేశిని చినమల్లయ్య, చాడ వెంకటరెడ్డి, మర్రి వెంకటస్వామిల వారసత్వాన్ని కొనసాగించే అవకాశం కల్పించినందుకు అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## నకిలీ విత్తనాలు అరికట్టండి



**ప్రజాపక్షం/వైరా:** నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు అన్నారు. వైరాలో శుక్రవారం మండల ముఖ్య నాయకుల సమావేశం రేమల్లి నారాయణ అధ్యక్షతన జరిగింది. యర్ర బాబు మాట్లాడుతూ వ్యవసాయ పనులు ఈ సంవత్సరం తొలకరి వర్షాలు రుతుపవనాలు ముందుగా వస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ సీజన్‌ను ముందుగా ప్రారంభించి ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేయుటకు సిద్ధమవుతున్నారన్నారు. నకిలీ విత్తనాల విక్రయదారులు అక్రమార్కులు అదునుగా తీసుకొని వివిధ రకాల కొత్త కంపెనీల పేర్లతో రైతులను మోసం చేస్తున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల పేర్లతోటి మార్కెట్‌లోఅమ్ముతున్న విక్రయదారులనుఅరికట్టడంలో సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. నకిలీ విత్తనాలఅమ్మకందారులపై గతంలో అరకొర కేసులు పెట్టి చేతులు దులిపేసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, రైతు సంఘం నాయకులు లక్ష్మీ నారాయణ, గారపాటి అశోక్, ఆదూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 3న నర్మెటలో సిపిఐ బహిరంగ సభ

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** సిపిఐ జిల్లా మహాసభల సందర్భంగా జూన్ 3న నర్మెట మండలంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో మోటే శ్రీశైలం అధ్యక్షతన ఎఐటియుసి జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రమజీవుల కష్టాలు పోవాలంటే ఎర్ర జెండాను ముందుకు తీసుకెళ్లాలన్నారు. దేశంలోని బిజెపి కార్మికులు సాధించుకున్న హక్కులను హరిస్తుందని, 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించిందన్నారు. సిపిఐ శ్రమజీవులకు అండగా ఉంటు కార్మికులు కష్టాల్లో భాగమవుతుందన్నారు. గూడు, గూడు, విద్య, ఉపాధి వంటి అనేక సమస్యలపై సిపిఐ పోరాటాలు చేస్తుందని, దోపిడికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిందన్నారు. కష్టజీవులకు అండగా ఉంటున్న సిపిఐ జనగామ జిల్లా మహాసభలు ఈ నెల 3,4 తేదీల్లో జనగామ జిల్లాలోని నర్మెట మండలంలో జరగనున్నాయన్నారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. ఈ బహిరంగ సభకు భవ నిర్మాణ కార్మికులు, హమాలీలు, బీడి, ఆటో, షాప్స్ అండ్ హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్మికులు, కర్షకులు, పేదలు అధిక సంఖ్యలో తరలి వచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చామకూర యాకూబ్, నాయకులు అంజనేయులు, తోట సుశీల, సుద్దాల యాదగిరి, చల్లోజు మల్లేష్, లింగాల రాములు, ముల్కల లక్ష్మయ్య, ఉడుత సుదర్శనం, బల్ల యాకయ్య, వంగాల ప్రభాకర్, గుగులోతు రాఘవులు, మచ్చ మల్లయ్య, బెజగం చంద్రయ్య, జోగు కృష్ణ, తిరుమలేష్, బెజగం చంద్రయ్య, జోగు కృష్ణ దాయ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ట్రాఫిక్ సమస్యల నుండి విముక్తి ఎప్పుడు?



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** మాదాపూర్‌లో ప్రతి నిత్యం ట్రాఫిక్ సమస్యల నుండి ప్రజలకు విముక్తి కలిగించాలని సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. మాదాపూర్, హైటెక్ సీటీ, ఇజ్జత్ నగర్ ప్రాంతాలలో ట్రాఫిక్ పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించాలని సిపిఐ నాయకులు శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ తదితరులు మాదాపూర్ ట్రాఫిక్ సిఐకు వినతి పత్రం అందించారు. సుధాకర్, కొండలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గుల్జార్‌హౌస్ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచేత విచారించాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి బాధిత కుటుంబీకుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** నగరంలోని గుల్జార్‌హౌజ్ అగ్ని ప్రమాద ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచేత న్యాయ విచారణ జరిపించాలని బాధిత కుటుంబసభ్యులు సంతోశ్ గుప్తా, నితీశ్, అతుల్ అగర్వాల్, బి. శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనపై 17 మంది మృతికి కారణమైన వైద్య, అగ్నిమాపక అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ గుల్జార్‌హౌస్‌లోని మొదటి అంతస్థు నుంచి ఈ నెల 18న ఉదయం 5.50 గంటలకు పొగలు వ్యాపించాయన్నారు. ఉదయం 6.12 గంటలకు అగ్నిమాపక సర్వీస్‌కు, 6.16 గంటలకు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశామన్నారు. చివరికి 6.45 గంటలకు ఒక సగం నీటితో అగ్నిమాపక సర్వీస్, ఆక్సిజన్ మాస్క్ లేని అంబులెన్స్ ఘటన స్థలానికి చేరాయని తెలిపారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఉస్మానియా దవాఖానకు తరలించగా, పోలీస్ ఎఫ్ఐఆర్ నమోదు కానిదే చికిత్స చేయబోమని వైద్యులు ఖరాకండిగా చెప్పారన్నారు. తర్వాత మలక్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి 8 మంది క్షతగాత్రులను తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారన్నారు. అగ్నిమాపక సర్వీస్, వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్లే 17 మంది క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం వేసిన కమిటీ తమను ఇప్పటివరకు సంప్రదించకపోవడం దారుణమన్నారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## భారతీయ సంస్కృతి కళా పురస్కారాలు



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** భారతీయ సంస్కృతి సకల కళా పురస్కారాలు సీజన్ –1 కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో బి9 డ్యాన్స్ స్టూడియో వ్యవస్థాపక అధ్యక్షులు బన్నీ జాక్సన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సారస్వత పరిషత్తు దైవాజ్ఞ శర్మ, హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు డిసిపి రామదాసు తేజావత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం, జానపదం, వెస్ట్రన్ వంటి నృత్య ప్రదర్శనలను వీక్షించి, అభినందించారు. అనంతరం విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేసి, మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాట్యగురువులు అభ నాక్కోడె, సంతోష్‌కుమార్, మిచెల్ సిద్ధు, సవరి సంజీవిని, ధర్మ మాస్టర్, శివ కుమార్, ప్రశాంత్ మాస్టర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ‘గద్దర్ ఫిలిం అవార్డులు రద్దు చేయాలి’



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** గద్దర్ ఫిలిం అవార్డులను వెంటనే రద్దు చేసి, తెలంగాణ సినిమాలకే గద్దర్ ఫిలిం అవార్డులు ఇవ్వాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గద్దర్ పేరిట ప్రకటించిన అవార్డుల అంశంపై తెలంగాణ సినిమా వేదిక (టిసివి) కోకన్వీనర్ మోహన్ బైరాగి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిసివి గౌరవాధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రెడ్డి, సినీ దర్శకులు ఎండి రఫీ, సీనియర్ జర్నలిస్టు స్కైబాబా, టిసివి కన్వీనర్ లారా, ఆప్ రాష్ట్ర నేత సుధాకర్ మాట్లాడారు. తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు ఆంధ్ర పెద్దల కనుసన్నల్లో జరిగిందని ఆరోపించారు.తెలంగాణ సినిమాకు జరుగుతున్న అన్యాయంపై సిఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నేతలు మురళీధర్ దేశ్‌పాండే, పంజాల శ్రవణ్‌గౌడ్, రవి, హరి, అరుణ, సుజి, ప్రసాద్, బాలు నాయక్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## మక్తల్ ఎమ్మెల్యేకు తప్పిన ప్రమాదం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రోడ్డు ప్రమాదంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి తృటిలో ప్ర మా దం తప్పింది. శుక్రవా రం హైదరాబాద్ నుం డి మక్తల్ నియోజకవర్గానికి వెళ్తున్న నేపథ్యంలో షాద్‌నగర్ టోల్‌గేటు వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. హైదరాబాద్ నుండి మక్తల్‌కు ఎమ్మెల్యే కారులో వెళ్తుండగా జిఎంఆర్ టోల్ ప్లాజా వద్ద మరో కారు వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో ఎమ్మెల్యే కారు స్వల్పంగా ధ్వంసం అయింది. మరో కారు కూడా దెబ్బతిన్నట్లు వివరించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని అక్కడి నుండి మరో వాహనంలో మక్తల్‌కు పంపించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళు కేటాయించండి



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు కేటాయించేందుకు కృషి చేయాలని ప్రజలు ఎమ్మెల్యే ఎదుటమొరపెట్టుకున్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో 22వ వార్డు మాజీ కౌన్సిలర్ నడికూడ సరిత యాదిగిరి యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించారు. పనులు చేసేందుకు గాను సుమారు రూ.7 కోట్ల వరకు కావాల్సి ఉందని, మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.

## ప్రజల భద్రతకు ప్రాధాన్యం

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** ప్రజల భద్రత, సౌకర్యం మా ప్రథమ కర్తవ్యం గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గడ్డిఅన్నారం డివిజన్‌లోని పిఅండ్‌టి కాలనీలో గురువారం వర్షాల కారణంగా కాలనీ వాసులు ఇబ్బందిపడ్డారు. కాలనీ అధ్యక్షులు అశోక్, భాను, నాయకులు గిరి, టింకు తదితరులు పాల్గొన్నారు.

# నాలా పనులు వేగవంతం

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా నాలా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్‌లో నాలా పనులను యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డిలతో కలిసి సందర్శించారు. కమిషనర్ మౌలానాకా చిల్ల, గంగానగర్ నాలాలను కమిషనర్ పరిశీలించారు. మౌలానా కా చిల్ల, గంగానగర్ నాలాల వలన పలు కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ కమిషనర్‌కు వివరించారు. గంగానగర్ నాలా మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని ప్రాజెక్టు ఈఈ బి.ఎల్.శ్రీనివాస్ కమిషనర్‌కు వివరించారు. మిగిలిన 30 శాతం పనులు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రాజెక్టు అధికారిని ఆదేశించారు. గంగా నగర్ నాలాకు ఇరువైపులా జలమండలి పైప్‌లైన్ సమాంతరంగా ఉన్నందున జిహెచ్‌ఎంసి నిర్వహణ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులు కలిసి శుద్ధి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జహంగీర్ నగర్ కాలనీ నుండి మౌలానాకా చిల్ల నాలా వరకు డ్రైనేజీ కాలువ నిర్మాణం ఆవశ్యకత కార్పొరేట్ కమిషనర్‌కు వివరించగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వివిధ డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు సోహెల్ మహమూద్ ఖాద్రీ, అలందార్ హుస్సేన్ ఖాన్, వాసా ఉద్దీన్, ముజఫర్ హుస్సేన్, డాక్టర్ సమీనాబేగం, నస్రీన్ సుల్తానా, షఫత్ అలీ, జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్.ఈ. మహేశ్వర రెడ్డి, ప్రాజెక్టు ఈఈ బి.ఎల్. శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ మంగతాయారు, జలమండలి ఆపరేషన్‌డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సిజిఎంలు నాగేంద్ర, వినోద్ భార్గవ, జిఎంలు సంతోష్ కుమార్, శ్యామ్సుందర్ నాయక్, అశోక్ పాల్గొన్నారు.

## ఆశీర్వాద్ మల్టిగ్రెయిన్స్ హ్యాపీ టమ్మీ సర్వే నివేదిక వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ జీర్ణక్రియ దినోత్సవం సందర్భంగా ఆశీర్వాద్ హ్యాపీ టమ్మీ ప్లాట్ ఫాం 8 లక్షలకు పైగా ప్రజలు అందించిన జవాబులు ఆధారంగా దేశపు జీర్ణశక్తి ఆరోగ్యం గురించి అవగాహనా విశ్లేషణను విడుదల చేసింది. ఫలితాల్లో ఫైబర్ మీటర్ నుండి 1.27 లక్షల మంది, డైజెస్టివ్ కోషియెంట్ ఆన్ హ్యాపీ టమ్మీ నుండి 7.4 లక్షలకు పైగా రెస్పాండెంట్స్ ఇచ్చిన జవాబులు ఉన్నాయి. ఆశీర్వాద్ హ్యాపీ టమ్మీ అనగా మల్టిగ్రెయిన్స్‌తో ఆశీర్వాద్ ఆటా అందించే ఆన్ లైన్ ప్లాట్ ఫాం. ఇది జీర్ణశక్తి ఆరోగ్యం ఫైబర్ తీసుకోవడంపై దృష్టి కేంద్రీకరించిన సమగ్రమైన గైడ్‌గా పని చేస్తుంది. సర్వేకి ప్రతిస్పందించిన 70 శాతం మంది భారతీయులు సిఫారసు చేసిన రోజూవారీ ఫైబర్‌ను తీసుకోవడం లేదని ఫైబర్ మీటర్ నివేదిక వెల్లడించింది. 64 శాతం మంది మగవారితో పోల్చినప్పుడు ఈ అంతరం మహిళల్లో అధికంగా 74 శాతం మందిలో ఉందని, జీర్ణశక్తి ఆరోగ్యానికి ముఖ్యమైన అంశాన్ని చాలామంది ప్రజలు కోల్పోతున్నారని ఇది సూచిస్తోంది. ఫైబర్ తక్కువగా తీసుకోవడంతో సాధారణ జీర్ణ క్రియ సమస్యలైన మలబద్ధకం, దీర్ఘకాల పరిస్థితులైన ఊబకాయం, టైప్ 2 డయాబిటిస్, హృద్రోగ సంబంధ వ్యాధులతో సంబంధం ఉందని పరిశోధన తెలియచేస్తోంది. జీర్ణశక్తి ఆరోగ్యం ప్రాధాన్యతను తెలియచేస్తూ చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్స్ ఫర్ మెడికల్ సైన్స్ మెడికల్ గ్యాస్ట్రోఎంటిరాలజీ విభాగ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్. బి.ఎస్.రామకృష్ణమాట్లాడుతూజీర్ణశక్తినిమెరుగుపరచడంలో తృణ ధాన్యాలు, మల్టిగ్రెయిన్ ఆధారాల నుండి ఆహారపు ఫైబర్ బాధ్యతను శాస్త్రీయ విజ్ఞానం నిరంతరంగా నిరూపిస్తోందన్నారు. ఐటిసి ఫుడ్స్ స్టేపుల్స్ అడ్జసెన్సీస్ విభాగ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనుజ్ రస్తగి మాట్లాడుతూ సర్వ రోగ నివారిణిగా పని చేసే ఫైబర్ బాధ్యతను చాలామంది తక్కువ అంచనా వేస్తున్నారన్నారు. భారతదేశపు ఆహారాల్లో ఫైబర్ లోపం ఉందని సర్వే వెల్లడించిందన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని ఆత్మహత్య

### నా చావుకు కాంగ్రెస్ నాయకులే కారణం చేతిపై రాసుకుని ఉరి వేసుకుని..



**ప్రజాపక్షం/యాచారం :** ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన యాచారం పోలీసుస్టేషన్ పరిధిలోని చింతపట్ల లో శుక్రవారం జరిగింది. తన చావుకు కాంగ్రెస్ నాయకులే కారణమని చేతిపై సూసైడ్ నోటు రాసుకుని ఉరేసుకున్నాడు.ఇబ్రహింపట్నం ఎసిపి రాజు,యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి, మృతుని బంధువులు కథనం ప్రకారం..చింతపట్లకు చెందిన దోడ్డి అశోక్ (47) నిరుపేదకుటుంబానికి చెందిన వ్యక్తి. ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు.ఫస్టు లిస్టులో పేరు వచ్చింది. అయితే ఏం జరిగిందో తెలియదు.. ఇందిరమ్మ కమిటి సభ్యులు తన పేరు తొలగించి ఇల్లు రాకుండా చేశారని మనస్థాపానికి గురయ్యాడు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, తన బావ బండ యాదయ్య కారణమని సూసైడ్ నోట్ చేతిపై రానుకుని ఆత్మహత్యకుపాల్పడ్డాడు.గ్రామస్తులు, సిపిఐయం, బిఅర్ఎస్ నాయకులు మృతదేహంతో గ్రా మ పంచాయతికార్యాలయంవద్ద అందోళన నిర్వహించారు.ఇబ్రహింపట్నం ఎసిపి రాజు, యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి,తహశిల్దారు అయ్యప్ప, ఎంపిడిఒ శైలజా, మండల ప్రత్యేకాధికారి మధవరావు సంఘటనస్థలానికిచేరుకుని మృతుడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహింపట్నం అసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సిపిఐయం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఎ.నర్సింహ్మా, మండల కమిటి సభ్యులు ఆలంపల్లి జంగయ్య, పిరాటి వేంకటయ్య, సత్యం, సల్ల నర్సింహ్మా, గిరికాంత్, బిఅర్ఎస్ పార్టి మండల అధ్యక్షులు కర్నాటి రమేశ్ గౌడ్,సహకారసంఘం చైర్మేన్ తొటిరెడ్డి రాజేంధర్‌రెడ్డి, ఖాజుమోహినుద్దిన్, యాదయ్యగౌడ్, ఎదటి సత్యపాల్, లిక్కి నర్సింహ్మారెడ్డి, సింగారం వెంకటయ్య ఉన్నారు.

## రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా మర్రి నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా మర్రి నిరంజన్ రెడ్డిని నూతనంగా నియామించినట్లు ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మెరకు ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అధికారికంగా గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.శుక్రవారం ఇబ్రహీంపట్నంలో మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో బడుగు బలహీన వర్గ ప్రజల అభ్యున్నతి కోసం చేస్తున్నా సేవలను కాంగ్రెస్ పార్టి అధిష్టానం గుర్తించి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం సభ్యులుగా నియామించటం అభినందనీయమన్నారు.పార్టి తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ బలోపేత్తానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు.ఈ పదవికి సహకరించిన ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే.ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి,జిల్లా ఇంజార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్,ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

# లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

### రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎంవెంకటేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల పోలీస్ శాఖ సహకారంతో చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంఅండ్ హెచ్ఒ) డాక్టర్ ఎం వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం పటిష్ఠంగా అమలు చేయడానికి డిఎం అండ్‌హెచ్ ఒ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వైజరి సమావేశం పిసిపిఎన్‌డిటి నిర్వహించారు. జిల్లా వైద్య,ఆరోగ్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని స్కానింగ్ సెంటర్లు తనిఖీ చేసి పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు.2 నెలలుగా జిల్లాలోని అన్ని ఆసుపత్రులు స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారిం చట్టము (పిసిపిఎన్‌డిటి)చట్టం ప్రకారము రికార్డుల నిర్వహణ నిబంధనల పట్ల అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లలో వున్న గైనకాలజిస్టులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నా రు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి, వ్యాస రచన పోటీలు, నాటికలు, చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ పున్నమ్, ఇమ్యూనైజేషన్ అధికారి అధికారి డాక్టర్ షిబా,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినోది, డాక్టర్ పాపరావు,డాక్టర్ అంబిక, మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల కమిషనరేట్‌కు ఐఎస్ఒ

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల కమిషనరేట్‌కు ప్రతిష్ఠాత్మక ఐఎస్ఒ 9001:2015 సర్టిఫికేషన్ లభించింది. ఈ మేరకు నాణ్యత నిర్వహణలో రాష్ట్ర పరిశ్రమల కమిషరేట్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఈగుర్తింపు తెలంగాణ రాష్ట్రంలోని పరిశ్రమల విధానాల అమలులో, పరిపాలనలో ఉన్నత ప్రమాణాలను ప్రతిబింబిస్తోంది. ఈ ఐఎస్ఒ సర్టిఫికేషన్‌ను డిఎ న్‌వి సంస్థ నిర్వహించిన రెండుదశల పరిశీలన అనంతరం ప్రదానంచేశారు. పరిశీలనలో కమిషనరేట్ కార్యకలాపాలు, డిజిటల్ వేదికలు, ముఖ్యమైనపారిశ్రామిక విధానాల అమలు అంశాలపైసమగ్రంగా పరిశీలన జరిగింది. ఈ ఐఎస్ఒ గుర్తింపు ద్వారా పారదర్శకత, తక్షణస్పందన, నిరంతర మెరుగుదల పట్ల కమిషనరేట్ నిబద్ధతను మరోసారి పించింది.ఇది రాష్ట్రంలోని వ్యాపార శ్రేయస్సును పెంపొందించే పరిశ్రమల సౌకర్యాల ప్రదానంలో కమిషనరేట్ కీలకపాత్ర పోషిస్తోందని పునరుద్ఘాటించింది.

## దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

### జనసేవ దళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్



**ప్రజాపక్షం/షాబాద్ :** దోపిడి లేని సమాజ నిర్మాణమే జనసేవ దళ్ లక్ష్యం అని జనసేవ దళ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల పట్టణంలో గత ఐదు రోజులుగా జనసేవ దళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం జరుపుకోవడంసంతోషంగాఉందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనసేవ దళ్ చేయవలసిన లక్ష్యాలను వివరిస్తూ క్రమశిక్షణ నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకరవర్గంలోని అన్ని మండలాలో గ్రామ అభివృద్ధి చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియెకరవ్గ ఇంచార్జ రామస్వామి. ఏఐయుటియూసీ మంజుల జనసేవధల్ నాయకులు కరుణ, కుమార్, మురళి కుమార్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ తల్లి, అమరవీరుల స్థూపానికి స్థలం కేటాయించండి


### ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** తెలంగాణ తల్లి, అమరవీరు స్థూపం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించేందుకు కృషి చేయాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం తాలుకా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి కోరారు. శుక్రవారం ఫరూఖ్ నగర్ ఎంపిడిఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణంలో తెలంగాణ తల్లి, అమర వీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించేందుకు కృషి చేయాలని కోరారు. పట్టణంలో అందరి విగ్రహాలు ఉన్నాయి..కాబట్టి ఈ రెండు విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని వినతిపత్రంలో ఎంపిడిఓను కోరారు. ఇందుకు ఎంపిడిఓ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి స్థలం కేటాయించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం నేతలు పి.ప్రభాకర్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, జి.సుధాకర్, రవికుమార్ గౌడ్, జాంగారి నర్సింలు, జాంగారి రవి, బాలునాయక్, కుడుముల మల్లేష్, ఎల్లోజీ, కోమరేష్, అల్లాడ శేఖర్, వడ్ల రవిశంకర్, సింగపాక శివకుమార్, రాజులు పాల్గొన్నారు.



# డిప్యూటేషన్లపై వెళ్తే వైద్యసేవలు ఎలా?

### షాద్‌నగర్ వైద్యాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అంధించాలని ప్రభుత్వం అన్ని మౌళిక సౌకర్యాలు కల్పిస్తుంటే స్థానిక వైద్యాధికారులు మాత్రం డిప్యూటేషన్లపై వెళ్ళడం ఎంత వరకు సమంజసమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో స్థానిక కమ్యూనిటి ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.డాక్టర్ విష్ణువర్ధన్ స్థానిక ప్రభు త్వ ఆసుపత్రిలో పని చేస్తున్న సుమారు 8మంది వైద్యులు డిప్యూటేషన్లపై వెళ్ళారని ఎమ్మెల్యే వీర్లపల్లి దృష్టికి తెచ్చారు. డిప్యూటేషన్లకు అనుమతి ఎవరు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా వైద్యాధికారితోపాటు సంబంధిత వైద్య ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కళ్లకు సంబంధించిన సివిల్‌సర్జన్ డాక్టర్ పద్మలత, చిన్నపిల్లల వైద్యులు హసీబ్, ఖాజా కలిమొద్దీన్, గైనకాలజిస్ట్ మాధవిలత, రాధిక, ఊపిరితిత్తుల వైద్యనిపుణులు శివ రాహుల్, కాంట్రాక్ట్ ఉద్యోగిని డాక్టర్ సౌమ్యశ్రీ, చర్మవైద్యురాలు షేక్ సింగ్ డిప్యూటేషన్లపై వెళ్ళినట్లు వివరించారు. వైద్యవృత్తిని ఎందుకు ఎంచుకున్నారని, ఇతర శాఖలకు వెళ్ళాలని సూచించారు. తక్షణమే డిప్యూటేషన్లను రద్దు చేసి యదావిధిగాస్థానిక ఆసుపత్రిలో విధులు నిర్వహించే విధంగా చూడాలని, లేని పక్షంలో సంబంధిత శాఖ మంత్రితోపాటు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు.తక్షణమే డిప్యూటేషన్లను రద్దు చేయాలని లేనిపక్షంలో సిరియస్ యాక్షన్ తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తా

### మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ఆదర్శ మున్సిపాలిటిగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని కొత్తూరు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 7,8,9,10వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లతో కలిసి రూ.20లక్షల నిధులతో అం డర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న కొత్తూరు మున్సిపాలిటిని అన్నిరంగాల్లోఅభివృద్ది చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీలతో సం బంధం లేకుండా మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని వార్డులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మెన్ డోలీ రవీందర్, కౌన్సిలర్లు మాదారం నరసింహా గౌడ్, జాండగూడెం కరుణ శ్రీ సుదర్శన్ గౌడ్, జయమ్మ జనార్ధన్‌చారి, సోమ్లానాయక్, మాధవి గోపాల్ గౌడ్, అనిత శ్రీనివాస్ గౌడ్, బ్యాగరి ప్రసన్న లత యాదయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీనమోని శ్రీనివాస్, విష్ణుమూర్తి, మాసుల లక్ష్మ య్య, రవినాయక్, యాదయ్య గౌడ్, శ్రీనివాస్‌చారి, ప్రకాష్ చారి, మేకల రాఘవేందర్ యాదవ్, బండి కృష్ణ, వడ్ల విష్ణు, బండి శ్రావణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## జోనల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బిఎల్ఆర్



**ప్రజాపక్షం/చర్లపల్లి:** శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి శ్మశాన వాటికకు 5 కోట్ల 50 లక్షల రూపాయలను మంజూరు చేసిన సందర్భంగా ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జెడ్‌సి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మహేష్‌గౌ, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం : కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబోయే ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించనున్నట్లు తెలిపారు. 60గజాల స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు విడతలుగా రూ.5లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌సిఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, ప్రత్యేక అధికారి అబ్దుల్ రెహమాన్, పంచాయతీకార్యదర్శి వెంకట్ లక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను సందర్శించిన ఆర్‌టిసి రీజినల్ మేనేజర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రైల్వే ప్రయాణీకుల రవాణా సౌకర్యార్థం నడుస్తున్న బస్సుల వివరాలను సమీక్షించేందుకు ఆర్‌టిసి సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులతో సమీక్ష జరిపి నిత్యం ఎన్ని రైళ్లు నడుస్తున్నాయని, ప్రయాణీకులు ఎంతమంది దిగటం, ఎక్కడం జరుగుతుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న బస్సుల ట్రిప్పులు ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా ఉన్నాయా లేక ఇంకా ఆవశ్యకత ఉందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణీకులకు అవసర మేరకు బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర, చెంగిచెర్ల డిపో మేనేజర్ కె కవిత, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై యువకుడి లైంగిక దాడి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మైనర్ బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఉదంతం మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన నిందితుడు అశోక్(19) శుక్రవారం మధ్యాహ్నం సమీపంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తమ కుమార్తెపై లైంగిక దాడికి ప్రయత్నించాడంటూ బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితుడిని పట్టుకొంటామని సిఐ సత్యనారాయణ తెలిపారు.



## చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించడమే లక్ష్యం

తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలోని వినాయక కన్వేషన్ హాలో స్థానిక ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యాన ఈజిఎంఎం సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువతి, యువకుల నుండి అపూర్వ స్పందన లభించింది. తాండూరు పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను స్థానిక నాయకులు, జిల్లా అధికారులు, కంపని ప్రతినిధులతో కలసి ప్రారంభించారు.ఈ జాబ్ మేళాకు 4వేల మంది నిరుద్యోగ యువతి, యువకులు ఎద్దఎత్తున్న హజరైనారు. 2764మంది యువకులు ధరఖాస్తు చేసుకోగా 1464మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. అర్హులైన అభ్యర్థులకు అక్కడిక్కక్కడే నియామక పత్రాలను ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అందజేశారు. సందర్భంగా ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గంలో చదువుకున్న ప్రతి యొక్క యువకుడికి ఉద్యోగం అందించడమే నా లక్ష్యమన్నారు. ఈ జాబ్ మేళాకు 63 ప్రైవేటు కంపనీలో 11వేల ఉద్యోగాల కోసం సుమారు 4వేల మంది నిరుద్యోగ అభ్యర్థులు హజరు కావడం అభినందనీయమన్నారు. ఈ మేగా జాబ్ మేళాను విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, యువకులకు, జిల్లా అధికారులకు, పోలీసు, పంచాయతిరాజ్ , మున్సిపల్, మెడికల్ శాఖల అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫైన్సాన్స్ కమిషన్ మెంబర్ ఎం. రమేష్ మహేరాజ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్‌పర్స్ కల్వ సుజాత, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, అంజయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, డిసిసిబి మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీగౌడ్, పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, సాయిని నారాయణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, అజయ్ ప్రసాద్, ఎ బ్లాక్ ప్రసిడింట్ లొంక నర్సిములు, టౌన్ ప్రసిడెంట్ హబీబ్‌లాల,ఆయా మండల పార్టీల అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్‌లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ఉద్యోగుల సీనియారిటీ జాబితా

పదోన్నతుల ప్రక్రియలో జాప్యాన్ని నివారించాలి

**బిఎంజిఇయు ముఖ్య సలహాదారుడు మల్లికార్జున్, అధ్యక్షుడు రాజేశ్వర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల సీనియారిటీ జాబితాను సకాలంలో రూపొందించి, త్వరితగతిన పదోన్నతులను కల్పించాలని భాగ్యనగర్ మున్సిపల్ జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ (బిఎంజిఇయు) ముఖ్యసలహాదారులు మల్లికార్జున్, అధ్యక్షుడు జి.రాజేశ్వర్ రావు అన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ సి.ఎన్.రఘు ప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు.

ఈ సందర్భంగా మల్లికార్జున్, రాజేశ్వర్ మాట్లాడుతూ పదోన్నతులకోసం, ఉద్యోగుల కోసం సీనియారిటి జాబితాలను సిద్ధం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయాన్ని తాము హృదయపూర్వకంగా అభినందిస్తున్నామన్నారు. అయితే కమిటీ సభ్యులు వారి సాధారణ విభాగ బాధ్యతలతో బిజీగా ఉంటార ని, ఇది సమావేశాలను ఏర్పాటు చేయడంలో, సీనియారిటీ జాబితాలను ఖరారు చేయడంలో జాప్యానికి దారితీస్తుందన్నారు. ఫలితంగా, పదోన్నతుల ప్రక్రియ ఆలస్యం అవుతుందన్నారు. ఈ విషయంలో సీనియారిటీ జాబితాను తయారు చేయడం, సమర్పించడం కోసం నిర్ధారించిన కాలపరిమితిలోపు ఇవ్వాలని కమిటీ సభ్యులకు స్పష్టమైన సూచనలు జారీ చేయాలని కోరారు. నిర్దిష్ట గడువును నిర్ణయించడంతో పదోన్నతులలో అనవసరమైన జాప్యాన్ని నివారించవచ్చు అన్నారు. అలాగే ఎఫ్ఆర్ఎస్ హాజరు నుండి శాశ్వతంగా శానిటరీ జవాన్లు, కమటి, కమటాన్‌లను మినహాయించాలని కోరారు. పారిశుద్ధ్య సిబ్బంది ఉదయాన్నే తమ విధులను ప్రారంభిస్తారని, స్థిరమైన రిపోర్టింగ్ పాయింట్లు లేకపోవడంతో వివిధ ఫీల్డ్ స్థానాల్లో పనిచేస్తారన్నారు. అటువంటి సందర్భంలో వారికి ఎఫ్ఆర్ఎస్ అమలు చేయడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కావున ఎఫ్ఆర్ఎస్ విధానం తొలగించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నందకిషోర్, కృష్ణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల కోటా సన్న బియ్యం పంపిణీ

**618 రేషన్ దుకాణాలకు 32933.198 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం**

**అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** వర్షాకాలం దృష్ట్యా రేషన్ దుకాణాల ద్వారా ఇస్తున్న సన్న బియ్యం లబ్ధిదారులకు మూడు నెలల కోటా ఒకే సారి ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుండి జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం లభిస్తుందన్నారు. జిల్లాలోని 618 రేషన్ దుకాణాలకు గాను 32933.198 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయించామన్నారు.

కలెక్టరేట్‌లో శుక్రవారం ఏఎస్ఓలు, డిప్యూటి తహసీల్దార్లు (సివిల్ సప్లయిస్), రేషన్ డీలర్లు, స్టేజి1, స్టేజి2 కాంట్రాక్టర్ల తో ఆయన సమావేశమై సన్నబియ్యం పంపిణీ విషయమై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్టాక్ నిలువలు, విధి విధానాలు తదితర అంశాలపై దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా జూన్, జులై, ఆగస్టు మాసాల కోటాను ఒకేసారి ఇస్తున్నందున జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో సరిపడా బియ్యం నిలువ ఉండేలా డీలర్లు చూసుకోవాలన్నారు. తమ దుకాణంలో బియ్యం 50 శాతానికి చేరుకోగానే తిరిగి గోదాముల నుండి సరుకు వచ్చే విధంగా ముందస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమయ పాలన చేస్తూ లబ్దిదారులకు రేషన్ దుకాణాలు తెరచి ఉంచాలని, వారి నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. అధికారులు. డీలర్లు, స్టేజి 1,2 కంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి మూడు నెలల బియ్యం సక్రమంగా అందేలా చూడాలన్నారు.

రేషన్ దుకాణాలకు దిగుమతి అయిన బియ్యం వివరాలను రోజువారీ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు పంపించాలని అధికార్లను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. మండల లెవెల్ స్టాక్ పాయింట్ నుండి రేషన్ దుకాణాలకు నిర్దేశించిన సమయంలోపు పూర్తి స్థాయి స్టాక్‌ను చేరవేయటంలో అలసత్వం వహించరాదన్నారు. సివిల్ సప్లయిస్ డిఎం సుగుణాబాయి. డిఎస్ఓ శ్రీనివాసరెడ్డి, డిటిలు శ్రీనయ్య, శ్రీపాల్, ఎఎస్ఓలు సంధ్య, కళ్యాణ్, రేషన్ డీలర్లు, స్టేజి 1,2 కంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా రాష్ట అవతరణ వేడుకల ఏర్పాటు

కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** జూన్ 2న తెలంగాణ రాష్ట అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను అదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జూన్ 2న నిర్వహించే వేడుకలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయాల సముదాయ భవన అవకరణలో నిర్వహించే రాష్ట అవతరణ దినోత్సవ వేడుకలలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయ శాఖల వారీగా అధికారులకు దిశా, నిర్దేశం చేశారు.

ఎలాంటి లోటుపాట్లుకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబిచేలా వివిధ శాఖలు ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పట్టణ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద సభాస్థల వేదికను పూలతో అందంగా అలంకరించేందుకు ఉద్యానవన శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సభావేదిక, సీటింగ్ చేయాలని,అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజురు పత్రాలు,నూతన రేషన్ కార్డుల, స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ, గ్రామ పంచాయతీ అధికారులకు నియామక పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ గౌరవ వందనంతోపాటు వేడుకలలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డిఇఒకు సూచించారు. వేడుకల ఏర్పాట్లులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అడిషనల్ ఎస్‌పి హనుమంతురావు, ఆర్‌డిఓ వాసుచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మానవ అక్రమ రవాణా అరికట్టడానికి ఉపాధ్యాయులు ప్రజలను చైతన్య పరచాలి

విద్యాశాఖ అధికారి రేణుకదేవి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** మానవ అక్రమ రవాణ అరికట్టడానికి ఉపాధ్యాయులు ప్రజలను చైతన్య పరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సమాజ భాగస్వాములై మానవ అక్రమ రవాణా అరికట్టడంలో తమవంతు పాత్ర వహించాలన్నారు. మనుషుల అక్రమ రవాణా నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములైనప్పుడు దీనిని సమూలంగ నిర్మూలించవచ్చు అని అన్నారు. మానవ అక్రమ రవాణా జరిగినప్పుడు టోల్ ఫ్రీనెంబర్ 1098, 100, 181 ,1930 సైబర్ వెబ్సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ రిసోర్స్ పర్సన్ శ్రీకాంత్, సుప్రియ, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూన్ 15న ఎపిఎస్‌పి హౌసింగ్ సహకార సంఘం ఎన్నికలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ పరస్పర సహాయ హౌసింగ్ సహకార సంఘం లిమిటెడ్ హైదరాబాద్ సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. సంఘం బోర్డు డైరెక్టర్ల ఎన్నికలు జూన్ 15న యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్‌లోని అన్నపూర్ణ డైనింగ్ హాల్‌లో ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎన్.వేణు గోపాల్ శర్మ, ఉప రిజిస్ట్రార్ (రిటైర్డ్) ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ బై లా నం.23 ప్రకారం, ఒక డైరెక్టర్ స్థానం ఎపిఎస్‌పి అధిపతికి రిజర్వ్‌గా ఉంటుంది. ఆయనే సంఘ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన వివరాల ప్రకారం నామినేషన్లు జూన్ 4వ తేదీ ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. సభ్యులు తమ నామినేషన్లు ఆర్ఎస్ఐ క్వార్టర్ నం.19, యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్, హైదరాబాద్45లో సమర్పించాలి. నామినేషన్ల పరిశీలన జూన్ 7వ తేదీన ఉదయం 11.30గంటలకు జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు జూన్ 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంది. ఎన్నికలరోజు పోలింగ్ అనంతరం అదే ప్రదేశంలో సాయంత్రం 4.30గంటల నుండి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతుంది. సభ్యులు ఈ ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, ఏవైనా సందేహాలుంటే ఎన్నికల అధికారి మొబైల్ నంబర్ 9959975363 లేదా కె.ఎన్.రెడ్డి మొబైల్ నంబర్ 9515011919 ను సంప్రదించాలని కోరారు.



## దినసరి కార్మికులకు జీత భత్యాలు చెల్లించేందుకు చర్యలు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**ప్రభుత్వ విభాగాల్లో వేతన సవరణ కమిటీ పరిగణనను బట్టి దినసరి కార్మికులకు జీత భాత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మాస్టర్ రోల్ ఉదోగ్య వేతన స్థిరీకరణ పై వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న హాజరు పట్టికలో లేని కార్మికులకు వేతన సవరణ కమిటీలో కార్మికులకు వేతన సవరణ కమిటీ సిఫారసు మేరకు కనీస వేతనాలను అందించాలన్నారు. నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం కలిగిన దినసరి కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనాల పెంపుకు అనుగుణంగా అందించాలన్నారు. గ్రామీణ మున్సిపల్ పరిధిలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యానాయక్ డిహెచ్‌ఎస్‌ఓ సత్తార్, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, విద్యుత్ శాఖ ఎస్ఇరవిప్రసాద్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలు

* 16 వరకు దరఖాస్తుల గడువు * 20న డ్రా ద్వారా ఎంపిక

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** బెస్ట్ అవెలబుల్ స్కూళ్లలో ఒకటో తరగతి నుండి ప్రవేశాల నిమిత్తం షెడ్యూల్ కులాలకు చెందిన ఐదు నుండి ఆరేళ్ల వయస్సున్న బాలబాలికల నుండి ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ జూన్ ఒకటి నుండి ప్రారంభమై జూన్ 16 వరకు కొనసాగుతుందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి పేర్కొన్నారు. అభ్యర్థులు మేడ్చల్ జిల్లా వాస్తవ్యులై ఉండాలని, కుల, ఆదాయ సర్టిఫికెట్ మీసేవా కేంద్రం ద్వారా పొందాలని, అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ వాసులైతే రూ.లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతవాసులైతే రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. ఒక్క కుటుంబం నుండి ఒక్క విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవలబుల్ పాఠశాలలో ప్రవేశం లభిస్తుందని, దరఖాస్తు ఫారాలను జిల్లా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం నుండి పొంది పూర్తిచేసిన దరఖాస్తులను జూన్ 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు సమర్పించాల్సి ఉంటుందని, అభ్యర్థుల ఎంపిక జూన్ 20న డ్రా ద్వారా చేస్తామన్నారు. మేడ్చల్ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలుగా చింతల్‌లోని ఆర్ఎస్‌కె ఉన్నత పాఠశాల, కుషాయిగూడలోని బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, కూకట్‌పల్లిలోని బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, బోడుప్పల్‌లోని పద్మశ్రీ పాఠశాలలు ఉన్నాయన్నారు.

## వైభవంగా రేణుకా ఎల్లమ్మ జాతర

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మండల పరిధి కర్నాటక సరిహద్దు ప్రాంతంలోని కోత్లాపూర్ గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మతల్లి జాతర మహోత్సవాలు వైభవంగా సాగాయి. జాతర ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రేణుకా ఎల్లమ్మతల్లి షిడే ఉత్సవాలు వైభవంగా సాగింది. షిడే ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నియోజవర్గ ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు, ప్రజలందరు సంతోషంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు పెద్దఎత్తున్న పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. రథానికే షిడే కట్టి అమ్మవారిని ఊరేగించారు. ఎంఎల్ఏ వెంట రాందాస్, గోపాల్, రాములు, ఆలయ కమిటి చైర్మన్ , మండల నాయకులు, తదితరులు ఉన్నారు.

## దేవాలయ చైర్మన్‌గా బాలరాజ్ గౌడ్

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ :** ఆంజనేయ,షరిడి సాయిబాబా,అయ్యప్ప సామి చారిటబుల్ ట్రస్ట్‌గా నూతన చైర్మన్‌గా బాలగోని బాలరాజ్ గౌడ్ నియమితులయ్యారు. పోచారం మున్సిపాలిటీలో అన్నోజిగూడలో ఆంజనేయ స్వామి దేవాలయం,సాయిబాబా, అయ్యప్ప స్వామి దేవాలయం చారిటబుల్ ట్రస్ట్ నూతన చైర్మన్‌గా బాలగోని బాలరాజ్ గౌడ్, జనరల్ సెక్రటరీగా బాలగోని వెంకటేష్ గౌడ్‌లు నియమితులైనందుకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ దేవాలయానికి నన్ను చైర్మన్గా చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ బాధ్యతలు నాపై పెట్టినందుకు దేవాలయాల అభివృద్ధికి తోడ్పడతానని అన్నారు. ఆంజనేయ స్వామి,సాయిబాబా,అయ్యప్ప స్వామి దేవాలయం చారిటబుల్ ట్రస్ట్‌లో మొత్తం 9మంది సభ్యులు చైర్మన్, సెక్రటరీ, ట్రెజరర్, జాయింట్ సెక్రెటరీలుగా 2 సం.లు విధులు నిర్వహిస్తారని తెలిపారు.

## అనంత సాహితి నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన అధ్యక్షులుగా టి.ఆశీర్వాదం

**ప్రజాపక్షం/నవాబుపేట్ :**అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక రెండు సంవత్సరాలకు (2023–2025) గాను ఎన్నుకున్న కార్యవర్గ పదవీకాలం ఈ నెలలో ముగిసిన సందర్భంగా నూతన కార్యవర్గాన్ని రాబోయే రెండు సంవత్సరాలకు (2025–2027)గాను ఈ క్రింది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టి.ఆశీర్వాదం, ప్రధాన కార్యదర్శిగా కె.మల్లేశం, గౌరవ అధ్యక్షులుగా బొబ్లాద్ రాఘవేంద్ర చార్యులు, ఉపాధ్యక్షులుగా వడిచర్ల సత్యం, కోశాధికారిగా డాక్టర్ మున్నూరు, రాజు సహకార్యదర్శిగా ఈడిగ సుధాకర్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా కె.రెడ్యా రాథోడ్, మహిళా కార్యదర్శులుగా శ్రీమతి అనురాధ, శ్రీమతి సునీత, సాంస్కృతిక కార్యదర్శిగా పసుల హనుమంతు, కార్యాలయ కార్యదర్శులుగా బండి మల్లికార్జున్, దివాకర శాస్త్రి, ప్రచార కార్యదర్శులుగా ఎన్నారం శ్రీనివాస్, అంజిలప్ప, మీడియా కార్యదర్శులుగా టీ.సంజీవ్ మమ్మద్ రవూఫ్ కె.శ్రీనివాస్, ప్రధాన సలహాదారులుగా శ్రీతుల్జా రామ్ సింగ్ ఠాకూర్, సలహాదారులుగా శ్రీ బి.పి నర్సింలు గుప్త, డాక్టర్ బాగయ్య, డాక్టర్ మలుగ అంజయ్య, కోటం చంద్రశేఖర్, బి.ఎన్ గౌడ్,డాక్టర్ ఈటల సమ్మన్న, పట్టాల అశోక్, కడియాల మధుసూదన్ రావు, గుడ్ల పరమేశ్వర్, శెట్టి రాచప్ప గారలను ఎన్నుకున్నట్లు వ్యవస్థాపకులు దోరవేటిచెన్నయ్య వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తూర్పు మల్లారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. అలాగే వివిధ ప్రాంతాలకు సంబంధించి ఈ క్రింది వారిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కొడంగల్ నుండి మాసాని వెంకటయ్య మహేష్ కురుమ, పరిగి నుండి చిగురాలపల్లి ప్రసాద్ మహమ్మద్ ఉస్మాన్ అలీ, బంటారం నుండి వెంకట ధర్మచక్ర, ధారూర్ నుండి కుమ్మరి శ్రీనివాస్ బైండ్ల నర్సింలు, తాండూరు నుండి శ్రీమతి ప్రతిభ భారతి కరణం మాణిక్ రావు హాజీపూర్ శ్రీనివాస్, శంకర్పల్లి నుండి శ్రీనివాస్ మధుర, కులకచెర్ల నుండి పల్లె శీనయ్య, దండు వెంకట్ రాములు, యాలాల్ నుండి వంశరాజ్ వెంకట్, మహమ్మదాబాద్ నుండి మల్లేశం, నంచర్ల నుండి శ్రీనివాస్, వికారాబాద్ నుండి బూరెం రాజు జంగం మల్లేశం, సంగారెడ్డి నుండి మా అమ్మ షరీఫ్ సంజీవులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ వై. నర్సింలు తెలపడం జరిగింది.

## క్రీడ

# సడన్‌గా ఇంగ్లాండ్‌కు కేఎల్ రాహుల్..!



**ముంబై:** టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్.. హుటాహుటిన ఇంగ్లాండ్ వెళ్లనున్నాడు. సోమవారం అతను ఇంగ్లాండ్ వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాడు. జూన్‌లో ఇంగ్లాండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు రెడీ అవుతున్న సీనియర్ టీమిండియా క్రికెటర్.. ప్రిపరేషన్ కోసం ముందే వెళ్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపు ఆడిన కేఎల్ రాహుల్.. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో టూరు చేస్తున్న ఇండియా ఏ జట్టు తరపున ఆడాలనుకుంటున్నాడు. సీనియర్ల టెస్టు సిరీస్‌కు ఎంపికైన అతను.. ప్రాక్టీసు కోసం ముందే ఇంగ్లాండ్‌కు వెళ్లాలనుకుంటున్నాడు. దీని కోసం అతను బీసీసీఐ నుంచి పర్మిషన్ కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టు టెస్టు మ్యాచ్ ఆడనున్నది. మే 30వ తేదీ నుంచి క్యాంటర్ బరీలో తొలి టెస్టు జరగనున్నది అయితే ఆ మ్యాచ్‌ను రాహుల్ అందుకోలేదు. కానీ రెండవ మ్యాచ్‌లో ఆడేందుకు అనుమతి పొందిన కేఎల్ రాహుల్.. తొందరగా ఇంగ్లాండ్ వెళ్లేందుకు రెడీ అయ్యాడు. సోమవారం ఇంగ్లాండ్‌కు రాహుల్ వెళ్తున్నాడని, ఇండియా ఏ తరపున రెండో అనధికార టెస్టులో ఆడనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. జూన్ 6వ తేదీన ఇండియా ఏ, ఇంగ్లాండ్ లయన్స్ జట్ల మధ్య రెండో అన్‌అఫీషియల్ టెస్టు ప్రారంభంకానున్నది. ఇక సీనియర్ మెన్స్ క్రికెట్ జట్టు జూన్ 13వ తేదీన ప్రాక్టీసు మ్యాచ్ ఆడనున్నది. 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జూన్ 20వ తేదీ నుంచి లీడ్స్‌లో ప్రారంభంకానున్నది.

# ఐపిఎల్ స్టార్‌ను కలిసిన ప్రధాని మోదీ



**పాట్నా:** వైభవ్ సూర్యవంశీ .. ఐపిఎల్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. ఆ 14 ఏళ్ల కుర్రాడు.. ఈ యేటి ఐపీఎల్‌లో సెంచరీ చేశాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన ఆ టీనేజర్‌ను శుక్రవారం ప్రధాని మోదీ కలుసుకున్నారు. బీహార్ పర్యటనలో ఉన్న మోదీ.. పాట్నా విమానాశ్రయంలో వైభవ్‌ను మీట్ అయ్యారు. వైభవ్ పేరెంట్స్ కూడా మోదీని కలిశారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశి వీర ప్రతాపం చూపించి కేవలం 35 బంతుల్లో సెంచరీ కొట్టిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీని కలిసిన సమయంలో.. ఆయన పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నాడు వైభవ్. యంగ్ క్రికెటర్‌ను కలిసిన విషయాన్ని ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. యువ సంచలన క్రికెటర్, అతని కుటుంబాన్ని పాట్నా ఎయిర్‌పోర్టులో కలుసుకున్నట్లు ఆ పోస్టులో రాశారు. వైభవ్ క్రికెట్ నైపుణ్యాన్ని యావత్ దేశం కీర్తిస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నట్లు మోదీ తెలిపారు. ఐపీఎల్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశి మొత్తం 252 రన్స్ స్కోర్ చేశాడు. అయితే జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై అతను చెలరేగిన తీరు అద్వితీయం. తన స్ట్రోక్ ప్లేతో యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడతను.

# గుజరాత్.. ఇంటికి

## క్వాలిఫయర్-2కు ముంబయి



చండీగఢ ఐపిఎల్ 2025లో ముంబయి ఇండియన్స్ క్వాలిఫయర్ 2కి దూసుకెళ్లింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆదివారం జరగనున్న క్వాలిఫయర్2లో పంజాబ్, ముంబయి తలపడనున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన హార్దిక్ సేన.. 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో గుజరాత్ పోరాడి ఓడింది. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (80; 49 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (48; 24 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) చెలరేగినా గుజరాత్‌కు ఓటమి తప్పలేదు. కమిందు మెండిస్ (20), రూథర్‌ఫోర్డ్ (24), రాహుల్ తెవాతియా (16*) షారుక్ ఖాన్ (13) పరుగులు చేశారు. చివర్లో ముంబయి బౌలర్లు పుంజుకొని పరుగులు కట్టడి చేయడంతో స్కోరు వేగం తగ్గి గుజరాత్ ఓటమి చవిచూసింది. ముంబయి బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ 2, బుమ్రా, రిచర్డ్ గ్లిసన్, శాంట్నర్, అశ్వని కుమార్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి భారీ స్కోరు చేసింది. రోహిత్ శర్మ (81; 50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సులు) దంచికొట్టాడు. జానీ బెయిర్‌స్టో (47; 22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) త్రుటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ (33; 20 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు), తిలక్ వర్మ (25; 11 బంతుల్లో 3 సిక్సులు), హార్దిక్ పాండ్య (22*; 9 బంతుల్లో 3 సిక్సులు) క్రీజులో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించారు. గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టారు.

## లీల

# 'బెంజ్'లోకి 'భీమ్లా' నటి?



పలు రంగాల్లో మంచి టాలెంట్ కలిగిన స్టార్స్‌లో రాఘవ లారెన్స్ కూడా ఒకరు. మరి లారెన్స్ హీరోగా, దర్శకునిగా అలాగే సంగీత దర్శకునిగా ఇంకా డాన్స్ మాస్టర్‌గా ఎన్నో సినిమాలు చేసిన తాను లేటెస్ట్‌గా చేస్తున్న సాలిడ్ చిత్రమే బెంజ్. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తన సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వస్తున్న నాలుగో సినిమాగా తన కథతో దర్శకుడు బక్కియరాజ్ కణ్ణన్ తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త మీనన్ లాక్ అయ్యినట్టుగా ఇప్పుడు టాక్ వినిపిస్తుంది. తెలుగులో భీమ్లా నాయక్‌తో ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ అక్కడ నుంచి మంచి సినిమాలు చేస్తూనే బిజీగా ఉంది. ఇక ఈ సాలిడ్ ప్రాజెక్ట్ కోసం లాక్ చేసినట్టుగా కోలీవుడ్‌లో రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది.

# జార్జియాలో 'అఖండ 2'..

## షూటింగ్ వీడియో వైరల్



నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సంచలన చిత్రం 'అఖండ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా కీలక షెడ్యూల్ కోసం చిత్ర బృందం జార్జియా చేరుకుంది. అక్కడ బాలయ్యపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. 'అఖండ' సృష్టించిన ప్రభంజనం తర్వాత, దాని సీక్వెల్ 'అఖండ–2' (అఖండ–2 తాండవం)పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్, ఇప్పుడు జార్జియాలోని సుందరమైన ప్రదేశాలను ఎంచుకుంది. బోయపాటి శ్రీను ఈ యాక్షన్ బ్లాక్‌లను అత్యంత భారీ ఎత్తున ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో విదేశీ ఫైటర్స్ కూడా పాల్గొననున్నారని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు ఈ జార్జియా షెడ్యూల్‌లోనే బాలయ్య రెండో పాత్రకు సంబంధించిన ఒక భారీ ట్విస్ట్ కూడా రివీల్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతా

## కన్నడ భాష వివాదంపై కమల్ హాసన్



తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలకు గానూ ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలనే డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా వివాదంపై కమల్ హాసన్ స్పందించారు. ఈ విషయంలో క్షమాపణలు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. తప్పు చేసి ఉంటేనే క్షమాపణలు చెప్తానని స్పష్టం చేశారు. 'నేను తప్పు చేస్తే క్షమాపణలు చెప్తాను. లేదంటే చెప్పను. ఇది నా శైలి. ఈ విషయంలో ప్రజలు జోక్యం చేసుకోవద్దు' అంటూ చెప్పుకొచ్చారు. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం అని తాను చట్టం, న్యాయాన్ని నమ్ముతానని వ్యాఖ్యానించారు.

# పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే?



టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరిసేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం వెల్లడించింది. అయితే ఇటీవల ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

తాజాగా ఈ వార్తలపై స్పందించింది రాధికా ఆప్టే. మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. తాను ఈ సినిమాలో భాగమైనట్లు తనకే తెలియదని రాధికా ఆప్టే సరదాగా చెప్పారు. ఇలాంటి ఊహాగానాలు తనకు ఆశ్చర్యం కలిగిస్తాయని, ఈ వార్తల గురించి తనకేమీ తెలియదని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు చాలా ఫన్నీగా అనిపిస్తాయని వెల్లడించారు.

దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం.

# హిందూత్వం అమలుకే..

## ఢిల్లీలో నిరుపేదల బస్తీ ఖాళీపై నారాయణ విమర్శ

### కూల్చిన ఇళ్ల స్థానంలో మేడలు కట్టివ్వాలని డిమాండ్




**న్యూఢిల్లీ:** నిరుపేదల బస్తీని ఖాళీ చేయించి దానిని కార్పొరేట్ ఆశ్రిత పెట్టుబడిదారులకు దారాదత్తం చేయడమే బీజేపీ ప్రభుత్వ నిజమైన ఉద్దేశమని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. పేదలందరినీ తొలగించడం ద్వారా హిందూత్వ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, ఢిల్లీ నగర పరిధిలో ఎస్‌సీలు, ఎస్‌టీలు లేకుండా చేయాలని చూస్తున్నదన్నారు. పూర్వం రాజుల తరహా పద్ధతులను ఆధునిక పాలకులు అనుసరిస్తున్నారని నారాయణ దుయ్యబట్టారు. ఏ స్థలంలో అయితే కూల్చివేతలు చేపట్టారో అక్కడ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి, పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆధునికీకరణ, సుందరీకీకరణ, అభివృద్ధి నెపంతో పేదలను తొలగించాలంటే సీపీఐ ఊరుకోదని వక్కాణించారు. నిరుపేద ఢిల్లీవాసుల పోరాటానికి సీపీఐ పూర్తిస్థాయిలో అండగానిలుస్తుందని నారాయణ నొక్కి చెప్పారు. ఢిల్లీలోని మురికివాడల తొలగింపును ఆక్షేపించారు. పేదలకు వారి ఇళ్లు ఉండే స్థలంలో కొత్త భవనాలు కట్టివ్వాలని నొక్కిచెప్పారు. అలా చేస్తే జీవన స్థితిగతులు మెరుగవుతాయని, పేదలకు ఉపాధి లభిస్తుందని, పిల్లలు చదువుకోగలరన్నారు. సిపిఐ ఢిల్లీ సమితి అధ్వర్యంలో నారాయణ, ప్రొఫెసర్ దినేశ్ వార్ష్నే (సీపీఐ ఢిల్లీ కార్యదర్శి), ఢిల్లీ కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్‌లాల్, కేహర్ సింగ్, అబ్బర్ అహ్మద్, సమితి సభ్యుడు బబ్బన్ కుమార్ సింగ్‌తో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం కూల్చివేతలు జరిగిన మదరాసీ క్యాంపు, జంగ్‌పురా బి బస్తీలో పర్యటించారు. తమిళనాడు నుంచి 5060 ఏళ్ల కిందట వలస వచ్చి ఇక్కడే స్థిరపడిన బాధితులను పరామర్శించారు. ఈ ప్రాంతంలో ఉండేవారు ఢిల్లీలోని నిరుపేదలని, వీరు ఇంటి పనివారిగా, సఫాయి కర్మచారీలుగా, రోజువారీ కూలీలుగా, చిరు విక్రేతలుగా ఉన్నారని ప్రతినిధులు గుర్తించారు. బస్తీ ప్రజల దీనస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఇక్కడే మేడలు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. సుందరీకరణ పేరిట పేదల ఇళ్లు కూల్చేయడం, నరేలా ప్రాంతానికి 50కిమీల దూరానికి పంపేయాలని అనుకోవడం దుర్మార్గమని నారాయణ అన్నారు. 2024లో నీళ్లు నిలిచిపోవడానికి కారణంగా చెబుతూ పేదల బస్తీని ఖాళీ చేయించడం ఆమోదయోగ్యం కాదన్నారు. మెట్రో రైల్వే నిర్మాణాల వల్ల నీరు నిలిచిందని గుర్తుచేశారు. నీరు నిలిచిపోయే సమస్యను ప్రత్యామ్నాయ మార్గాల్లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కారణాన్ని చూపు తూ పేదల బస్తీని ఖాళీ చేయించి దానిని కార్పొరేట్‌లకు ఊడిగం చేయడమే బీజేపీ ప్రభుత్వ నిజమైన ఉద్దేశమని నారాయణ వ్యాఖ్యానించారు. ఈ చర్యలను సీపీఐ అడ్డుకుంటుందన్నారు.

# నల్లగొండ మార్గదర్శకమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా పంటలు, ధాన్యం సేకరణ, నీటి పారుదల విషయాల్లో రాష్ట్రంలోనే నెంబర్ 1 స్థానంలో నిలిచిందన్నారు. ఒకప్పుడు కరువు జిల్లాగా ఉన్నా ఉమ్మడి నల్లగొండ జిల్లా నేడు పాడిపంటలకు నిలయంగా మారిందన్నారు. దేశంలోనే ధాన్యభాండాగారంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఉమ్మడి నల్లగొండ జిల్లా మార్గదర్శం కావాలన్నారు. అధికారులు ఇప్పటి వరకు ఉన్న నిర్లిప్తతను వదిలి పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నుండి ప్రజల సేవలకు తమతో పాటు అధికారులు పునరాంకితం కావాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ల ఆధ్వర్యంలో అధికారులందరు ప్రతి భావంతంగా పని చేయాలన్నారు. నీటి పారుదల విషయంలో కృష్ణ జలాలను పూర్తి స్థాయిలో వాడుకునేందుకు తమ ప్రభుత్వ హాయాంలోనే ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌ను పూర్తి చేస్తామన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలులో ప్రజా ప్రతినిధుల సూచనలను పరిగణలో తీసుకోవాలని అధికారులను సూచించారు. శాసన సభ్యుల మాటే చివరి మాటగా పాటించాలన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం లోపు సివిల్ పనులన్నింటిని టెండర్లు, ఇతర పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ సామర్థ్యం కలిగిన గోదాంలను మంజూరు చేస్తామని, ఇందుకు గాను స్థల సేకరణ చేయాలని కలెక్టర్‌లను కోరారు. ఎఈఓల కొరత తీవ్రంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశం దృష్టికి తీసుకరాగా కలెక్టర్‌లకే వారి నియమించుకునే అధికారం ప్రభుత్వం ఇచ్చిందన్నారు. సత్వరమే నియమకాలు చేపట్టుకోవాలన్నారు.

**చివరి గింజ వరకూ కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే : మంత్రి ఉత్తమ్**

దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసిన ఘతన తమ కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో 29మే 2023 నాటికి రాష్ట్రంలో యాసంగి వరి ధాన్యాన్ని కేవలం 47లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే తమ ప్రభుత్వం 29 మే నాటికి ఈ సీజన్‌లో 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. రానున్న ఐదు సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరం ద్వారా సాగునీటిని అందించనప్పడికి ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని చెప్పారు. దేశంలో తెలంగాణ నెంబర్ 1గా నిలిచిందని తెలిపారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి ప్రాజెక్టులకు ఆయకట్టు ప్లాన్ ముందే సిద్ధం చేసి ప్రకటిస్తామన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పితో పాటు ఇతర ప్రాజెక్టుల్లోని పూడికతీత పనులను ప్రభుత్వం చేపడుతుందన్నారు.

గతంలో మొదలు పెట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులను ఎంపిక చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలనను ఉల్లంగించవద్దని, ఉల్లంగించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

**సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వానికి మంచిపేరు : మంత్రి కోమటిరెడ్డి**

సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందని రాష్ట్ర రోడ్ల, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో లేకున్నా సన్నబియ్యం పంపిణీతో పాటు లక్షలాది మంది నిరుద్యోగ యువతకు రాజీవ్ యువవికాసం ద్వారా రాయితీపై బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తాము ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 12లక్షల ఎకరాల భూములు సాగులో ఉన్నాయని గతంతో పోలిస్తే ఈ సంవత్సరం 2లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఎక్కువగా రైతులు పండించారని చెప్పారు. ఈ ధాన్యం సేకరణలో నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠిని అభినందించారు. తమ శాఖ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యధికంగా రూ. 1700ల కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించినట్లు వెల్లడించారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ పూర్తి చేయడంలో అధికారులను వారు అభినందించారు. ఈ సమావేశంలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి కలెక్టర్లు త్రిపాఠి, హన్మంతరావు, జిల్లా ఎస్‌పి కె నర్సింహ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)




భారతీయ ప్రజల మనసులను కలచి వేసింది, టెర్రరిజం అనేది ఒక శాపం, అది మానవత్వానికే అవమానం, పాకిస్తాన్ ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ తీవ్రంగా ఖండిస్తున్నది' అని ఆ తీర్మానం పేర్కొన్నది. 'ఉగ్రవాదుల క్రూరమైన నేరానికి బలైన బాధిత కుటుంబాలకు ఎఐటియుసి తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మన సైనిక బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఉగ్రవాద శిబిరాలపై సూటిగా గురిపెట్టి చేసిన దాడి అని అందుకు భద్రతా దళాలకు ఏఐటీయూసీ తరపున కృతజ్ఞతలు, అభినందనలు తెలుపుతున్నట్లు ఆ తీర్మానం పేర్కొన్నది. దేశంలో హిందూ రాజ్యం స్థాపించాలన్న తమ దుష్ట సంకల్పాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ప్రస్తుత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది, ఆర్‌ఎస్‌ఎస్ సంకల్పిస్తున్న మెజారిటీ ఆధిపత్యవాద స్థాపన కోసం మన సమాజాన్ని, చట్టాలను, వీధి బలగాలను, ఎన్నికల ప్రచారాన్ని, ఎన్నికలను అన్నిటినీ లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నది'' అని ఆ తీర్మానం హెచ్చరించింది. ఉగ్రవాద చర్యలను ముక్తకంఠంతో ఖండించడంలో, టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడటంలో ఎఐటియుసి ముందు పీఠిన నిలుస్తుంది, అదే సమయంలో మన మైనారిటీ సోదరులను అపఖ్యాతి పాలు చేసే, దూషించే ఎలాంటి చర్యలకు తావు ఇవ్వదు, ఈ విషయంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కుట్రలకు వ్యతిరేకంగా గట్టిగా ఎదురొడ్డి పోరాడుతుంది, ఫాసిజానికి వ్యతిరేకంగా కూడగట్టే సంఘీభావమే మనబలం, విచ్ఛిన్నవాదుల విషానికి కార్మికవర్గ ఐక్యతే విరుగుడు, అని ఆ తీర్మానంలో ఎఐటియుసి పేర్కొన్నది. ఈ తీర్మానాన్ని జనరల్ కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. ఎఐటియుసి ప్రధానకార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికపై రెండోరోజు విస్తృతమైన చర్చలు కొనసాగాయి. పలు తీర్మానాలను కూడా జనరల్ ఆమోదించింది. సమావేశంలో తెలంగాణా రాష్ట్ర సమితి అధ్యక్షుడు యూసఫ్, ఆంధ్రప్రదేశ్ సమితి గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. వెంకటసుబ్బయ్య తదితరులు మాట్లాడారు.

# ఎన్టీఆర్ జాతీయ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)



అవార్డులను ఈ కమిటీ గురువారమే ప్రకటించగా.. మిగతా పదేళ్లకు సంబంధించిన అవార్డులను శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించింది. అనంతరం జాబితాను సిఎం ఎ.రేవంత్‌రెడ్డికి జ్యూరీ సభ్యులు స్వయంగా కలిసి అందజేశారు.

**ఉత్తమ చిత్రాలు ఇవే..**

2014 ఉత్తమ చిత్రంగా రన్ రాజా రన్, రెండో ఉత్తమ చిత్రంగా పాఠశాల,
మూడో ఉత్తమ చిత్రంగా అల్లుడు శీను
2015ఉత్తమ చిత్రం: రుద్రమదేవి, రెండో ఉత్తమ చిత్రంగా కంచె, మూడో ఉత్తమ చిత్రంగా శ్రీమంతుడు
2016 ఉత్తమ చిత్రంగా శతమానం భవతి, రెండో ఉత్తమ చిత్రంగా పెళ్లిచూపులు,
మూడో ఉత్తమ చిత్రంగా జనతా గ్యారేజ్
2017 ఉత్తమ చిత్రంగా బాహుబలి కంక్లూజన్, రెండో ఉత్తమ చిత్రంగా ఫిదా, మూడో ఉత్తమ చిత్రంగా ఘాజీ
2018ఉత్తమ చిత్రంగా మహానటి, రెండో ఉత్తమ చిత్రంగా రంగస్థలం, మూడో ఉత్తమ చిత్రంగా కేరాఫ్ కంచర్లపాలెం
2019ఉత్తమ చిత్రంగా మహర్షి, రెండో ఉత్తమ చిత్రంగా జెర్సీ, మూడో ఉత్తమ చిత్రంగా మల్లేశం
2020 ఉత్తమ చిత్రంగా అల వైకుంఠపురంలో, రెండో ఉత్తమ చిత్రంగా కలర్ ఫోటో,
మూడో ఉత్తమ చిత్రంగా మిడిల్ క్లాస్ మెలోడీస్
2021ఉత్తమ చిత్రంగా ఆర్‌ఆర్‌ఆర్, రెండో ఉత్తమ చిత్రంగా అఖండ,
మూడో ఉత్తమ చిత్రంగా ఉప్పెన
2022 ఉత్తమ చిత్రంగా సీతారామం, రెండో ఉత్తమ చిత్రంగా కార్తికేయ 2,
మూడో ఉత్తమ చిత్రంగా మేజర్
2023ఉత్తమ చిత్రంగా బలగం, రెండో ఉత్తమ చిత్రంగా హనుమాన్,
మూడో ఉత్తమ చిత్రంగా భగవంత్ కేసరి
విజయ్ దేవరకొండకు ప్రత్యేక అవార్డు..

# అసలు స్టంట్ రేటెంత?

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డులోని పాత రిజిస్టర్ ఆఫీస్ సందులో గల ఒక ఆసుపత్రికి బోనకల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఛాతీ నొప్పితో వచ్చాడు. పైన పేర్కొన్నట్లు హడావుడి సృష్టించి రూ.1.80లక్షలు గుంజిపారేశారు. ఇదేమని ఆయన బంధువులు, కొందరు పెద్ద మనుషులు అడిగితే ఆ ఆసుపత్రి నిర్వాహకుడు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. అసలు స్టంట్ రేటెంత అంటే నీళ్లు నమిలాడు. రూ.70వేల స్టంట్‌కు రూ.1.80 లక్షలు గుంజారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించవచ్చు. చివరగా ఆయన చెప్పొచ్చేదేమిటంటే నేను బిల్లు తగ్గిస్తే మరి ఆర్‌ఎంపికి ఎవరు ఇవ్వాలి అని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. ఎవరికో కమిషన్ ఇవ్వడం కోసం రోగులను పీల్చి పిప్పి చేయడం ఏమిటంటే ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ అడ్డంగా వాదించాడు. ఇది ఒక ఆసుపత్రికో ఒక రోగికో పరిమితం కాలేదు. చాలా ఆసుపత్రుల్లో ఇదే తంతు. అసలు వైద్యానికి అయ్యే ఖర్చు ఎంత అన్నది కాదు. రోగి కట్టే స్థాయి ఎంత, అతని వద్ద నుంచి ఎంత గుంజుకోవచ్చునన్నదే ఇప్పుడు ఆసుపత్రుల నిర్వాహకుల ఆలోచనగా మారింది. వైద్య రంగంలో తలమానికంగా ఉన్న ఖమ్మం నగరంలో కొందరి శృతి మించిన దోపిడీ రోగుల పాలిట శాపంగా మారింది. ఏ వైద్యమైనా కాసులకు కక్కుర్తి పడుతున్నారు. ఒక్కొక్కరు మూడు నాలుగు పేర్లతో ఆసుపత్రులు నిర్వహిస్తూ అడ్డంగా దోపిడీ చేస్తున్నారు. ఇదే సమయంలో ఆర్థిక పరిస్థితులను గమనించి అతి తక్కువ ఖర్చుతో వైద్య సాయం అందించి బీద బిక్కి పట్ల సానుభూతితో వ్యవహరించే ప్రైవేటు ఆసుపత్రుల యజమాన్యాలు కూడా ఉండడం గమనార్హం. సెతస్కోప్ పట్టుకుందే డబ్బు సంపాదించడానికి అన్న ధోరణితో వ్యవహరించే వారిని ఎవరు నియంత్రించాలన్నదే ఇప్పుడు ప్రజలను వేధిస్తున్న ప్రశ్న.

**వైద్యాధికారుల పర్యవేక్షణ ఏదీ?**

ప్రైవేటు ఆసుపత్రుల్లో పరీక్షల మొదలు ఐసియు వరకు దేనికి ఎంత వసూలు చేయాలనే బోర్డులు ఉంటాయి. వాటిని అతిక్రమిస్తే చర్యలుంటాయన్న హెచ్చరికలు పక్కనే ఉంటాయి. కానీ అవి ఎప్పుడు గోడకు అలా వ్రేలాడుతూనే ఉంటాయి. ఆ బోర్డులో ఉన్న ప్రకారం వసూలు చేయడం జరగదు. అదే సమయంలో చర్యలు తీసుకున్న దాఖలాలు ఉండవు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత కంప్యూటర్ బిల్లులు ఇచ్చే ఆసుపత్రుల సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. అంత తెల్ల కాగితంపై పెన్నుతో రాయడం ఇది ఫలానా ఆసుపత్రి బిల్లు అంటే అసలు ఆ రోగే మా ఆసుపత్రిలో చేరలేదని బుకాయించడం అలవాటుగా మారింది. ఇంత జరుగుతున్న వైద్య ఆరోగ్య శాఖ ఏమి చేస్తుందంటే ఏమి చేయడం లేదన్న సమాధానమే వస్తుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com